# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్
శుక్రవారం
27-09-2024
వెల. రూ.5
• సంపుటి : 8 • సంచిక: 277
పేజీలు : 8

Hyderabad | Karimnagar | Nizamabad | Nallagonda | Mahaboobnagar | Warangal | Khammam | Amaravathi | Tirupathi | Kurnool | Eluru | Visakhapatnam | Ananthapuramu | Kadapa


## లెబనాన్‌పై భూతల దాడులకు సర్వం సిద్ధం!

సిరియా-లెబనాన్ సరిహద్దులపై భీకర దాడులు

కుప్పకూలిన అపార్ట్మెంట్.. 23 మంది మృతి

హిజ్బుల్లా వైమానిక దళ కమాండర్ సోరౌర్ కూడా

ఆయుధాల స్మగ్లింగ్ టన్నెళ్ల ధ్వంసం

హిజ్బుల్లా అంతమే మా లక్ష్యం: నెతన్యాహు

భారతీయులు.. వెనక్కి రండి విదేశాంగ శాఖ

7




### ఆవిష్కరణలు, అభివృద్ధి వరకే
## పరిమితం కారాదు

సాంకేతిక ఉన్నతీకరణ పేదల సాధికారతకు దోహదపడాలి

దేశీయంగా మూడు సూపర్ కంప్యూటర్ల అభివృద్ధి

పరమ్ రుద్ర కంప్యూటర్లను ప్రారంభించిన ప్రధాని మోడీ

కచ్చితమైన వాతావరణ అంచనాల కోసం అర్కా, అరుణిక

ప్రధాని మోదీ ఉద్ఘాటన

వివరాలు 7లో..

## బీజేపీకి ప్రజలే బుద్ధి చెబుతారు



రాష్ట్రాన్ని బీజేపీ సర్వనాశనం చేసింది

కాంగ్రెస్ తుఫాన్‌లో బీజేపీ కొట్టుకుపోవడం ఖాయం

హర్యానా అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో రాహుల్

వివరాలు 7లో..

# నాణ్యత ప్రమాణాల్లో రాజీపడొద్దు



కాళేశ్వరం ఇంజినీర్లపై చర్యలు తీసుకుంటే.. డిపార్టుమెంటే ఉండదు

అధికారుల తప్పిదానికి సాక్ష్యం కాళేశ్వరం

ఐదేళ్లకే కుప్పకూలడంతో కోట్లు వృధా

గత ప్రభుత్వ నిర్వాకంపై సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం

వివరాలు 2లో..

నీటిపారుదల శాఖలో సగానికి పైగా ఆ ప్రాజెక్టులో పని చేసిన వాళ్లే..

వందేళ్ల కిందట కట్టినవి నిక్షేపంగా ఉన్నాయి

లక్ష కోట్ల కాళేశ్వరం కట్టడం, కూలడం మన కళ్ల ముందే..

తప్పిదం ప్రజా ప్రతినిధులదా!? ఈఎన్సీ, ఇతర ఇంజనీర్లదా?

ఎలాంటి తప్పు చేయకూడదో చెప్పే ప్రత్యక్ష సాక్షి కాళేశ్వరం

1.9 లక్షల కోట్లు ఖర్చు చేసినా ఒక్క ప్రాజెక్టు పూర్తి కాలేదు

ఈ రాష్ట్రం మనది.. అంతా కలిసికట్టుగా నిర్మించుకుందాం


కొత్త ఇంజనీర్లకు సీఎం రేవంత్ పిలుపు

పైరవీలు చేస్తే అడవిలో పోస్టింగ్ ఇస్తామని హెచ్చరిక

687 మంది ఏఈఈలకు నియామక పత్రాల అందజేత

కొత్త ఇంజనీర్లకు క్షేత్రస్థాయిలోనే పోస్టింగ్: మంత్రి ఉత్తమ్

### గుడెందొడ్డి రిజర్వాయర్ సామర్థ్యం పెంపు



1.5 టీఎంసీల నుంచి 15 టీఎంసీల మేర పెంపునకు సీఎం అంగీకారం

240 కోట్లు అవుతాయని అంచనా

ప్రాధాన్య ప్రాజెక్టులకు ప్రతీనెల నిధులు: సీఎం



### నవంబరు నుంచి కొత్త
## రిజిస్ట్రేషన్ ఛార్జీలు!

సీఈజీఐఎస్ నివేదిక, అధికారుల ప్రతిపాదనలు పరిశీలించి తుది నిర్ణయం

అక్టోబరు నుంచి కొత్త ఆర్వోఆర్ చట్టం

ధరణి సమస్యలకు పూర్తి పరిష్కారం

పరీక్షతో గ్రామ రెవెన్యూ ఉద్యోగుల ఎంపిక

పాతవారూ పరీక్ష రాయాల్సిందే

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



**హైదరాబాద్, సెప్టెంబరు 26 (మనం న్యూస్):** భూముల మార్కెట్ విలువలు పెంచాలని సర్కారు నిర్ణయించిన నేపథ్యంలో నవంబరు 1 నుంచి సవరించిన కొత్త రిజిస్ట్రేషన్ విలువలు అమల్లోకి రానున్నాయని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. పెంచనున్న మార్కెట్ విలువలపై విమర్శలు తలెత్తకుండా ఉండేందుకు జాగ్రత్తలు తీసుకుంటు న్నామన్నారు. గురువారం ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడు తూ.. విలువల పెంపు శాస్త్రీయంగా ఉండాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని చెప్పారు. కాంట్రాక్టు ఏజెన్సీ అయి న సెంటర్ ఫర్ ఎఫెక్టివ్ గవర్నెన్స్ ఆఫ్ ఇండియన్ స్టేట్స్ (సీఈజీ ఐఎస్) ఇచ్చే నివేదికపైనే ఆధారప డకుండా, రిజిస్ట్రేషన్ శాఖ అధికా రుల నుంచి కూడా ప్రతిపాదన లనూ పరిశీలించి తుది నిర్ణయం తీసుకోనున్నామన్నారు. అక్టోబరు 15 లోపల నివేదిక ఇస్తుందని, ఆ వెంటనే మార్కెట్ విలువల సవరణ పై నిర్ణయం తీసుకుంటామన్నారు. కాగా, ప్రస్తుతం చదరపు అడుగు ఫ్లాట్ ధర రిజిస్ట్రేషన్ శాఖ విలువ ప్రకారం నగరాల్లో సగటున రూ.3200గా ఉంటే దీన్ని 30 శాతం (రూ.960) మించకుండా పెంచే ఆలోచనలో

మిగతా 2లో...

# పేదల ఇళ్లను కూల్చే హక్కు ప్రభుత్వానికి లేదు

హఠాత్తుగా అక్రమ నిర్మాణం అంటే వాళ్లు ఎక్కడకు వెళ్లాలి

రూ.కోట్లు ఖర్చు చేసి మౌలిక వసతులు ఎలా కల్పించారు?

జీహెచ్ఎంసీ అనుమతులను 'హైడ్రా' తప్పు పడుతుందా?

సీఎం రేవంత్‌కు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి లేఖ



**హైదరాబాద్, సెప్టెంబరు 26(మనం న్యూస్):** పేద లు జీవిత కాల సంపాదనతో నిర్మించుకున్న ఇళ్లను కూల్చే హక్కు రాష్ట్ర ప్రభుత్వానికి లేదని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ లు ఇచ్చిన అనుమతులు తప్పని 'హైడ్రా' ఎలా నిర్ణయి స్తుందని ప్రశ్నించారు. ఒక సంస్థ అనుమతులిస్తే.. కొత్తగా మరో సంస్థను ఏర్పాటు చేసి, అక్రమమంటూ కూలగొట్ట డం ఎంతవరకు సమంజసం? అని నిలదీశారు. గతంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలనలో అక్రమ నిర్మాణాలను రెగ్యు లరైజ్ చేశారని గుర్తు చేశారు. ఏ ప్రభుత్వాలైనా పేదలకు ఇళ్లు, రోడ్లు, భవనాలు, బ్యారేజీలు, బ్రిడ్జిలు, ఆస్పత్రులు, విద్యాసంస్థలను నిర్మిస్తాయని, ఈ సర్కారు హైడ్రా పేరు తో.. నిర్మాణాలను తొలగిస్తూ ఏకపక్షంగా వెళ్తోందని తప్పుబట్టారు. హైడ్రా కూల్చివేతల నేపథ్యంలో బాధితులు తన దృష్టికి తీసుకొచ్చిన అంశాలు, మేధావుల ఆలోచన లు, మీడియా ద్వారా తెలుసుకున్న

మిగతా 2లో...

# నేతన్నల మీద కక్ష తీర్చుకుంటున్నాడు




సిరిసిల్ల నేతకు ఉరేసిన రేవంత్

బతుకమ్మ ఆర్డర్లు బంద్ పెట్టారు

నేతన్నల ఆత్మహత్యలు నిరోధించాం

ఇప్పుడేమో మళ్లీ పాతరోజులు వచ్చాయ్

బీఆర్ఎస్ నేత కేటీఆర్ ఘాటు విమర్శలు

**రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 26 (మనం న్యూస్):** రా జకీయంగా నా మీద కోపంతో.. రాజన్న సిరిసిల్ల ప్రజలు, నేతన్నల మీద పగబట్టినట్టు కక్ష తీర్చుకుంటున్నాడని కేటీఆ ర్ పేర్కొన్నారు. రాష్ట్రం ఏర్పడ్డాక ఎనిమిదేండ్ల పాటు సిరిసి ల్ల నేతన్నలను అన్ని రకాలుగా ఆదుకుని, చేతి నిండా పని కల్పించామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్ప ష్టం చేశారు. సిరిసిల్లను మరో తిర్పూర్ చేయాలని సంక ల్పించాం.. కానీ ఈ పిచ్చోడికి అర్థం

మిగతా 2లో...



## 30 రోజుల్లో హెల్త్ కార్డులు

ఒక్క క్లిక్‌తో హెల్త్ ప్రొఫైల్..

రాష్ట్రంలోని 4 కోట్ల మంది వివరాల డిజిటలీకరణ

ప్రమాదకరమైన క్యాన్సర్‌ను జయించాలి

సీఎం రేవంత్

### మహనీయుడు కొండా లక్ష్మణ్ బాపూజీ

రాష్ట్రం కోసం అలుపెరగని కృషి చేసిన నాయకుడు

నేడు కొండా లక్ష్మణ్ జయంతి




## యూనికార్న్‌లుగా స్టార్టప్‌లు ఎదగాలి

ఆవిష్కర్తలకు రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహం

ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు

ఇంటర్నేషనల్ స్టార్టప్ ఫెస్టివల్ ప్రారంభం

వివరాలు 2లో..

## కులగణనపై ఎవరికీ అనుమానాలు వద్దు

కాంగ్రెస్ ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటుంది

చాకలి ఐలమ్మ జయంతి సభలో మంత్రి పొన్నం



## అమృత్ టెండర్లలో అవినీతి ఆరోపణలు

బీఆర్ఎస్ నేత కేటీఆర్‌కు లీగల్ నోటీసులు

**హైదరాబాద్, సెప్టెంబర్ 26 (మనం న్యూస్):** అమృత్ టెం డర్లలో అవినీతికి పాల్పడ్డారంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై ఆయనకు లీగల్ నోటీసులు అందాయి. రాష్ట్ర ప్రభుత్వం శోధ కంపెనీకి ఇచ్చిన అమృత్ పథకం టెండర్లలో అవినీతి జరిగిందన్న ఆరోపణలపై సుజన్ రెడ్డి ఈ నోటీసులు ఇచ్చా రు. తన పరువుకు భంగం కలిగించేలా వ్యాఖ్యలు చేసినందుకు కేటీఆర్‌తోపాటు బీఆర్ఎస్ పార్టీకి నోటీసులు అందించారు. తప్పు డు వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని సృజన్ రెడ్డి డిమాండ్ చేశారు. కాగా గత కొంత కాలంగా.. తెలంగాణ ప్రభుత్వం అమృత్ టెండ ర్లలో అవినీతికి పాల్పడుతోందని ఆరోపిస్తూ వెంటనే విచారణ చేప ట్టి.. నిజాలను బహిర్గతం చేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కేంద్రాన్ని డిమాండ్ చేస్తున్న విషయం తెలిసిందే. రేవంత్ రెడ్డి అధీనంలో ఉన్న పురపాలక శాఖ

మిగతా 2లో...

### సాయుధ రైతాంగ పోరాట యోధురాలు

చాకలి ఐలమ్మకు సీఎం రేవంత్ నివాళి



వివరాలు 2లో

## నవంబరు నుంచి కొత్త రిజిస్ట్రేషన్ ఛార్జీలు!

మొదటి పేజీతరువాయి...

ప్రభుత్వం ఉంది. సాగు భూములు, స్థలాల విషయంలో ఇప్పుడున్న విలువను సవరించి గజం ధర రూ.1,000 ఉంటే దాన్ని రూ.2 వేలకు పెంచాలని ప్రతిపాదిస్తున్నాం. వచ్చే నెల నుంచి కొత్త రికార్డ్ ఆఫ్ రైట్స్ (ఆర్వోఆర్–2024) చట్టం అమల్లోకి రానుందని మంత్రి తెలిపారు. ఇందుకు అవసరమైన సన్నాహాలు చేస్తున్నామని వెల్లడించారు. ఆర్వోఆర్ ముసాయిదాపై వివిధ వర్గాల నుంచి సేకరించిన సలహాలు, సూచనలు, కలెక్టర్లు పంపిన నివేదికలపై ఇప్పటికే తుది నిర్ణయం తీసుకున్నామన్నారు. అయితే ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేసి చట్టం తేవడమా లేక ఆర్డినెన్స్ ద్వారా తీసుకురావడమా అనే దానిపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. గత నెలలో కర్ణాటక పర్యటనకు వెళ్లి వచ్చిన ధరణి కమిటీ సభ్యులు.. ప్రతిపాదించిన అంశాలను చట్టంలో పొందుపరిచే విషయాన్ని పరిశీలిస్తున్నామన్నారు. కొత్త చట్టం అమల్లోకి వస్తే ధరణితో పాటు చాలావరకు భూసమస్యలకు పరిష్కారం దొరుకుతుందని చెప్పారు.

ధరణిలో 3.10 లక్షల పెండింగ్ దరఖాస్తుల్లో ఇప్పటికే 1.10లక్షలు అపరిష్కృతంగా ఉన్నాయని.. వీటినంత త్వరగా వాటిని పరిష్కరించాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించినట్లు వెల్లడించారు. గ్రామ స్థాయిలో రెవెన్యూ వ్యవస్థను తిరిగి బలోపేతం చేస్తామని చెప్పారు. వీఆర్వో, వీఆర్ఏ నియామకాలకు సంబంధించి... అభ్యర్థుల సామర్థ్యాలను గుర్తించేందుకు పరీక్ష పెట్టి ఎంపిక చేస్తామని వివరించారు. అభ్యర్థులకు డిగ్రీ విద్యా అర్హతగా నిర్ణయించామన్నారు. పాత వారిని తిరిగి రెవెన్యూ సర్వీసులోకి తీసుకోవాలన్నా పరీక్ష రాయాల్సిందేనని స్పష్టం చేశారు. కాగా, రిజిస్ట్రేషన్ శాఖలో ఇటీవల జరిగిన బదిలీల్లో కొంతమంది అధికారులు వసూళ్లకు పాల్పడటంపై మంత్రి పొంగులేటి ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్ని జాగ్రత్తలు తీసుకుని బదిలీలు చేసినా.. ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకొచ్చిన వారిని ఈడ్చి కొడతానని ఘాటుగా వ్యాఖ్యానించారు. బదిలీల్లో ఎవరు వసూళ్లకు పాల్పడ్డారో ఆ వివరాలు తన దగ్గర ఉన్నాయని, వారిని ఉపేక్షించేది లేదన్నారు.

# నాణ్యత ప్రమాణాల్లో రాజీపడొద్దు

**హైదరాబాద్, సెప్టెంబరు 26 (మనం న్యూస్):** నీటి పారుదల శాఖలో 50శాతానికిపైగా కాళేశ్వరం ప్రాజెక్టులో పని చేసిన ఇంజనీర్లే ఉన్నారు. వాళ్లందరిపై చర్యలు తీసుకుంటే డిపార్ట్‌మెంటే ఉండదు. చర్యలు తీసుకోకపోతే.. వారినే కొనసాగిస్తున్నారని మేం ఆరోపణలు ఎదుర్కోవాల్సిన పరిస్థితి. దీన్ని ఏరకంగా విశ్లేషించాలో తెలియడం లేదు. ప్రతిరోజూ విశ్రాంత జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ కమిషన్ ముందుకు వెళ్లి.. ప్రాజెక్టు అద్భుతమని ఆయనకు చెప్పడానికి ప్రయత్నం చేస్తున్నారు. కానీ, ఆయన అడిగిన ప్రశ్నలకు మాత్రం వీళ్ల దగ్గర సమాధానం లేదు. ఎవర్నీ ఎవరు రక్షించాలో వాళ్లకు అర్థం కావడం లేదు' అంటూ ఇంజనీర్లకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చురకలు అంటించారు. ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ కట్టి వందేళ్లు దాటుతున్నా, హైదరాబాద్‌కు తాగునీటిని అందిస్తూ నగరాన్ని రక్షిస్తున్నాయంటే వాటి నిర్మాణంలో భాగస్వామి అయిన మోక్షగుండం విశ్వేశ్వరయ్యే కారణమని చెప్పారు. ''లక్ష కోట్లతో కట్టిన తర్వాత కూలిన కాళేశ్వరం ఇంజనీర్లను ఆదర్శంగా తీసుకుంటారా!? వందేళ్లనా చెక్కుచెదరకుండా ప్రాజెక్టులు కట్టిన విశ్వేశ్వరయ్యను ఆదర్శంగా తీసుకుంటారో తొలిరోజు ఉద్యోగంలో చేరుతున్న ఇంజనీర్లే ఆలోచించుకోవాలి'' అని పిలుపునిచ్చారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా కొత్తగా నియమితులైన ఇంజనీర్లకు గురువారం జలసౌధలో మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డితో కలిసి ఆయన 687 మంది ఏఈఈలకు నియామక పత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'కాళేశ్వరం ప్రాజెక్టును మ్యాన్ మేడ్ వండర్ అని ప్రచారం చేసుకున్నారు. కానీ, ఇండియాలో మ్యాన్ మేడ్ వండర్స్ భాక్రా నంగల్ నుంచి నాగార్జున సాగర్ వరకు.. శ్రీశైలం నుంచి శ్రీరాంసాగర్ దాకా ఇంజనీర్లు కట్టినవే. మ్యాన్ మేడ్ వండర్ అంటే ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్లు. హైదరాబాద్‌కు వరదలు వచ్చి వేలాదిమంది చనిపోతే నిజాం గ్లోబల్ టెండర్లు పిలిచి వాటిని నిర్మించారు. విశ్వేశ్వరయ్యకు బాధ్యతలు అప్పగించారు. కట్టిస్తే నిక్షేపంగా ఉన్నాయి. కానీ, లక్ష కోట్లు ఖర్చు పెట్టిన కాళేశ్వరం నుంచి నికరంగా లక్ష ఎకరాలకు కూడా నీళ్లు ఇవ్వలేదు. లక్ష కోట్లు ఖర్చు పెట్టిన కాళేశ్వరం కట్టడం.. కూలడం మన కళ్ల ముందే జరిగింది. ఈ తప్పిదం ఎందుకు జరిగింది? ప్రజా ప్రతినిధుల వల్లా!? ఈఎన్సీ, సీఈ, ఎస్ఈల వల్లా!? అనే విషయాలను ఆ శాఖలో చేరే ఇంజనీర్లు తేల్చాలి. ఇందుకు ఎవరిని బాధ్యులను చేయాలో మీరే చెప్పాలి. వారికి ఇదొక మోడల్ స్టడీగా రిసెర్చ్ చేయడానికి పనికొస్తుంది'' అని ముఖ్యమంత్రి వివరించారు.

### ప్రత్యక్ష సాక్షిలా కాళేశ్వరం

అధికారులు ఎలాంటి తప్పు చేయకూడదో చెప్పేందుకు మన కళ్ల ముందు ప్రత్యక్ష సాక్షిలా కాళేశ్వరం ప్రాజెక్టు ఉందని సీఎం రేవంత్ వ్యాఖ్యానించారు. 'గతంలో ఏదైనా ఇంజనీరింగ్ మిస్టేక్ జరిగితే.. లేదా డిజైన్/డ్రాయింగ్‌లు సీఈ సీడీవో ఆమోదం లేకపోతే క్షేత్రస్థాయిలో పని చేసే ఇంజనీర్లు తిరస్కరించేవారు. నోట్స్ రాసేవారు. తిరిగి సరైన మార్గనిర్దేశం చేయాలని చెప్పేవారు. రాజకీయ నాయకులు తీసుకునే తప్పుడు నిర్ణయాలను క్షేత్రస్థాయిలో అడ్డుకొని, వెనక్కి పంపిస్తే తప్పులు జరగవు' అని వివరించారు. ఒక దేశ గొప్పతనాన్ని చూపించాలంటే అక్కడ కట్టిన నిర్మాణాలను చూపుతారని, స్టాచూ ఆఫ్ లిబర్టీ, ఈఫిల్ టవర్ ఇంజనీర్లు కట్టినవేనని, ఇంజనీర్లు కొత్త ప్రపంచాన్ని సృష్టించగలరని, వారి శక్తి అలాంటిదని వ్యాఖ్యానించారు. ''ఉమ్మడి రాష్ట్రంలో నిర్మాణం మొదలు పెట్టిన ప్రాణహిత– చేవెళ్ల పూర్తికాలేదు. పాలమూరు–రంగారెడ్డి, ఎస్ఎల్బీసీ,



కల్వకుర్తి, బీమా, నెట్టెంపాడు, దేవాదుల ఎక్కడున్నాయో మీకు తెలుసు. రూ. 1.90 లక్షల కోట్ల నిధులు ఖర్చు చేసినా పదేళ్లలో ఏ ప్రాజెక్టూ పూర్తికాకపోవడానికి కారణమేంటి!? దీనికి కారకులు ఎవరని ఒకరిపై మరొకరు విమర్శలు చేసుకుంటే ఫలితముండదు. భవిష్యత్తులో తప్పిదాలు జరగకుండా చూసుకోవాలి. ఈ రాష్ట్రం మనది. ఈ రాష్ట్రాన్ని నిర్మించుకోవాల్సిన బాధ్యత మనది. మీరు, నేను అంతా కలిసికట్టుగా రాష్ట్రాన్ని నిర్మించుకుందాం' అని రేవంత్ పిలుపునిచ్చారు.

### నీళ్లతో ప్రజల భావోద్వేగం ముడిపడి ఉంది

'తెలంగాణ రాష్ట్ర సాధనలో నీళ్ల పాత్ర కీలకం. ఆ నీటికి మీరే ప్రతినిధులు. రెండోది నియామకాలు! తెలంగాణ వచ్చిన తర్వాత 11 ఏళ్లపాటు మీకు ఉద్యోగాలు ఇవ్వలేదు. ప్రత్యేకంగా మంత్రి ఉత్తమ్ చొరవ తీసుకొని నియామక ప్రక్రియను పూర్తి చేశారు. నీటితో తెలంగాణ ప్రజల భావోద్వేగం ముడిపడి ఉంది. ఉద్యోగాలు కావాలంటే ఎక్కడైనా దొరుకుతాయి. ఆ నీళ్లను ఒడిసి పట్టుకొని ప్రజలకు అందించే బాధ్యత మీది'' అని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

### పైరవీలు చేస్తే అడవిలోనే పోస్టింగ్

'ఇంజనీర్లంతా క్షేత్రస్థాయిలో పని చేయాల్సిందే. పోస్టింగ్ల కోసం సిఫారసులు తెస్తే.. దూరంగా అడవిలో పోస్టింగ్ వేయాలి' అని మంత్రి ఉత్తమ్‌ను సీఎం రేవంత్ కోరారు. ఎవరైనా కాగితం పట్టుకొని వస్తే.. ఉదయం తిని ఫీల్డ్‌కు పోతే మళ్లీ రాత్రి ఇంటికి వచ్చే ప్రాంతంలో పోస్టింగ్ వేయాలని, అప్పుడే పని మీద ఫోకస్ ఉంటుందని వ్యాఖ్యానించారు. మీకందరికీ ఇది మంచి అవకాశమని, ఐదేళ్లలో నిర్దేశిత లక్ష్యాలతో పనిచేద్దామని అన్నారు. కాళేశ్వరం, ఎస్ఎల్బీసీ, పాలమూరు–రంగారెడ్డి పూర్తి చేసుకుంటే ఏ రాష్ట్రం పోటీ పడనంతగా ముందుకు వెళతామని అన్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలు వస్తే పరిష్కరించడానికి సిద్ధంగా ఉన్నానని, వాటిపై ఎప్పుడైనా తన వద్దకు రావచ్చని భరోసా ఇచ్చారు.

### మోక్ష గుండం, నవాబ్జంగ్ వారసత్వాన్ని అందిపుచ్చుకోవాలి: మంత్రి ఉత్తమ్

కొత్తగా నియమితులయ్యే ఇంజనీర్లు ప్రఖ్యాత ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య, అలీ నవాబ్ జంగ్ల వారసత్వాన్ని అందిపుచ్చుకోవాలని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి కోరారు. వారు నిర్మించిన ప్రాజెక్టులు వందేళ్లైనా చెక్కు చెదరలేదని గుర్తు చేశారు. కొత్తగా నియమితులయ్యే 687 మందికి హైదరాబాద్‌లో కాకుండా క్షేత్రస్థాయిలోనే పోస్టింగులు ఇస్తున్నామని, నీటిపారుదల శాఖను బలోపేతం చేయడానికి 281 మంది హెల్పర్లు, 1597 మంది లష్కర్ల నియామకానికి సీఎం అంగీకారం తెలిపారని చెప్పారు.

ఈ కార్యక్రమంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఆదిత్య నాథ్‌దాస్, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, నీటిపారుదల కార్యదర్శి రాహుల్ బొజ్జా, ఈఎన్సీ (జనరల్) జి.అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

## గుడెందొడ్డి రిజర్వాయర్ సామర్థ్యం పెంపు

**హైదరాబాద్, సెప్టెంబరు 26 (మనం న్యూస్):** జవహర్ నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో కట్టిన గుడెందొడ్డి రిజర్వాయర్ సామర్థ్యాన్ని 1.5 టీఎంసీల నుంచి 15 టీఎంసీలకు పెంచే ప్రతిపాదనలు పరిశీలించాలని సీఎం రేవంత్ అధికారులను ఆదేశించారు. జూరాల రిజర్వాయర్ ప్రాజెక్టుపై ఉన్న 7 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించడంలో భాగంగా గుడెందొడ్డి రిజర్వాయర్ సామర్థ్యం పెంపునకు తగిన చర్యలు తీసుకోవాలని నిర్దేశించారు. రిజర్వాయర్ సామర్థ్యం పెంపునకు రూ. 4500 కోట్ల నుంచి రూ.5 వేల కోట్ల దాకా ఖర్చు అవుతాయని అధికారులు అంచనా వేశారు. నీటిపారుదల శాఖ కార్యాలయంలోని జలసౌదలో రేవంత్ రెడ్డి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి, ప్రాధాన్య ప్రాజెక్టులపై సమీక్ష చేశారు. రేలంపాడు రిజర్వాయర్లో సీపేజీ భారీగా ఉండటంతో నీటిని నిల్వ చేయలేని పరిస్థితి ఉందని, దీనికి కర్టెన్ గ్రౌటింగ్ చేస్తే సీపేజీ తగ్గుముఖం పడుతుందని అధికారులు గుర్తు చేయగా మరమ్మతులు చేసి, రిజర్వాయర్ సామర్థ్యాన్ని 2 టీఎంసీల నుంచి 4 టీఎంసీలకు పెంచాలని ఆదేశించారు. శ్రీశైలం లెఫ్ట్ బ్యాంకు కెనాల్లో భాగంగా 7.5 టీఎంసీల సామర్థ్యం కలిగిన నక్కలగండి రిజర్వాయర్‌కు అటవీ భూమి సేకరణతో పాటు పునరావాసం, పునర్నిర్మాణ సమస్యలున్నాయని అధికారులు సీఎం దృష్టికి తెచ్చారు. సమస్యలను పరిష్కరించి, పనులను వేగిరం చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి చెందిన ఐదు మోటార్లు నడవడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. ప్రతీనెల రూ.240 కోట్లను ప్రాధాన్య ప్రాజెక్టుల కోసం విడుదల చేస్తామని, దీనికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావును ఆదేశించారు. రాష్ట్రంలో ఉన్న మేజర్, మీడియం ప్రాజెక్టులలో పూడికతీతపై ఇతర రాష్ట్రాలు అనుసరిస్తున్న విధానాలు పరిశీలించాలని సీఎం రేవంత్ సూచించారు. చిన్న కాళేశ్వరం, మోడికుంటవాగు, లోయర్ పెన్‌గంగా, చనఖా కొరటా, జేచొక్కారావు దేవాదుల ఎత్తిపోతల పథకం, ఎల్లంపల్లి ప్రాజెక్టు, కోయిల్ సాగర్ లిఫ్ట్, జవహర్ నెట్టెంపాడు లిఫ్ట్, రాజీవ్ భీమా లిఫ్ట్, ఎలిమినేటి మాధవరెడ్డి ఎస్ఎల్బీసీ, డిండి లిఫ్ట్, ఎస్సారెస్పి–2, నీల్వాయి, సదర్‌మీట్ బ్యారేజీ, పాలెంవాగు ప్రాజెక్టులను వీలైనంత తొందరగా పూర్తి చేసేందుకు అవకాశాలున్నాయని ఈ సమావేశంలో ఇరిగేషన్ అధికారులు పవరార్‌పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు.

## 30 రోజుల్లో హెల్త్ కార్డులు..

**హైదరాబాద్, సెప్టెంబరు 26 (మనం న్యూస్):** ప్రజలందరికీ మరో 30 రోజుల్లో డిజిటల్ హెల్త్ కార్డులను తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు. రాష్ట్రంలోని నాలుగు కోట్ల మంది హెల్త్ ప్రొఫైల్స్ను డిజిటైజ్ చేస్తారని, గత చికిత్స వివరాలను కూడా వాటిలో పొందుపరుస్తారని, ఒక్క క్లిక్‌తో ప్రతి ఒక్కరి హెల్త్ ప్రొఫైల్ తెలుసుకునే విధంగా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోందని వివరించారు. ఈ బృహత్తర కార్యక్రమంలో దుర్గాబాయి దేశ్‌ముఖ్ ఆస్పత్రి వంటి ట్రస్టుల సహకారం తీసుకోవాలని ప్రయత్నిస్తున్నామన్నారు. విద్యానగర్లోని దుర్గాబాయి దేశ్‌ముఖ్ ఆస్పత్రి ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన రెనోవా క్యాన్సర్ ఆస్పత్రిని గురువారం మంత్రి రాజనర్సింహాతో కలిసి సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం రాకముందు మనిషి జీవిత కాలం 32 ఏళ్లు ఉండేదని, నెహ్రూ నాయకత్వంలో వైద్య రంగానికి పెద్దపీట వేసి దానిని 60 ఏళ్లకు తీసుకొచ్చారని, దానిని వందేళ్లు దాటేలా కృషి చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యా, వైద్య రంగానికి పెద్దపీట వేస్తోందన్నారు. 'క్యాన్సర్ సోకిన నిరుపేదలు చికిత్స చేయించుకోలేక ప్రాణాలు కోల్పోవాల్సి వస్తోంది. సమాజాన్ని పట్టిపీడిస్తున్న క్యాన్సర్ వ్యాధిని జయించాల్సిన అవసరం ఉంది' అని వివరించారు. డీడీహెచ్; రెనోవా ఆస్పత్రి యాజమాన్యాలు క్యాన్సర్ రోగులకు అందించే సేవలకు ప్రభుత్వపరంగా సహకారం అందిస్తామన్నారు. పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో డిజిటల్ హెల్త్ తీసుకు వస్తున్నామని మంత్రి రాజనర్సింహ చెప్పారు. గ్రామ స్థాయిలో పేదలకు క్యాన్సర్ వైద్య చికిత్సలు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. క్యాన్సర్ బారిన పడిన పేదలకు తక్కువ ఖర్చుతో నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో రెనోవా ఆస్పత్రులను విస్తరింపజేస్తున్నామని ఆ గ్రూప్ చైర్మన్ శ్రీధర్ పెద్దిరెడ్డి తెలిపారు. ప్రభుత్వం ప్రతి జిల్లాలో 100 పడకలతో క్యాన్సర్ ఆస్పత్రులను నిర్మిస్తే తాము సేవలందిస్తామన్నారు. కాగా, ప్రజలకు హెల్త్‌కార్డులను అందించేందుకు వడివడిగా అడుగులు వేస్తున్న రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ.. హరియాణాలో అధ్యయనానికి ప్రత్యేక బృందాన్ని పంపినట్లు సమాచారం. ఎలాంటి కార్డులను అందించాలి? అందుకు అవలంబించాల్సిన అంశాలేంటి? అనేదానిపై ఈ బృందం ప్రభుత్వానికి నివేదిక సమర్పించనుంది.

## మహనీయుడు కొండా లక్ష్మణ్ బాపూజీ

**హైదరాబాద్, సెప్టెంబరు 26 (మనం న్యూస్):** కొండా లక్ష్మణ్ బాపూజీ మహనీయుడని.. మలిదశ తెలంగాణ ఉద్యమానికి తన ఇంటిని, ఆస్తులను దానం చేశారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మెచ్చుకున్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం ఐదు దశాబ్దాలుగా అలుపెరగని కృషి చేశారని కొనియాడారు. శుక్రవారం కొండా లక్ష్మణ్ జయంతి సందర్భంగా రేవంత్ ఆయనను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా బహుభాషా కోవిదుడైన బాపూజీ జీవితాంతం బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి పాటుపడ్డారని పేర్కొన్నారు. ఈ మేరకు సీఎం కార్యాలయం గురువారం మీడియాకు ప్రకటన విడుదల చేసింది.

## సాయుధ రైతాంగ పోరాట యోధురాలు

**హైదరాబాద్, సెప్టెంబరు 26 (మనం న్యూస్):** తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా గురువారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. సీఎంతో పాటు ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎమ్మెల్యే శ్రీ గణేశ్ ఉన్నారు. గాంధీభవన్‌లో ఐలమ్మ 129వ జన్మదినం సందర్భంగా ఆమె చిత్ర పటానికి



కాంగ్రెస్ నాయకులు పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

# నేతన్నల మీద కక్ష తీర్చుకుంటున్నాడు

మొదటి పేజీతరువాయి...

కావడం లేదని కేటీఆర్ మండిపడ్డారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని బీఆర్ఎస్ కార్యాలయంలో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో జరిగినట్టు తెలంగాణలో ఆత్మహత్యలు జరగొద్దని చెప్పి ఎనిమిదేండ్ల పాటు 3,312కోట్ల ఆర్డర్లు సిరిసిల్లకు ఇచ్చారు. దీంతో ఆత్మహత్యలు బంద్ అయ్యాయి. ఆదాయం డబుల్ అయింది. ఈ క్రమంలోనే ఆధునీకరణ వైపు ఆలోచనలను చేస్తూ సిరిసిల్లను మరో తిర్పూర్ చేయాలని కేసీఆర్ సంకల్పించారు. రెండు మూడు బస్సుల్లో తమిళనాడులోని తిర్పూర్, కోయంబత్తూరుకు నేతన్నలను పంపించాం. ఎందుకంటే మరో తిర్పూర్ మాదిరిగా సిరిసిల్లను తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో. జీతాలు డబుల్ అయి, ఆత్మహత్యలు ఆగి ఇప్పుడిప్పుడు ముఖం తెలివికి వస్తున్న సమయంలోనే మా ప్రభుత్వం పోయి దిక్కుమాలిన కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చింది అని కేటీఆర్ తెలిపారు. నా మీద కోపంతో.. ఆ కక్షను సిరిసిల్ల ప్రజలు, నేతన్నల మీద తీర్చుకుంటున్నారు రేవంత్. మొత్తం బతుకమ్మ చీరలు ఆర్డర్లు బంద్ చేశారు. బతుకమ్మ చీరల్లో కుంభకోణం లంబకోణం జరిగిందని డైలాగ్‌లు కొట్టారు. ఎంక్వైరీ చేసుకోమని శాసనసభా వేదికగా చెప్పాను. సూరత్ నుంచి తీసుకొచ్చారని సీఎం సన్నాయి నొక్కులు నొక్కబోతే.. మొదటి ఏడాది కొంత తెచ్చాం.. ఆ రోజున్న డైరెక్టరే, ఇప్పుడు సెక్రటరీగా ఉన్నారు. ఎంక్వైరీ చేసుకోమని చెప్పాను. కానీ ముందుకు రాలేదు. కుంభకోణం లేదు.. లంబకోణం లేదు.. నీవు ఓ పిచ్చోడివి అని చెప్పాను. మీ ప్రభుత్వం వచ్చాక పెద్ద పెద్ద మాటలు నరికారు మంత్రులు, స్థానిక నాయకులు. చేనేత కార్మికులకు 365 రోజులు ఉపాధి కల్పిస్తామన్నారు. నాలుగైదు రోజులైతే 11 నెలలో అడుగు పెడుతుంది ఈ ప్రభుత్వం. మరి ఈ కాలంలో ఏం సాధించారు. మా ప్రభుత్వంలో మొత్తం తొమ్మిదిన్నరేండ్లలో సిరిసిల్లకు 3,312 కోట్ల ఆర్డర్లు ఇచ్చాం. మరి మీరు 365 రోజులు ఉపాధి కల్పించాలని అనుకున్నారు కదా.. ఆర్డర్లు డబుల్ ఇవ్వాలి కదా. నోటికొచ్చినట్టు మాట్లాడటం సరికాదు. తెలిసీ తెలియని కాంగ్రెస్ సన్నాసుల మాటలకు ఆగం కావొద్దు. మీ తరపున కొట్లాడుతాం.. మీరు కూడా పోరాటానికి ముందుకు రావాలి. వారి ఎత్తుగడలకు ఆగం కాకండి అని కేటీఆర్ సూచించారు. రాష్ట్రంలో ఎక్కడ ఉప ఎన్నికలు జరిగినా బీఆర్ఎస్‌కు డిపాజిట్లు కూడా రావని కాంగ్రెస్ నేత, ఎమ్మెల్యే, మాజీ మంత్రి కడియం శ్రీహరి అన్న విషయం తెలిసిందే. ఈ కామెంట్స్‌పై కేటీఆర్ స్పందించారు. పార్టీ మారిన 10 నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు జరగడం ఖాయమని.. కడియంతోపాటు అందరూ సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. ఉప ఎన్నికల్లో పార్టీ ఫిరాయించిన వారికి పరాభవం తప్పదని కేటీఆర్ విమర్శించారు.

### చాకలి ఐలమ్మ కేటీఆర్ నివాళి

తెలంగాణ ధీర వనిత, మహిళా లోకానికి స్ఫూర్తినిచ్చిన వీరనారి చాకలి ఐలమ్మ. ఐలమ్మ జయంతి సందర్భంగా సిరిసిల్ల పట్టణంలో చాకలి ఐలమ్మ విగ్రహానికి కేటీఆర్ పూలమాల వేసి నివాళులర్పించారు. వీరనారి చాకలి ఐలమ్మ అంటేనే పోరాట స్ఫూర్తికి ప్రతీక. తెలంగాణ రైతాంగ పోరాటంలో ఆమె చూపిన తెగువ మనందరికి ఆదర్శం అని కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటంలో నిత్య స్మరణీయురాలు ఐలమ్మ. బహుజనులు పెద్ద ఎత్తున ఉద్యమంలో భాగస్వామ్యం కావటానికి ఆమెనే స్ఫూర్తి. ఉద్యమ పోరాటాల్లో మహిళల పాత్ర అసమానమైనది అని చాటి చెప్పిన యోధురాలు ఐలమ్మ. ఆ మహనీయురాలిని స్మరించుకోవటం గొప్ప అవకాశం అని కేటీఆర్ పేర్కొన్నారు.

# కులగణనపై ఎవరికీ అనుమానాలు వద్దు

**హైదరాబాద్, సెప్టెంబర్ 26 (మనం న్యూస్):** కులగణనపై ఎలాంటి అనుమానాలు వద్దని, కాంగ్రెస్ పార్టీ ఎవరికీ అన్యాయం చేయదని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. రవీంద్రభారతిలో నిర్వహించిన చాకలి ఐలమ్మ జయంతి కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాడిన వీరనారి ఐలమ్మ అని కొనియాడారు. కాంగ్రెస్ పార్టీ బీసీలకు అండగా ఉంటుందని, బీసీ కమిషన్ గడువు ముగిసిన వారం రోజుల్లోపే కొత్త కమిషన్ ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. కులగణన పూర్తి చేశాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని వివరించారు. ఉద్యమాల నుంచి వచ్చిన బిడ్డగా తాను బీసీలకు అన్యాయం జరగనివ్వనని అన్నారు. కొందరు కోఠీ మహిళా విశ్వవిద్యాలయానికి చాకలి ఐలమ్మ పేరు పెట్టడాన్ని జీర్ణించుకోలేక పోతున్నారన్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. గత ప్రభుత్వ పాలన శవాల మీద పేలాలు ఏరుకున్నట్టుగా జరిగిందన్నారు. పదేండ్ల పాలన మేడి పండు చందంగా ఉందన్నారు. ఐలమ్మ పోరాట స్ఫూర్తితోనే అందరూ ముందుకు సాగాలని, బంగారు తెలంగాణ సాధన దిశగా అడుగులు వేయాలని అన్నారు. ఎమ్మెల్సీ కోదండరాం మాట్లాడుతూ.. గత ప్రభుత్వం బీసీ కార్పొరేషన్ ఏర్పాటు చేసింది కానీ నిధులు ఇవ్వలేదన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో మన చరిత్ర బయటికి వచ్చిందని అన్నారు. తాను ఒక సారి ఐలమ్మను చూసినట్టు చెప్పారు. మహిళా వర్సిటీకి ఐలమ్మ పేరు పెట్టడమంటే మన ఆత్మగౌరవాన్ని గుర్తించడమని అన్నారు. బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ మాట్లాడుతూ.. బీసీ కమిషన్ తరపున సమగ్రంగా కులాల సమాచారం సేకరించబోతున్నామని అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఐలమ్మ మనుమరాలు శ్వేత మాట్లాడుతూ.. వీరనారి ఐలమ్మది పోరాటాల చరిత్ర అన్నారు. దొరతనానికి ధిక్కార స్వరం వినిపించిన బడుగుల గొంతుక అని అభివర్ణించారు. గత ప్రభుత్వం తమను ఆహ్వానించలేదని, కాంగ్రెస్ ప్రభుత్వమే గుర్తించిందని చెప్పారు. రజకులకు అండగా నిలుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు.

## యూనికార్న్‌లుగా స్టార్టప్‌లు ఎదగాలి

**హైదరాబాద్, సెప్టెంబరు 26 (మనం న్యూస్):** స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని, యువ ఆవిష్కర్తలు తమ సృజనాత్మకతతో యూనికార్న్‌లుగా (బిలియన్ డాలర్ల విలువ చేసే కంపెనీ) ఎదగాలని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో ఏర్పాటుచేసిన మూడు రోజుల ఇంటర్నేషనల్ స్టార్టప్ ఫెస్టివల్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇక్కడి స్టార్టప్‌లు యూనీకార్న్లుగా ఎదగాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఏఐ సిటీలో భాగస్వామ్యం అయ్యేందుకు అనేక అంతర్జాతీయ కంపెనీలు ఆసక్తి చూపిస్తున్నాయని, స్టార్టప్‌లకూ అద్భుత అవకాశాలు ఉంటాయన్నారు. సైంట్ వ్యవస్థాపకులు బీవీఆర్ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఏఐ రంగంలో ఎదిగేందుకు అద్భుతమైన అవకాశాలున్నాయని తెలిపారు. అపోలో హాస్పిటల్స్ జాయింట్ ఎండీ సంగీతారెడ్డి మాట్లాడుతూ.. నేటికీ ప్రపంచవ్యాప్తంగా 300కోట్ల ప్రజలకు వైద్యం అందుబాటులో లేదని, ఇలాంటి సమస్యలకు స్టార్టప్‌లు పరిష్కారం చూపాలన్నారు. స్టార్టప్‌లుగా ఎదిగేందుకు యువ ఆవిష్కర్తలకు ప్రస్తుతం అద్భుతమైన అవకాశాలున్నాయని పారిశ్రామికవేత్త శ్రీనిరాజు అన్నారు. శనివారం వరకు కొనసాగనున్న స్టార్టప్ ఫెస్టివల్లో 15దేశాల నుంచి ప్రతినిధులు పాల్గొంటున్నారని ఇంటర్నేషనల్ స్టార్టప్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు జేఏ చౌదరి తెలిపారు.

## పేదల ఇళ్లను కూల్చే హక్కు ప్రభుత్వానికి లేదు

మొదటి పేజీతరువాయి...

అంశాలతో కిషన్‌రెడ్డి గురువారం సీఎం రేవంత్‌కి లేఖ రాశారు. పేదల ఆందోళన, ఆవేదనను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవడం లేదన్నారు. పైగా హైడ్రాకు మరిన్ని అధికారాలు కల్పించడాన్ని తప్పుబట్టారు. 'బీఆర్ఎస్ ప్రభుత్వం విచ్చలవిడిగా అప్పులు చేసి రాష్ట్రాన్ని అధోగతి పాల్జేసింది. దీన్ని సాకుగా చూపి, మౌలిక వసతుల కల్పనకు డబ్బుల్లేవంటున్నారు. అక్రమ కట్టడాల పేరిట ఇళ్లను కూల్చివేస్తున్నారు. ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలను మేం సమర్థించం. అయితే, వాటిపై తీసుకునే చర్యలు న్యాయబద్ధంగా, సహజ న్యాయ సూత్రాలకు అనుగుణంగా ఉండాలి. ముఖ్యంగా.. పేద, మధ్య తరగతి ప్రజల విషయంలో వీటి ఆధారంగానే పని చేయాలని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. తప్పుడు లే అవుట్లతో మభ్యపెట్టి, పెట్టుబడులు పెట్టించి స్థలాలు, ఫ్లాట్లు అమ్మిన వారిని కూడా బాధ్యులను చేసేలా కఠినమైన చట్టాలు తీసుకురావాలని కోరారు. పేదలపై ప్రతాపం చూపకుండా హైడ్రా తొలుత వారితో మాట్లాడాలన్నారు. ఇతర భాగస్వామ్య పక్షాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని పేర్కొన్నారు.

### కోట్లు ఖర్చుపెట్టి వసతులు కల్పించారుగా?

ఇప్పుడు అక్రమ నిర్మాణాలుగా చెబుతున్న ప్రాంతాల్లో ప్రభుత్వం రూ.కోట్లు ఖర్చు చేసి రోడ్లు, వీధి దీపాలు, తాగు నీరు, డ్రైనేజీ, విద్యుత్తు కనెక్షన్లు, కమ్యూనిటీ హాళ్లు, చివరకు ఇంటి నంబర్లను కూడా ఇచ్చిందని కిషన్‌రెడ్డి ప్రస్తావించారు. దశాబ్దాలుగా జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏల ద్వారా పన్నులు తీసుకుంటూ హఠాత్తుగా అక్రమం అంటే పేద, మధ్య తరగతి ప్రజలు ఏమైపోవాలి? అని నిలదీశారు. అప్పులు చేసి, బ్యాంక్ రుణాలు పొంది.. ఫ్లాట్లు, అపార్టుమెంట్లు కొనుక్కున్నారని.. కొన్నిచోట్ల అన్ని అనుమతులున్న భవనాలనూ నేలమట్టం చేయటం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. మూసీ పరివాహకంలో 15 వేలపైగా పేద, మధ్య తరగతి కుటుంబాలున్నాయని.. వారి నివాసాలను హైడ్రా ద్వారా కూల్చేముం దు చర్చించాలని కోరారు. 20 ఏళ్ల క్రితం కాంగ్రెస్, పదేళ్లు బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన మోసానికి ప్రజలు బలయ్యారని ఆరోపించారు. ముఖ్యమంత్రిగా రేవంత్ తీసుకునే నిర్ణయం.. అందరికీ న్యాయం జరిగేలా ఉండాలని కిషన్‌రెడ్డి ఆకాంక్షించారు.

## అమృత్ టెండర్లలో అవినీతి ఆరోపణలు

మొదటి పేజీతరువాయి...

ద్వారా కేంద్రం అమలు చేస్తున్న అమృత్ టెండర్ల విషయంలో భారీగా అక్రమాలకు పాల్పడ్డారని కేటీఆర్ ఆరోపించారు. రేవంత్ రెడ్డి అధికారాన్ని అడ్డుపెట్టుకొని బంధువులకు మోసపూరితంగా వందల కోట్ల కాంట్రాక్టులు దక్కేలా చేశారనేది ఆయన ప్రధాన ఆరోపణ. రేవంత్ కుటుంబానికి సంబంధించి అర్హత లేని కంపెనీలకు కాంట్రాక్టులు కేటాయించారని కేటీఆర్ అన్నారు. సీఎం బావమరిది సృజన్‌రెడ్డికి చెందిన సంస్థకు ఏకంగా రూ.8 వేల 888 కోట్ల విలువైన టెండర్‌ను అక్రమంగా కట్టబెట్టారన్నారు. కేటీఆర్ చేసిన ఆరోపణలను కాంగ్రెస్ నేతలతో పాటు, బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి ఖండించారు. ఈ అంశంపై కేటీఆర్‌కు ఎవరో తప్పుడు సమాచారం ఇచ్చారని, సృజన్... రేవంత్ రెడ్డికి సొంత బావమరిది కాదని, తనకు అల్లుడని చెప్పారు. సృజన్‌కు రాజకీయాలతో సంబంధం లేదని వివరించారు.

# సమాజానికి అవసరమయ్యే వార్తలకు సముచిత స్థానం ఇవ్వాలి

- పి ఐ బి వర్క్ షాప్ లో నల్లగొండ జిల్లా అదనపు పాలనాధికారి శ్రీ టి. పూర్ణ చంద్ర
- సైబర్ క్రైమ్ బాధితులు ఎక్కువగా ఉన్నత విద్యా వంతులే
- డిప్యూటీ ఎస్పీ (సైబర్ క్రైమ్) టి.లక్ష్మీనారాయణ





**నల్లగొండ,సెప్టెంబర్ 26 (మనం ప్రతినిధి) :** సంచలన వార్తలకి ప్రాధాన్యం ఇవ్వకుండా సమాజానికి అవసరమయ్యే వార్తలకు సముచిత స్థానం కల్పిస్తే సమాజంలో మార్పుకు మనం నాంది కావచ్చు. ప్రతీ రోజు నిరంతరం మనం ఏదో ఒక విషయం నేర్చుకుంటూనే ఉన్నాం. మరీ ముఖ్యంగా జర్నలిజంలో నిరంతరం మనల్ని మనం నవీకరించుకోవాలని నల్లగొండ జిల్లా అదనపు పాలనాధికారి పూర్ణ చంద్ర అన్నారు. గురువారం స్థానిక అంబేద్కర్ భవన్ లో జర్నలిస్టులకు ఏర్పాటు చేసిన వార్తలాప్ - వర్క్ షాప్ లో ముఖ్య అతిథిగా జిల్లా అదనపు పాలనాధికారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు పాలనాదికారి మాట్లాడుతూ నేడు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఎప్పటికప్పుడు మనల్ని మనం నవీకరించుకుంటూ , సమాజంలో 4వ స్తంభం గా మీడియా తన పాత్రను సమర్థవంతంగా నిర్వహిస్తే సమాజంలో మంచి మార్పును మనం చూడవచ్చు. ప్రజాభిప్రాయ ప్రకారం నిజ నిర్ధారణ చేసుకొని వార్తలు రాస్తే బాగుంటుంది. పిఐబి లాంటి కేంద్ర ప్రభుత్వ కార్యాలయం నేడు మన మధ్యకు వచ్చి జిల్లా స్థాయిలో వర్క్ షాప్‌లను నిర్వహిస్తోందని, ఇందుకు పిఐబి బృందాన్ని అభినందిస్తున్నాను.పోషణ మాసం సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ ఫోటో ఎగ్జిబిషన్ మన దైనందిన జీవితంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి, మనం తినాల్సిన వాటి గురించి వివరంగా తెలియజేసేలా ఉందని, ఈ ఎగ్జిబిషన్ ని సాధ్యమైనంత వరకు అందరూ ఒకసారి తిలకించి అవగాహన పెంచుకోవాలని కోరారు. ఇంతకు ముందు నేరాలలో బాధితులు, నేరస్థులు ఉండేవారు. కానీ ఇప్పుడు సైబర్ క్రైమ్ లో నేరస్థులు ఎక్కడో ఉండి మనకు చేయాల్సిన నష్టం చేస్తూనే ఉంటారు. రాష్ట్రంలో ప్రతీ రోజూ సుమారు రూ. 5-6 కోట్ల మధ్య సైబర్ మోసాల వల్ల నష్టపోతున్నారని టి.లక్ష్మి నారాయణ, సైబర్ క్రైమ్ డిప్యూటీ ఎస్పీ అన్నారు.సైబర్ క్రైమ్ బాధితులు ఎక్కువగా ఉన్నత విద్యా వంతులే, 90 శాతం కి పైగా వారే ఉన్నారు. ప్రతీ జిల్లాలో సైబర్ క్రైమ్ కి సంబంధించి సైబర్ సెక్యూరిటీ ఆర్గనైజేషన్ ఏర్పాటు చేయడం జరిగింది.సైబర్ క్రైమ్ జరిగిన గోల్డెన్ అవర్ లో ఫిర్యాదు చేస్తే మనం సత్వర న్యాయం జరిగేలా చూడవచ్చు,కాలయాపన చేస్తే చాలా వరకు మనం బాధితులకు న్యాయం చేయలేము.ఈ సైబర్ నేరాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత పాత్రికేయుల మిత్రులదే. ఎన్ సి ఆర్ పి పోర్టల్ / 1930 ద్వారా సైబర్ మోసాన్ని తెలియజేయవచ్చు.కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ ఆధీనంలోని పత్రికా సమాచార కార్యాలయం ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలా పని చేస్తోందని, కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన కచ్చితమైన సమాచారాన్ని ప్రజలకు, మీడియాకు చేరవేయడంలో పత్రికా సమాచార కార్యాలయం ముఖ్య పాత్ర పోషిస్తోందని పి ఐ బి డిప్యూటీ డైరెక్టర్ డా.మానస్ కృష్ణకాంత్ తన స్వాగతోపన్యాసం లో తెలిపారు. జర్నలిస్టులు నైతిక విలువలు పాటిస్తూ, కచ్చితమైన వార్తలను సేకరించి ప్రజలకు మరిన్ని మంచి వార్తలు అందేలా చూడాలని, మారుతున్న ధోరణులకు అనుగుణంగా మిమ్మల్ని మీరు మార్చుకోవాలని ఈ వర్క్ షాప్ కి వక్త గా హాజరైన శ్రీ దిలీప్ కుమార్ రెడ్డి అన్నారు. వృత్తి ధర్మం పాటించి వార్తలు అందించండి, జర్నలిజానికి పూర్వ వైభవం అందించాల్సిన భాధ్యత మనందరిపైనే ఉందన్నారు.డిజిటల్ యుగంలో మనం కేవలం వార్తలే కాకుండా మనం వాడే మొబైల్ ఫోన్లు తరచూ అప్డేట్ చేస్తూ ఉండాలని, ఈ సైబర్ యుగంలో మనం డేటా ను సురక్షితంగా ఉంచుకోవాల్సిన అవసరాన్ని గురించి మరో వక్త సి డాక్ సైంటిస్ట్ శ్రీ జగదీప్ బాబు తెలియజేశారు. పోషణ మాసం సందర్భంగా ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్ గురించి నల్లగొండ జిల్లా ఫీల్డ్ పబ్లిసిటీ అధికారి కోటేశ్వర రావు వివరించారు. కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ పరిధిలోని సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యునికేషన్ , పత్రికా సమాచార కార్యాలయం అందిస్తోన్న సేవల గురించి ఆయన వివరంగా తెలియజేశారు.పిఐబి పనితీరు గురించి పిఐబి అధికారులు గాయత్రి, శివచరణ్ రెడ్డి వివరణాత్మకంగా వివరించారు. ఈ కార్యక్రమంలో పిఐబి అధికారులు, సిబ్బంది, సిబిసి సిబ్బంది, డి.పి.ఆర్.ఓ శ్రీ వెంకటేశ్వర్లు కూడా పాల్గొన్నారు.

## వయోవృద్ధుల సంక్షేమానికి చర్యలు తీసుకోవాలి



**భువనగిరి, సెప్టెంబర్ 26 (మనం న్యూస్) :** వయోవృద్ధుల సంక్షేమానికి అన్ని చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ హనుమంత్ కే.జెండగే అధికారులకు సూచించారు. గురువారం నాడు కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో ఆయన ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవం పోస్టర్ ను విడుదల చేశారు. వచ్చే అక్టోబర్ 1వ తేదీ వరకు నిర్వహించే ప్రపంచ వయోవృద్ధుల వారోత్సవ కార్యక్రమాలలో వయోవృద్ధుల రక్షణ, వారి హక్కుల పట్ల అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, అనాధలైన వయోవృద్ధులను గుర్తించి వసతి సౌకర్యాలు కల్పించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా, శిశు, దివ్యాంగ, వయోవృద్ధుల సంక్షేమ అధికారి కే.నరసింహారావు, తెలంగాణ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్స్ సభ్యులు మరియు రిటైర్డ్ ఎంప్లాయిస్ బాలేశ్వర్, చంద్రశేఖర్, సోమన్న, రమేష్, జ్ఞానేశ్వర్, బిక్షపతి, సిడిపిఓలు శ్రీమతి శైల జ, జ్యోత్స్న, స్వరాజ్యం, రమ, సమీరా మీర్జా, మహిళా సంక్షే మ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రాథమిక పాఠశాలకు ప్రహారీ గోడ నిర్మించాలి



**అడవిదేవులపల్లి, సెప్టెంబర్ 26,(మనం న్యూస్) :** చదువుల తల్లి ఒడిలో హాయిగా సేద తీరాలిసిన బాలలకు భద్రత కరువవుతుంది.చుట్టూ ముళ్ల పొదలు,పిచ్చి మొక్కలు ఉండటం విద్యార్థులను భయందోళనలకు గురి చేస్తున్నాయి. పాఠశాల చుట్టూ రక్షణ గా ప్రహరీ గోడ లేకపోవడం తో తరచూ విష సర్పాలు పాఠశాల అవరణం చుట్టూ ప్రక్కలా కానుబడటం తో బడికి పపాలంటే విద్యార్థుల తల్లి దండ్రులు జంకుతున్నారు. దీనితో పాఠశాల టీచర్ లు ఆశలత, నాగయ్య విద్యార్థుల తల్లి దండ్రులకు దైర్యం కలిపించి పాఠశాలకు పపే విధముగా కృషి చేసిన సంఘటన నల్గొండ జిల్లా అడవిదేవులపల్లి మండల కేంద్రంలో ఉన్నటువంటి చింత చెట్టు తండా ప్రభుత్వ పాఠశాల పరిస్థితులు. తండాలోని ప్రాథమిక పాఠశాలకు ప్రహరీ గోడ లేకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు భయాందోళనకు గురై బడికి విద్యార్థులను పంపుటకు నిరాకరిస్తున్నారు.ప్రస్తుతం పాఠశాలలో 25 నుంచి 30 మంది విద్యార్థులు ఉండగా వారికి ధైర్యం చెప్పేందుకు టీచర్స్ తమ సొంత డబ్బులతో తడికలాంటి ప్రహరీ నిర్మించారు. వర్షా కాలం వస్తే పాఠశాల భవనం నుంచి నీరు కారటంతో విద్యార్థులు కూర్చోవడానికి కూడా స్థలం లేకుండా పాఠశాలలో నీరు కారటం జరుగుతున్నదని టీచర్స్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రభుత్వం ఈ పాఠశాల యందు దయ ఉంచి ప్రహరీ గోడను మరియు నూతన భవనాన్ని నిర్మించాలని పాఠశాల ఉపాధ్యాయులు నాగయ్య కోరినారు.

## బీసీ గురుకులంలో సాగర్‌లో చాకలి ఐలమ్మ 129వ జయంతి



**నాగార్జునసాగర్, సెప్టెంబర్ 26(మనం న్యూస్) :** మహాత్మ జ్యోతిబాపూలే తెలంగాణ బీసీ గురుకుల కళాశాల మరియు పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసిమహాత్మ జ్యోతిబాపూలే తెలంగాణ బీసీ గురుకుల ప్రిన్సిపాల్ రాజశేఖర్ మాట్లాడుతూ భూమికోసం భుక్తి కోసం పేదల విముక్తి కోసం పోరాడిన ఆనాటి వీర వనిత, దోపిడి దారులనుండి భూమి విముక్తి కోసం ఆహార్నిశలు కృషిచేసిన వీరనారి చాకలి ఐలమ్మ అని మహాత్మ జ్యోతిబాపూలే తెలంగాణ బీసీ గురుకుల ప్రిన్సిపాల్ రాజశేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

### నాగార్జునసాగర్ హిల్ కాలనీలో..

నాగార్జునసాగర్ హిల్ కాలనీలో విజయ విహార్ ఎదురు ఉన్నటువంటి స్థలములో ఏర్పాటు చేసినటువంటి చాకలి ఐలమ్మ 129 వ జయంతి వేడుకలు గురువారం నందు రజక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన చిట్యాల ఐలమ్మ 129 వ జయంతి కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సాగర్ సిఐ బిసన్న విజయ పూరి టౌన్ ఎస్ఐ సంపత్ గౌడ్ పాల్గొన్నారు, ఈ సందర్భంగా వీర నారి చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలు వేసి నివాళులు అర్పించారు,అనంతరం సీఐ బీసన్న మాట్లాడుతూ తెలంగాణ బహుజన చైతన్యానికి మహిళా శక్తికి చాకలి ఐలమ్మ ప్రతీక అన్నారు,ఎస్సై సంపత్ గౌడ్ మాట్లాడుతూ గల మెత్తి భూ పోరాటానికి నాంది పలికిన ఐలమ్మ బహుజన ఆత్మ గౌరవానికి పోరాడిన వీర వనిత చాకలి ఐలమ్మ అని అన్నారు,ఈ సందర్భంగా రజక సంఘం నాయకులు చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు, అనంతరం చిట్యాల ఐలమ్మ సేవలను స్మరించుకున్నారు,ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ వైస్ చైర్మన్ ఆదాస్ నాగరాణి విక్రం,రజక సంఘం నాయకులు సిహెచ్ జంగయ్య.భూష రాజుల కృష్ణయ్య.కర్ణ శరత్ రెడ్డి,ఊర శ్రీనివాస్. బొడ్డుపల్లి, వెంకటేశ్వర్లు.ఇస్త్రారి.వెంకన్న.బలరాం,మధు.సిహెచ్,విజయ. రామ్మోహన్.శ్రీరాములు.వేణు.దుర్గయ్య.జగన్.శ్రీను.మంగ్తా నాయక్. మోహన్ నాయక్.వల్లపు రెడ్డి.విష్ణుమూర్తి. చంద్రమౌళి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు భద్రత చర్యలను తీసుకోవాలి



**భువనగిరి, సెప్టెంబర్ 26 (మనం న్యూస్) :** రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని రకాల భద్రతా చర్యలను తీసుకోవాలని జిల్లా కలెక్టర్ హనుమంతు కే.జెండగే అధికారులను ఆదేశించారు. గురువారం నాడు కలెక్టరేటు కాన్ఫరెన్సు హాలులో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా రోడ్డు భద్రతా కమిటీ సమీక్షా సమావేశం నిర్వహించబడింది. ఈ సందర్భంగా ఆయన అధికారులకు పలు సూచనలు చేశారు. రోడ్లు అభివృద్ధికి సూచికలని, అలాంటి రోడ్ల మీద ప్రమాదాల నివారణ, ప్రమాదాల తగ్గింపుకు అన్ని రకాల భద్రతా చర్యలను తీసుకోవాలని, కమిటీలో వున్న శాఖలు సమన్వయంతో పనిచేయాలని, ట్రాఫిక్ రూల్స్ పాటించేలా చూడడం, ప్రమాదాలు జరిగే ముఖ్య ప్రదేశాలలో ప్రమాద సూచికలు, మలుపుల వద్ద స్పీడ్ లిమిట్స్ సూచికలు తప్పనిసరిగా ఉండాలని సూచించారు. ప్రతి నెలా రోడ్డు భద్రతా చర్యలపై జరిగిన పురోగతి సమీక్షించడం జరుగుతుందని తెలిపారు. పాఠశాలల వద్ద ప్రత్యేకమైన ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎయిమ్స్ వద్ద వెహికల్ అండర్ పాస్ కొరకు డిపిఆర్ వెంటనే రూపొందించాలని, అనంతరం టెండర్ దశకు వెళ్లాలని తెలిపారు. కొండమడుగు దగ్గర అండర్ పాస్ రోడ్ శాంక్షన్ అయిందని, ఒక నెలలో పనులు ప్రారంభం కావాలని, సింగన్నగూడెం అండర్ పాస్ పనులకు టెండర్లు పిలవాలని, రద్దీ ఎక్కున ప్రాంతాలు, బ్లాక్ స్పాట్స్ వద్ద ప్రత్యేక భద్రతా చర్యలు తీసుకోవాలని సూచించారు. కమిటీ సమావేశంలో మెంబర్ కమ్ సెక్రటరీ, రోడ్లు భవనాల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు వి.బాల ప్రసాద్, అసిస్టెంట్ పోలీసు కమీషనర్ ఎం.ప్రభాకర్ రెడ్డి, ట్రాఫిక్ అసిస్టెంట్ కమీషనర్ ఆఫ్ పోలీసు ఎం.ప్రభాకరరెడ్డి, మోటారు వెహికిల్ ఇన్స్పెక్టర్ ఇమ్రాన్ అహ్మద్, రోడ్లు భవనాలు, పంచాయితీ రాజ్ శాఖల ఇంజనీర్లు, నేషనల్ హైవే అథారిటీ, పంతంగి, గూడూరు టోల్ ప్లాజాల అధికారులు పాల్గొన్నారు.

## పిచ్చి మొక్కలను తొలగించిన అధికారులు

**చిలుకూరు, సెప్టెంబర్ 26 (మనం న్యూస్) :** స్వచ్ఛభారత్ మిషన్ కార్యక్రమంలో భాగంగా చిలుకూరు తహసిల్దార్,ఎంపీడీవో కార్యాలయాల ఆవరణలో అధికారులు పిచ్చి మొక్కలను తొలగించే శ్రమదాన కార్యక్రమాన్ని గురువారం చేపట్టినారు.ఈ సందర్భంగా పలువురు మాటాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడంలో ప్రతి ఒక్కరు బాధ్యతగా మెలగాలన్నారు.ఈ కార్యక్రమంలో తహసిల్దార్ ధ్రువకుమార్,ఎంపీడీవో గిరిబాబు,డిప్యూటీ తహసిల్దార్ కరుణశ్రీ, చిలుకూరు గ్రామపంచాయతీ కార్యదర్శి షరీఫుద్దీన్,బిల్ కలెక్టర్ ధర్మయ్య గౌడ్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రతి ఒక్క మహిళ వీరనారి చాకలి ఐలమ్మను స్ఫూర్తిగా తీసుకోవాలి



- ఆమె నాడు భూమి కోసం ఆత్మగౌరవం కోసం పోరాటం చేసింది
- మీరు మీ కుటుంబం కోసం తాగుడు అనే మహమ్మారిని నిర్మూలించడానికి ప్రయత్నించాలి
- మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి

**మర్రిగూడ,సెప్టెంబర్ 26(మనం న్యూస్) :** మర్రిగూడ మండల కేంద్రంలో స్థానిక బస్టాండ్ దగ్గర ఏర్పాటు చేసిన వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పాల్గొని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల కులంలో పుట్టి నాటి నిరంకుశ నిజాం రాచరిక పాలనకు, జమీందారుల అణచివేతకు, రజాకార్ల ఆగడాలకు వ్యతిరేకంగా ఆత్మగౌరవం కోసం భూమికోసం పోరాడిన చాకలి ఐలమ్మ నేటి మహిళలందరికీ స్ఫూర్తి అని అన్నారు మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆమె స్ఫూర్తితో కుటుంబాలలో చిచ్చు పెడుతున్న తాగుడు మహమ్మారిని నిర్మూలించాలని మహిళలకు పిలుపునిచ్చారు.మనకోసం మన గడ్డ కోసం పేదల కోసం పోరాటం చేసిన వ్యక్తులను మనం గుర్తుంచుకోవాలన్నారు.ఇంత గొప్ప వ్యక్తిత్వం ఇంత గొప్ప తెగువ ఉన్న ఐలమ్మ విగ్రహ కార్యక్రమంలో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నాను అన్నారు. ఆత్మ గౌరవానికి తెగువకు ప్రతికైనా వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఏర్పాటుచేసిన మర్రిగూడెం మండల కేంద్రానికి చెందిన వెంకటంపేట బాలయ్య సోదరులను అభినందించారు.విగ్రహావిష్కరణ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంఘం అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్, నల్గొండ డిసిసిబి చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి, మర్రిగూడెం మండల కాంగ్రెస్ ము ఖ్య నాయకులు, బిసి సంఘం నాయకులు, మర్రిగూడ కాంగ్రేస్ పార్టీ మండల అధ్యక్షులు రామ్ దాస్ శ్రీనివాస్, నాంపల్లి బ్లాక్ కాంగ్రేస్ అధ్యక్షులు రవీందర్ రావు, మర్రిగూడ మాజీ జెడ్పిటిసి పాశం సురేందర్ రెడ్డి,పాల్వాయి అనిల్ రెడ్డి,వెంకటం పేట బాలయ్య,భీమా నాయక్, కొలకులపల్లి యాదయ్య,పగడాల యాదయ్య,మాస శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## త్రిబుల్ ఆర్ అలైన్‌మెంట్‌ను ప్రభుత్వం వెంటనే మార్చాలి

- త్రిబుల్ ఆర్ అలైన్మెంట్ మార్పుకోసం రాజకీయాలకతీతంగా రైతులందరూ ఐక్యం కావాలి
- మాటూరి బాలరాజు
- సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు



**వలిగొండ, సెప్టెంబర్ 26 (మనం న్యూస్) :** త్రిబుల్ ఆర్ అలైన్మెంట్ ను ప్రభుత్వం వెంటనే మార్చాలని త్రిబుల్ ఆర్ అలైన్మెంట్ మార్పుకోసం జరుగుతున్న పోరాటంలో రైతులందరూ ఐక్యంగా పోరాడాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాటూరి బాలరాజు పిలుపునిచ్చారు. గురువారం రోజున మండల పరిధిలోని వర్కట్ పల్లి గ్రామంలో సిపిఎం గ్రామ శాఖ 18 వ మహాసభకు ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాటాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికలకు ముందు చిన్న, సన్నకారు రైతులను పొట్టగొట్టే త్రిబుల్ ఆర్ అలైన్మెంట్ ను మారుస్తామని హామీలు ఇచ్చి నేడు అధికారంలోకి వచ్చిన తర్వాత మాట మారుస్తూ రైతులను మోసం చేస్తున్నాయని ప్రభుత్వాలు వెంటనే మార్చాలని డిమాండ్ చేశారు. త్రిబుల్ ఆర్ అలైన్మెంట్ మార్పు విషయంలో మొండిగా వ్యవహరిస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాడేందుకు రైతులందరూ రాజకీయాలకతీతంగా ఐక్యం కావాలని ఆయన పిలుపునిచ్చారు. స్థానిక జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు మరియు భువనగిరి ఎంపీ లు అలైన్మెంట్ మార్పు కోసం రైతులతో కలిసి కేంద్ర ప్రభుత్వ మొండి వైఖరిని నిరసిస్తూ ఉద్యమించాలన్నారు. రైతులందరూ రాజకీయాల కోసం ఆలోచిస్తూ కూర్చుంటే నష్టపోయేది రైతులేనని త్రిబుల్ ఆర్ అలైన్మెంట్ మార్పు కోసం జరుగుతున్న పోరాటంలో రైతులందరూ ఐక్యమై అలైన్మెంట్ మార్పు కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ ఉద్యమంలో సిపిఎం మరియు రైతు సంఘం అగ్ర భాగాన నిలబడుతుందని తెలిపారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మద్దెల రాజయ్య ,మండల కార్యదర్శి సిర్పంగి స్వామిలు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రెండు లక్షల లోపు రుణమాఫీ కాని వారందరికీ వెంటనే రుణమాఫీని వర్తింపజేయాలని, అర్హులైన పేదలందరికీ తక్షణమే ఐదు లక్షల రూపాయల ఇండ్లను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా వర్కట్పల్లి నేలపట్ల గ్రామాల మధ్యన అసంపూర్తిగా ఉన్న ఒక కిలోమీటర్ బిటి రోడ్డు వెంటనే నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ మహాసభకు గూడూరు బుచ్చిరెడ్డి అధ్యక్షత వహించగా మహాసభలో పిఎన్ఎం జిల్లా కార్యదర్శి ఈర్లపల్లి ముత్యాలు, సిపిఎం మండల కార్యదర్శి వర్గ సభ్యులు తుర్కపల్లి సురేందర్ పాల్గొని మాట్లాడారు శాఖ కార్యదర్శి మెట్టు రవీందర్ రెడ్డి నాయకులు చేగూరి నరసింహ, మాడుగుల వెంకటేశం, ఆకుల మరయ్య, రొండి మల్లేశం, గోగు కిష్టయ్య, కళ్లెం విజయలక్ష్మి, చేగురి రాములు, మెట్టు లక్ష్మమ్మ, సిర్పంగి స్వప్న, మాడుగుల లచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

## పుస్తకాలు పంచుతూ చాకలి ఐలమ్మకి ఘన నివాళి

- విద్యావేత్త కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్ సి.ఇ.ఓ. ఎం వి గోనా రెడ్డి



**నల్లగొండ,సెప్టెంబర్ 26 (మనం న్యూస్) :** నైజామ్ తొత్తులుగా ఉన్న భూస్వాముల దోపిడీకి వ్యతిరేకంగా పోరాడిన ధీర వనిత చాకలి ఐలమ్మ కి నివాళి అర్పించే భాగ్యం కలిగినందుకు సంతోషంగా ఉంది అని విద్యావేత్త కోమటిరెడ్డి ప్రతి ఫౌండేషన్ సీఈవో ఎం వి గోన రెడ్డి అన్నారు.అందుకే గురువారం వివిద రంగాల్లో సేవలందిస్తున్న వ్యక్తులకు పుస్తకాలతో సన్మానించడం జరిగింది.మహిళా సాదికారిత కు సజీవ ఉదాహరణ గా ఉన్నటువంటి ప్రిన్సిపాల్ సుదారాని కి మినిస్టర్ సీతక్క బయోగ్రఫీ ధీర వనిత సీతక్క పస్తకాన్ని మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి మరియు కాంగ్రెస్ నాయకులు గుమ్మలా నారాయణ రెడ్డి చేతుల మీదుగా మినిస్టర్ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి క్యాంపు ఆఫీస్ లో అందచేస్తూ సన్మానించడం జరిగింది.అదే విదంగా ఎన్ జి కాలేజీ ఎదురుగా ఉన్న డా. నోముల సత్యనారాయణ కార్నర్ లో వివిద రంగాల్లో సేవలందిస్తున్న ప్రముఖులకు పుస్తకాలు అందచేస్తూ సన్మానించడం జరిగింది.అదేవిధంగా మిలిటరీ ఎక్సమ్ కి ప్రిపేర్ అవుతున్న నిరుద్యోగులను ప్రోత్సాహపరుస్తూ వారికి కూడా బుక్స్ ప్రూఫ్స్ అందచేయడం జరిగింది.సందర్భం ఏదైనా పుస్తకాలు పంచడం నాఅభిమతం . ఇంతకంటే మంచి నివాళి ఏముంటుందని మా ప్రతీక్ పౌండేషన్ అభిప్రాయం కూడా, పేద కుటుంబంలో పుట్టినా నిరక్షరాస్యురాలైనప్పటికి నైజాం కు మరియు వారి తొత్తులైన భూస్వాములకు వ్యతిరేకంగా పోరాడిన చాకలి ఐలమ్మ ని స్మరించుకుంటూ , ఆమెకు అండగా నిలబడిన ఆనాటి కమ్యూనిస్ట్ యోధుడు భీంరెడ్డి నర్సింహ్మా రెడ్డి ని కూడా ఈ సందర్భంగా స్మరుంచుకందాం.చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి వర్ధిల్లాలి, చాకలి ఐలమ్మ కి జోహార్లు అన్నారు.

## ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి

**వలిగొండ, సెప్టెంబర్ 26 (మనం న్యూస్) :** తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో భూమికోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాడిన తెలంగాణ వీరవనిత చాకలి ఐలమ్మ 129వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి, ఎంపీడీవో జితేందర్ రెడ్డి, ఎస్ఐ యుగేందర్ గౌడ్, చాకలి ఐలమ్మ విగ్రహ కమిటీ అధ్యక్షుడు మైసోళ్ళ లక్ష్మీనరసింహ, వలిగొండ పట్టణ రజక సంఘం అధ్యక్షుడు మైసోళ్ళ నరసింహ, కలుకూరి అంజయ్య, మైసోళ్ళ యాదగిరి, శంకర్, రమేష్, మచ్చగిరి, వెంకటేష్, ప్రవీణ్, తిరుపతయ్య, సత్తయ్య, మైసోళ్ళ శ్రీకాంత్, ప్రశాంత్, నరేష్, మధు, కిషన్, చింటూ, సాయి శాఖ గ్రంథాలయంలో బీసీ సంఘం మండలాధ్యక్షుడు సాయిని యాదగిరి, బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు బత్తిని రాఘవేందర్ గౌడ్, గంజి రమేష్, శేఖర్, జావీద్, రవి, గంజి చంద్రయ్య, గ్రంథాలయ ఇన్చార్జ్ పిట్టల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## పోరాటస్ఫూర్తికి ప్రతీక వీర వనిత చాకలి ఐలమ్మ

- అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్



**ఖమ్మం, సెప్టెంబర్ 26(మనం న్యూస్):** పోరాట స్ఫూర్తికి ప్రతీకగా వీర వనిత చాకలి ఐలమ్మ నిలుస్తారని అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్ అన్నారు. వీరనారి చాకలి ఐలమ్మ 129వ జయంతిని పురస్కరించుకుని గురువారం అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో వీరనారి చాకలి ఐలమ్మ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, చాకలి ఐలమ్మ మహిళా శక్తికి ప్రతీక అని, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం చేసి వీర వనితగా చరిత్రలో నిలిచి పోయారని, అటువంటి వీరవనితను స్మరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సంఘ సేవకురాలిగా, భూమి, భుక్తి కోసం, సాయుధ రైతాంగ పోరాటంలో ప్రదర్శించిన పోరాట పటిమ స్ఫూర్తిదాయకం అని, ప్రతి ఒక్కరికి స్ఫూర్తిగా నిలిచారని, ఆమె ఆశయాలను నేటి తరం వారు కొనసాగించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.రాజేశ్వరి, సిపిఓ ఏ.శ్రీనివాస్, ఇంటర్మీడియట్ జిల్లా అధికారి కె. రవిబాబు, ఇంచార్జ్ ఇడి ఎస్సి కార్పొరేషన్ నవీన్ బాబు, కలెక్టరేట్ ఏవో అరుణ, సూపరింటెండెంట్ కె. శ్రీనివాస్ రావు, జిల్లా అధికారులు, వివిధ శాఖల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## చాకలి ఐలమ్మ ధైర్య సాహసాలు నేటి తరానికి స్ఫూర్తి

- మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు



**ఖమ్మం, సెప్టెంబర్ 26(మనం న్యూస్):** చాకలి ఐలమ్మ ధైర్య సాహసాలు నేటి తరానికి స్ఫూర్తిధాయకమని బిఆర్ఎస్ మాజీ లోక్ సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు పేర్కొన్నారు. వీరనారి చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా ఆమెకు నివాళ్లు అర్పిస్తూ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. భూమి కోసం, భుక్తి కోసం, దోపిడీ, పీడన నుంచి విముక్తి కోసం జరిగిన ఆనాటి సాయుధ రైతాంగ పోరాటంలో దొరల గడీలను చాకలి ఐలమ్మ గడగడలాడించిందని తెలిపారు. ఆమె జయంతి సందర్భంగా ఆమె సేవలను నామ స్మరించుకున్నారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి నుంచి విముక్తి కోసం సాగిన తెలంగాణ సాయుధ పోరాటంలో ఐలమ్మ ప్రదర్శించిన తెగువ, పౌరుషం తెలంగాణ అస్తిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని చాటిందని పేర్కొన్నారు. హక్కుల కోసం ఐలమ్మ చేసిన ఆత్మగౌరవ పోరాటం, నాటి తెలంగాణ సాయుధ పోరాటంలో ఆమె ప్రదర్శించిన ధైర్యసాహసాలు ప్రజాస్వామిక పోరాటాలకు స్ఫూర్తిగా నిలిచాయన్నారు. సాయుధ పోరాటంలో ఐలమ్మ పాత్ర రైతాంగ పోరాటంలో కీలకమై, బహుజనులకు ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిందన్నారు. ఆమె నాయకత్వంలో భూమి కోసం సాగిన పోరాటం తెలంగాణలో ప్రజలకు స్ఫూర్తిని అందించిందని తెలిపారు. తెలంగాణ అస్తిత్వం కోసం ఐలమ్మ ప్రదర్శించిన ధైర్యం నేటి సమాజానికి ఎంతో ప్రభావవంతమై ఉందని, నేటి తరానికి ఆమె ఆత్మగౌరవ పోరాటం ఒక మార్గదర్శకంగా నిలుస్తుందని చెప్పారు. ఆమె జీవితం, సేవలు నేటి సమాజానికి స్ఫూర్తిగా నిలిచాయని స్పష్టం చేశారు.

## శ్రమ దోపిడీకి ఎదురొడ్డి నిలిచిన వీరనారి చాకలి ఐలమ్మ

- అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్



**మహబూబాబాద్, సెప్టెంబర్ 26(మనం ప్రతినిధి):** శ్రమ దోపిడీకి ఎదురొడ్డి నిలిచిన వీరనారి చాకలి ఐలమ్మని తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు సామాజిక ఆధునిక పరిమాణానికి నాంది పలికిన స్త్రీ ధైర్యశాలి చాకలి ఐలమ్మ అని రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్ కొనియాడారు. గురువారం చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలోని ప్రధాన సమావేశ మందిరంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చాకలి ఐలమ్మ జయంతి వేడుకల్లో ముఖ్య అతిథిలుగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో, రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్ పాల్గొన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ లు ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు.అనంతరం రెవెన్యు అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. రజక సంఘ ప్రతినిధులు కోరిన అంశాలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ అధికారి నరసింహస్వామి, మునిసిపల్ ఛైర్మెన్ డాక్టర్ పాల్వాయి రాం మోహన్ రెడ్డి, వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, జిల్లా ఉద్యాన శాఖ అధికారి జీనుగు మరియన్న, గ్రౌండ్ వాటర్ అధికారి సురేష్, సి.పి.ఐ.ఫ్లోర్ లీడర్, కౌన్సిలర్ అజయ్ సారథి, నిమ్మల శ్రీనివాస్, కొలిపాక వెంకన్న, ఉప్పలయ్య, గోపాల్, మామిడాల సత్యనారాయణ, చాగంటి కిషన్, రజక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఉనికి చాటేందుకే బేస్ క్యాంప్‌లపై దాడులా ?

- వరుస దాడులతో అప్రమత్తం
- సమర్థవంతంగా తిప్పికొడుతున్న భద్రతా దళాలు








**చర్ల, సెప్టెంబర్ (మనం న్యూస్) :** మావోయిస్టులు ఉనికిని చాటుకునేందుకు సి ఆర్‌పిఎఫ్ బేస్‌క్యాంప్‌లపై వరుస దాడులకు దిగుతున్నారు. 2026 మార్చి వరకు దేశంలో మావోయిస్టు పార్టీ ఉండదంటూ కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటన, తెలంగాణలో మావోయిస్టులు లేరంటూ రాష్ట్ర పోలీస్ బాస్ జితేంద్ర ప్రకటించిన నేపథ్యంలో తమ ఉనికిని చాటుకునేందుకు మావోయిస్టులు ప్రయత్నాలు చేస్తున్నారు.మూడేళ్ల క్రితం వరకు తెలంగాణ-ఛత్తీస్‌ఘడ్- మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతంలోని దండకారణ్యం మావోయిస్టులకు కంచుకోటగా ఉండేది. కేంద్రంలో, ఛత్తీస్‌ఘడ్, మహారాష్ట్ర లలో బిజెపి ప్రభుత్వాలు ఉండటంతో మావోయిస్టులపై ఉక్కుపాదం మోపారు. ఆయా ప్రభుత్వాల సహకారంతో దండకారణ్యం లోని అటవీప్రాంతంలో అడుగడుగునా సిఆర్‌పిఎఫ్ బేస్ క్యాంపులను ఏర్పాటు చేసి మావోయిస్టుల వేట ప్రారంభించింది. గడచిన ఏడాది కాలంలో జరిగిన వివిధ ఎన్ కౌంటర్లలో 218 మందికి పైగా మావోయిస్టులు మృతి చెందారు. వందల సంఖ్యలో అరెస్ట్ లు, లొంగుబాట్లతో మావోయిస్టు పార్టీ కకలావికలం అవుతోంది. చివరకు శత్రుదుర్భేద్యం వంటి పూవర్తిలోకి చొచ్చుకెల్లిన భద్రతా దళాకు వేలాది మందిలో అక్కడ బేస్ క్యాంప్ ను ఏర్పాటు చేసింది. కొన్నాళ్ల క్రితం వరకు దండకారణ్యంలో జనతన సర్కార్ పేరుతో సమాంతర ప్రభుత్వం నడిపిన మావోయిస్టులు భద్రతా దళాలు చొచ్చుకొని రావడంతో సురక్షిత స్దావరాలకు తరలివెల్లారు. త్వరలో జనతన సర్కార్ కు రాజదాని వంటి అంబూజ్ మడ్ అటవీప్రాంతంలో ఇండియన్ ఆర్మీ శిబిరం ఏర్పాటుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యత్నించడం మావోయిస్టులకు మింగుడు పడటం లేదు. ఈ నేపథ్యంలో దండకారణ్యంలో తమ ఉనికిని చాటుకునేందుకు అడపాదడపా పోలీస్ బేస్ క్యాంపుపై దాడులకు దిగుతున్నారు. మూడేళ్ల క్రితం పట్టపగలే తిప్పాపురం బేస్ క్యాంప్ పై మావోయిస్టులు దాడికి యత్నించారు. ఈ దాడిని భద్రతా దళాలు సమర్థవంతంగా తిప్పికొట్టాయి. పట్టపగలే తమపై మావోయిస్టులు దాడి చేయడంతో భద్రతా దళాలు వారిని గోరుకొండ మీదుగా ఐదుకిలో మీటర్ల మేర వెంటపడి కాల్పులు జరుపుకుంటూ తరిమివేసారు. ఈ కాల్పులలో పలువురు మావోయిస్టులు గాయపడ్డారు. ఆ తర్వాత కొంత కాలం బేస్ క్యాంప్ లపై దాడులు చేయకుండా మావోయిస్టులు సమన్వయం పాటించారు. గత ఏడాది తెలంగాణ – చతీస్గఢ్ సరిహద్దులలోని చింతవాగు, ధర్మారం, పూసుగుప్ప, ఒద్దిపేట, చెన్నాపురం తదితర ప్రాంతాలలో సి ఆర్ పి ఎఫ్ బేస్ క్యాంప్ లను ఏర్పాటు చేయడాన్ని మావోయిస్టులు జీర్ణించుకోలేకపోయారు. ఈ ఏడాది జనవరి 16 న ధర్మారం, చింతవాగు, పామేడు బేస్ క్యాంప్ లపై వేలాది మంది మావోయిస్టులు ముప్పేట దాడికి దిగారు. క్యాంప్ లపై వందల రౌండ్ల కాల్పుడు, గ్రేనేడ్ లు, 750 కు పైగా రాకెట్ లాంచర్లను మావోయిస్టులు ప్రయోగించారు. అవి క్యాంప్ లకు దూరంగా పడటంతో భద్రతా దళాలకు ఎటువంటి నష్టం జరగలేదు. భద్రతా దళాలు మావోయిస్టుల చర్యను తిప్పికొట్టాయి. ఇరు వర్గాల కాల్పుల మోతతో పామేడు, దర్మారం అడవుకు దద్దరిల్లాయి. ఈ కాల్పుల ఘటనలో తన వారు ముగ్గురు మృతి చెందినట్లు మావోయిస్టులు ధృవీకరించారు. మోస్ట్ వాంటెడ్ మావోయిస్టు స్వగ్రామం సుక్మా జిల్లా పూవర్తిలో ఏర్పాటు చేసిన పూవర్తి బేస్ క్యాంప్ పై ఈ నెల 13 వ తేదీన మావోయిస్టులు దాడికి యత్నించడంతో దానికి భద్రతా దళాలు సమర్థవంతంగా తిప్పికొట్టాయి. రాత్రి ఏడు గంటల నుండి మావోయిస్టులు రాకెట్ లాంచర్లు, ఎకే 47 తుపాలకు తో బేస్ క్యాంప్ పై విరుచుకు పడ్డారు. వేల సంఖ్యలో ఉన్న భద్రతా దళాలు వారి దాడిని సమర్థవంతంగా ఎదుర్కొన్నాయి. తాజా బుధవారం రాత్రి తెలంగాణ – చత్తీసఢ్ సరిహద్దు చర్ల మండలం పూసుగుప్ప 81 సి ఆర్ పి ఎఫ్ క్యాంప్ పై మావోయిస్టులు దాడికి యత్నించారు. సాయంత్రం 6.30 గంటల నుండి 7.50 వరకు మావోయిస్టులు బేస్ క్యాంప్ పై రాకెట్ లాంచర్లు, తుపాకులతో కాల్పులకు దిగారు. ఈ ఘటనలోనూ భద్రతా దళాలు మావోయిస్టుల చర్యను సమర్థవంతంగా తిప్పికొట్టాయి. ఇలా దండకారణ్యంలోని బేస్ క్యాంప్ లపై వరుస దాడులకు దిగుతూ మావోయిస్టులు తమ ఉనికి చాటే యత్నం చేస్తుండగా భద్రతా దళాలు వాటిని సమర్థవంతంగా తిప్పికొట్టి పై చేయి సాదిస్తున్నాయి. మరోవైపు మావోయిస్టు పార్టీ 20 వసంతాల ఉత్సవాలకు పిలుపునిచ్చిన నేపథ్యంలో పూసుగుప్ప బేస్ క్యాంప్ పై దాడికి దిగడంతో పోలీసులు మరింత అప్రమత్తమయ్యారు. జిల్లా ఎస్ పి రోహిత్ రాజ్ ఆదేశాలతో చర్ల సిఐ రాజువర్మ నేతృత్వంలో భద్రతా దళాలు విస్తృతంగా కూంబింగ్ నిర్వహిస్తున్నారు. సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నారు. వాహన తనిఖీలు నిర్వహిస్తూ అనుమానితుల నుండి వివరాలు సేకరిస్తున్నారు. డాగ్ స్క్వాడ్ బృందం తో కల్వర్టులు, రహదారుల వెంట మందుపాతరల కోసం తనిఖీలు నిర్వహిస్తున్నారు.

# సజావుగా ఓపెన్ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు



- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ
- అక్టోబర్ 3 నుంచి అక్టోబర్ 9 వరకు ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు
- అధికారులతో సమీక్షించిన అదనపు కలెక్టర్

**ఖమ్మం, సెప్టెంబర్ 26(మనం బ్యూరో):** ఖమ్మం జిల్లాలో తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ అన్నారు. గురువారం తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ పరీక్షల నిర్వహణపై సమీకృత జిల్లా కలెక్టరేట్ లోస్థానిక సంస్థల అదనపు కలెక్టర్, సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఓపెన్ స్కూల్ సొసైటీ టెన్త్, ఇంటర్ పరీక్షల షెడ్యూల్, జిల్లాలో పరీక్ష రాస్తున్న విద్యార్థుల సంఖ్య, పరీక్ష నిర్వాహణకు చేస్తున్న ఏర్పాట్లు తదితర అంశాలను అధికారులు వివరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, అక్టోబర్ 3 నుంచి అక్టోబర్ 9 వరకు తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ నిర్వహిస్తున్న ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలకు జిల్లా నుంచి 340 మంది టెన్త్ అభ్యర్థులు, 373 మంది ఇంటర్ అభ్యర్థులు హాజరు కానున్నారని, ఈ పరీక్షలను సజావుగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఖమ్మంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలను ఓపెన్ 10వ తరగతి పరీక్షలు, రిక్కాబజార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఇంటర్ పరీక్షల నిర్వహణకు పరీక్ష కేంద్రాలుగా ఎంపిక చేశామని, ఈ పరీక్షా కేంద్రాలలో అవసరమైన అన్ని రకాల మౌళిక వసతులు కల్పించాలని అదనపు కలెక్టర్ అన్నారు. ఓపెన్ పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు రెండు సెషన్లలో జరుగుతాయని అన్నారు.ప్రతి పరీక్షా కేంద్రం వద్ద ఒక సిట్టింగ్ స్క్వాడ్ ఏర్పాటు చేయాలని, పరీక్ష కేంద్రం పరిసరాలలో 144 సెక్షన్ అమలు చేయాలని, జిరాక్స్ షాప్ లను మూసి వేయాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రం వద్ద అవసరమైన భద్రత కల్పించాలని, ప్రశ్న పత్రాల తరలింపుకు బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులకు తెలిపారు. పరీక్షా కేంద్రం వద్ద ఏఎన్ఎంతో ఓఆర్ఎస్, ఇతర మందులతో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయాలని వైద్యారోగ్య శాఖ అధికారికి సూచించారు. పరీక్ష కేంద్రాల రూట్ లలో అవసరమైన మేర ఆర్టీసీ బస్సులను నడపాలని అన్నారు. పరీక్షలు పూర్తయిన తర్వాత ప్రతి రోజు పరీక్షా సామాగ్రిని తరలింపు చేయాలని అదనపు కలెక్టర్ పోస్టల్ అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాలకు నిరంతరాయ విద్యుత్ సరఫరా అందజేయాలని అన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద అవసరమైన త్రాగునీరు, పారిశుధ్య సౌకర్యాలు కల్పించాలని మున్సిపల్ కమిషనర్ కు సూచించారు. ఓపెన్ స్కూల్ సొసైటీ పరీక్షలపై విస్తృత ప్రచారం కల్పించాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కె. రవిబాబు, ఉప జిల్లా వైద్యాధికారి డా. బి. సైదులు, ఖమ్మం నగరపాలక సంస్థ సహాయ కమీషనర్ ఏ. సంపత్ కుమార్, పోలీస్ ఇన్స్పెక్టర్ కె. సతీశ్, జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయ ఏ.సి.జి. ఈ.కె. ధన, జిల్లా కో ఆర్డినేటర్ టాస్ ఎం. పాపరావు, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పర్యాటక గుమ్మంగా ఖమ్మం ఖిల్లా

- 'ఖిల్లా పై శరవేగంగా రోప్ వే నిర్మాణం పనులు
- 'పాలేరు, వైరా రిజర్వాయర్లలో బోటింగ్ రిక్రియేషన్
- 'దక్షణా అయోధ్య భద్రాద్రికి ఆధ్యాత్మిక శోభ
- 'పర్యాటక అభివృద్ధి సమీక్షలో మంత్రి తుమ్మల



**ఖమ్మం, సెప్టెంబర్ 26(మనం బ్యూరో):** ఉమ్మడి ఖమ్మం జిల్లాను పర్యాటక గుమ్మంగా తీర్చిదిద్దుతామని, ఖమ్మం ఖిల్లా కు పూర్వ వైభవం తీసుకొచ్చేలా ఖిల్లా అభివృద్ధి చేస్తున్నామని వ్యవసాయ శాఖ మాత్యులు తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. గురువారం సెక్రటేరియట్ లో పర్యాటక అభివృద్ధిపై, ఖమ్మం జిల్లాలో నిర్మించతలపెట్టిన రోప్ వే పనులపై తెలంగాణ టూరిజం డెవలప్ మెంట్ కార్పోరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, ఎండీ ప్రకాశ్ రెడ్డితో మంత్రి తుమ్మల సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ ఖమ్మం ఖిల్లా పై రోప్ వే నిర్మాణ పనులు శరవేగంగా చేపట్టాలన్నారు. రోప్ వే బ్రిడ్జి లోయర్ పాయింట్ దగ్గర పార్కింగ్ కోసం, యంత్రాల తరలింపు కోసం స్థలం విశాలంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. లోయర్ పాయింట్ నిర్మాణానికి లకారం చెరువు పరిసర ప్రాంతం అనువుగా ఉంటుందని, ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించి పనులు వేగంగా పూర్తి చేయాలన్నారు. టూరిజం హబ్ గా ఖమ్మం ఖిల్లా ను మార్చాలన్నారు. నిధులను సమకూర్చే బాధ్యత తాను తీసుకుంటానన్నారు. రోప్ వే తో పాటు అమ్యూస్ మెంట్ పార్కులు, హోటళ్ల నిర్మాణాలు, వాటర్ ఫాల్స్, హాళ్ళ నిర్మాణం రెండో దశలో చేపట్టాలన్నారు. మున్సిపల్ కమిషనర్ ,ఖమ్మం జిల్లా కలెక్టర్‌తో మాటాడి వెంటనే పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దక్షిణ అయోధ్య భద్రాద్రిలో ఆధ్యాత్మిక శోభ వెల్లి విరిసేలా చర్యలు తీసుకోవాలన్నారు. భద్రాద్రిని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కిన్నెరసాని ప్రాజెక్టు అభివృద్ధి వస్తువుల కల్పనకు కృషి చేస్తామన్నారు. ఖమ్మం జిల్లాలో టెంపుల్ టూరిజం, ఎకో టూరిజం, వైజ్ఞానిక యాత్రలకు శ్రీకారం చుడుతామన్నారు. నేలకొండపల్లి బౌద్ధ స్తూపం భక్త రామదాసు ధ్యాన మందిరం, కూసుమంచి శివాలయం టూరిజం సర్క్యూట్లు ఏర్పాటుకు చర్యలు చేపట్టినట్లు మంత్రి వివరించారు. టూరిజం కార్పోరేషన్ ఎండి మాట్లాడుతూ రోప్ వే పనులకు సంబంధించి ఇప్పటికే ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. వాటి నిర్మాణ పనులు చేపట్టడానికి ఈ రంగంలో పేరెన్నికగన్న సంస్థలను సంప్రదించినట్లు తెలిపారు.

# చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందిస్తాం



**ఖమ్మం, సెప్టెంబర్ 26(మనం న్యూస్):** పాలేరు ఎడమ కాల్వ ఆయకట్టుకు సంబంధించి జిల్లాలో చివరి భూముల వరకు సాగునీరు అందిస్తామని, రైతులు ఎవరు ఆందోళన చెందవద్దని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. కూసుమంచి మండలం హట్యాతండా లోని పాలేరు ఎడమ కాల్వ నీటి విడుదల ప్రక్రియను జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ గురువారం పరిశీలించారు. పాలేరు ఎడమ కాల్వ కట్ట వైపు ఊట నీటిని 100 హెచ్.పీ. సామర్థ్యం గల 11 మోటార్ల ద్వారా సుమారు 200 క్యూసెక్కుల నీటిని కాలువలోకి ఎత్తి పోసే ప్రక్రియను, అసిస్టెంట్ ఇంజనీరింగ్ విద్యుత్ ఆపరేషన్ విభాగాన్ని కలెక్టర్ పర్యవేక్షించారు. నీరు ఎలా వచ్చిందో క్షుణ్ణంగా తెలుసుకున్నారు. పాలేరు నుంచి జుజ్జులరావు పేట వైపు కట్ట చివరి వరకు నడిచి కట్ట పటిష్టతను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ, పాలేరు ఎడమ కాల్వ క్రింద ఆయకట్టు ఉన్న రైతులు ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, చివరి ఆయకట్టు వరకు సాగునీరు తప్పనిసరిగా అందిస్తామని కలెక్టర్ తెలిపారు. పాలేరు ఎడమ కాల్వ ద్వారా 2500 నుంచి 3000 క్యూసెక్కుల సాగునీటి విడుదల చేస్తున్నామని, ప్రస్తుతం 10.9 అడుగుల ప్రవాహం మేర నీరు విడుదల అవుతుందని అన్నారు. క్రమక్రమంగా నీటి ప్రవాహం పెంచుతూ ఆయకట్టుకు నీరు విడుదల చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. వానాకాలం పంట సంరక్షణ కోసం చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించేలా ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటున్నామని, రైతులు ఆందోళన చెందవద్దని కలెక్టర్ స్పష్టం చేశారు. కలెక్టర్ పర్యటన సందర్భంగా ఇరిగేషన్ ఇఇ అనన్య, కూసుమంచి తహసీల్దార్ సురేష్, ఇరిగేషన్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## నేరాల నియంత్రణ, కేసుల ఛేదనలో సీసీ కెమెరాల పాత్ర కీలకం

- ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్



**మహబూబాబాద్, సెప్టెంబర్ 26(మనం ప్రతినిధి):** నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని, దొంగతనాలు నేరాలను కట్టడి చేయవచ్చని జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ అన్నారు. ప్రజా సంక్షేమం, హితం కోసం నేను సైతం అంటూ మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు కోసం మహబూబాబాద్ జిల్లా గోల్ మర్చంట్ అసోసియేషన్ వారు 1 లక్ష రూపాయలు ఎస్పికి గురువారం అందించారు. అంతేకాకుండా ఇంకో 50 వేల రూపాయలు కూడా త్వరలో పోలీస్ శాఖకు సీసీ కెమెరాల ఏర్పాటు కోసం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సిసి కెమెరాల ఏర్పాటుకు ముందుకు రావడం ద్వారానే నేర రహిత సమాజ నిర్మాణం సాధ్యమని అన్నారు. పట్టణ, మండల, అన్ని గ్రామాల ప్రజలు, వ్యాపారులు ఇలానే ముందుకు వచ్చి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సీసీ కెమెరాల ఏర్పాటు కోసం సహాయ సహకారాలు అందించిన గోల్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షులు పమ్మి సనాతన చారి, సెక్రటరీ ముల్లంగి మోహన్ రెడ్డి, ట్రెజ్రరీ చందా రవి సభ్యులకు జిల్లా ఎస్పీ కృతజ్ఞతలు తెలిపి అభినందించారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ తిరుపతి రావు, ఏ.ఆర్ డిఎస్పీ శ్రీనివాస్, టౌన్ సీఐ దేవేందర్, రూరల్ సీఐ సరవయ్య పాల్గొన్నారు.

## రేపే మెగా జాబ్ మేళా నిర్వహణ

- జిల్లా ఉపాధి అధికారి ఎన్. మాధవి

**ఖమ్మం, సెప్టెంబర్ 26 (మనం న్యూస్):** వివిధ కంపెనీలలో ఖాళీగా ఉన్న 850 ఉద్యోగాల భర్తీకి గాను రేపు (సెప్టెంబర్ 28న) శనివారం ఉదయం 10 గంటల నుండి స్థానిక ఎస్.ఆర్.అండ్ బి.జీ.ఎన్.ఆర్. డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధికల్పన అధికారిణి ఎన్.మాధవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 18 నుండి 40 సంవత్సరాల వయస్సు గల నిరుద్యోగ యువతీ, యువకులు ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఇంటర్వ్యూ కోసం సర్టిఫికెట్స్ జిరాక్స్ కాపీలతో వచ్చి తమ పేర్లు నమోదు చేసుకోవాలని, మరిన్ని వివరాల కోసం 9063858341 నందు సంప్రదించాలని మాధవి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలి

- అంగన్‌వాడీ కేంద్రాలలో పిల్లల ఎదుగుదలను ప్రత్యేక్షంగా పర్యవేక్షించాలి
- పెద్దపల్లి మండలంలో ప్రభుత్వ పాఠశాలలు అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్





**పెద్దపల్లి, సెప్టెంబర్ 26(మనం ప్రతినిధి) :** ప్రభుత్వ పాఠశాలలో చదివే పిల్లలకు మెరుగైన విద్య అందించాలని, ఆ దిశగా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.గురువారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పెద్దపల్లి మండలంలో పలు ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. హన్మంతునిపేట గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అంగన్వాడి కేంద్రం, ముత్తారం గ్రామంలో అప్పర్ ప్రైమరీ స్కూల్, అంగన్వాడి కేంద్రాలను కలెక్టర్ పరిశీలించారు.హన్మంతునిపేట పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివింది అర్థం చేసుకునేలా విద్యార్థుల గ్రహణ శక్తి మెరుగయ్యేలా చూడాలని అన్నారు. పాఠశాలలో మరమ్మత్తుకు గురైన కంప్యూటర్లను తొలగించాలని, విద్యార్థులకు మధ్యాహ్నం నాణ్యమైన భోజనం అందజేయాలని కలెక్టర్ తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయులు సకాలంలో హాజరు కావాలని, పాఠశాల ప్రాంగణం పరిశుభ్రంగా ఉంచుకోవాలని కలెక్టర్ తెలిపారు. హన్మంతునిపేట అంగన్ వాడి కేంద్రంలో లైట్లు వెంటనే ఏర్పాటు చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ముత్తారం గ్రామం లోని అప్పర్ ప్రైమరీ స్కూల్ విద్యార్థుల పరిజ్ఞానాన్ని కలెక్టర్ పరీక్షించారు. ప్రతి విద్యార్థికి కనీస విద్యా ప్రమాణాలు మెరుగు పర్చేందుకు లక్ష్యాల నిర్దేశించుకోవాలని కలెక్టర్ తెలిపారు. అంగన్వాడి కేంద్రం పరిశీలించిన కలెక్టర్ మరో భవనం లోకి తరలించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. అంగన్‌వాడి కేంద్రాలలో ఉన్న పిల్లల ఎదుగుదలను రెగ్యులర్ గా మానిటర్ చేయాలని, ఎత్తు తక్కువ, బరువు తక్కువ ఉన్న పిల్లలను గుర్తించి వారికి అవసరమైన అదనపు పౌష్టికాహారం అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ తనిఖీ సమయంలో పాఠశాల హెడ్ మాస్టర్లు జి. దశ రథం, పి.నాగరాజు, ఉపాధ్యాయులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## జాతీయ కుంగ్ ఫూ, కరాటే, తైత్వాండ్ పోటీలలో విద్యార్థినుల అద్భుత ప్రదర్శన

- 20 బంగారు పతకాలు, 4 వెండి పతకాలు సాధన
- జాతీయస్థాయి కరాటే కుంగ్ ఫూ పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**పెద్దపల్లి, సెప్టెంబర్ 26(మనం ప్రతినిధి) :** జాతీయ కుంగ్ ఫూ, కరాటే, తైత్వాండ్ పోటీలలో జిల్లా విద్యార్థినులు అద్భుత ప్రదర్శన కనబరిచారని వీరికి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్లో జాతీయస్థాయి ఛాంపియన్షిప్ పోటీలలో అద్భుత ప్రదర్శన కనబరిచిన మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థినులను జిల్లా కలెక్టర్ అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, సెప్టెంబర్-22న హైదరాబాద్ లోని యూసఫ్ గూడ లో చీఫ్ ఆర్గనైజర్ సింధు తపస్వి ఇంటర్నేషనల్ క్రీడాకారిణి ఆధ్వర్యంలో జరిగిన మొదటి జాతీయ స్థాయి కుంగ్ ఫూ కరాటే ఛాంపియన్షిప్ 2024 పోటీలలో పెద్దపల్లి విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచారని అన్నారు. జాతీయ ఛాంపియ న్షిప్ 2024 పోటీలలో పెద్దపల్లి జిల్లా లోని తెలంగాణ మైనా రిటీ రెసిడెన్షియల్ స్కూల్ నుండి 24 మంది బాలికలు పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచారని అన్నారు. వివిధ కేటగిరీలలో బాలికలు 20 బంగారు పతకాలు, 4 వెండి పతకాలు సాధించారని అన్నారు.జాతీయ ఛాంపియన్షిప్ పోటీలలో పాల్గొని పతకాలు సాధించిన విద్యార్థినులను కలెక్టర్ అభినందించారు. విద్యార్థినులకు కరాటే, కుంగ్ ఫూ, తైత్వాండ్ పై శిక్షణ అందించిన మాస్టర్లను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో కరాటే లెజెండ్ హీరో సుమన్ తల్వార్, మంకీ ఫిస్ట్ కుంగ్ ఫు మాస్టర్ జి. సతీష్, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

## బి కేర్ సెంటర్‌లో వయో వృద్దులకు క్రీడా, సాంస్కృతిక పోటీలు



**మంచిర్యాల, సెప్టెంబర్26 (మనం న్యూస్) :** మంచిర్యాల జిల్లా కేంద్రం పట్టణం లోని కాలేజీ రోడ్డు లోగల వయోవృద్ధుల ఆశ్రమం డీ-కేర్ సెంటర్లో అంతర్జాతీయ వయో వృద్ధుల వారోత్సవాల సందర్భంగా ఆటల, పాటల సౌస్క ృతిక కార్యక్రమాలను గురువారం వయోవృద్ధులకు నిర్వహించారు. మిషన్ శక్తి మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో మహిళా శిశు ,దివ్యాంగుల మరియు వయో వృద్ధుల శాఖ తరపున జరిగిన ఈ కార్యక్రమాల్లో 60 నుంచి 80 కి పైగా వయస్సున్న వృద్ధులు వీటిల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. వయో వృద్ధుల కేంద్రం బి కేర్ సెంటర్ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటేశ్వర్ రావు,ఇ.మహేందర్ రాజు, బి.కృష్ణ,దేవదాసు,కే.ఎం. రెడ్డి,హన్మంతరావు,ఆర్ రాజిరెడ్డి ఇతర సభ్యులు పాల్గొన్నారు.

## రేపు జాతీయ లోక్ అదాలత్ నిర్వహణ

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ డి.హేమంత్ కుమార్

**పెద్దపల్లి, సెప్టెంబర్ 26(మనం ప్రతినిధి) :** రేపు జాతీ య లోక్ అదా లత్ నిర్వహిస్తున్నామని జిల్లా ప్రధాన న్యాయ మూర్తి డాక్టర్ డి.హేమంత్ కుమార్ అన్నారు. లోక్ అదాలత్ నిర్వహణ పై జిల్లా కోర్టు ప్రాంగణం లో గురువారం జిల్లా ప్ర, దాన న్యా యమూర్తి డాక్టర్ డి.హేమంత్ కుమా ర్, జిల్లా న్యా య సేవాధికార సంస్థ కార్యదర్శి కే.స్వప్న రాణి తో కలిసి ప్రతి కా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయ మూర్తి మాట్లాడుతూ సెప్టెంబర్ 28న జిల్లా లో వున్నా అన్ని కోర్టులో జాతీ య లోక్ అదాలత్ నిర్వహించ బడుతుంది తెలిపారు.లోక్ అథాలత్ అవకాశాన్ని ప్రతి కక్షిదారుడు విని యోదించుకోవాలని,కక్షీ దారులు తమ తమ కేసు లను రాజీ మార్గం ద్వారా రాజీ చేసుకోవాలని సూచించారు. పో లీస్ అధి కారులు, ఇన్సూరెన్స్ న్యా యవాదులు లోక్ అదాలత్ లో కేసు ల రాజీకి తమ వంతు సహకారము ను అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ లో క్ అదాలత్ లో పోలీస్ కేసులు, మోటార్ వెహికల్ ఆక్సిడెంట్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, ఎలక్ట్రిసిటీ అథారిటీ కి సంబందించిన కేసులు, మనీ రికవరీ కేసులు, ఇతర సివిల్ కేసులు, మున్సిపాలిటీ కి సంబందించిన కేసులను కూడా రాజీ మార్గం ద్వారా రాజీ చేసుకోవచ్చని తెలిపి నారు. మన జిల్లాలో ఇప్పటి వరకు జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో సుమారు 1400 కేసు లను రాజి మార్గం ద్వారా పరిష్కరించారని తెలిపినారు. సమావేశంలో పెద్దపల్లి మున్సి పల్ కమిషనర్ వెంకటేష్ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అసాంఘిక శక్తులను అణిచివేస్తాం




- వార్షిక తనిఖీలో భాగంగా పీఎస్ తనిఖీ
- ప్రజలతో మమేకమై విధులు నిర్వహించాలి
- శాంతి భద్రతల పరిరక్షణలో రాజీ లేదన్న సీపీ శ్రీనివాస్

**లక్షెట్టిపేట, సెప్టెంబర్ 26 (మనం న్యూస్):** ప్రజలకు ఇబ్బందులు కలిగించే అసాంఘిక శక్తులను అణిచి వేస్తామని రామగుండం పోలీస్ కమీషనర్ శ్రీనివాస్ హెచ్చరించారు. గురువారం పట్టణంలోని పోలీస్ స్టేషన్ ను వార్షిక తనిఖీల్లో భాగంగా ఆకస్మికంగా సందర్శించారుఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ విధినిర్వహణలో అధికారులు, సిబ్బంది పోటీపడి విధులు నిర్వహించాలన్నారు.అంకిత భావంతో విధులు నిర్వహించే వారికి రివార్డులు, అవార్డులు ప్రతినెలా ఇవ్వడం జరుగుతుందన్నారు. ఫంక్షనల్ వర్టికల్ వారీగా విధులు నిర్వహిస్తున్న సిబ్బంది వివరాలు, వారు నిర్వహిస్తున్న విధుల గురించి అడిగి తెలుసుకున్నారు.ప్రజల సమస్యలు తీర్చడానికి అధికారులు, సిబ్బంది ఎల్లవేళలా అందుబాటులో ఉండి సేవలు అందించాలని ఆదేశించారు. విధులలో క్రమశిక్షణ తప్పితే వేటు తప్పదని కూడా అధికారులు, సిబ్బందిని హెచ్చరించారు. ఫిర్యాదు దారులతో మర్యాదగా మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకుని తక్షణ సేవలు అందించాలన్నారు. రౌడీలు, కేడీలు, సస్పెక్ట్స్, సంఘ విద్రోహ శక్తులపై నిరంతరం నిఘా ఉంచి, వారి కదలికలను గమనించాలని, చెడు ప్రవర్తన కలిగిన వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఉంచి వారిని బైండోవర్ చేయాలన్నారు. రాబోయే ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. రాత్రి పెట్రోలింగ్ చేసే అధికారులు పాత నేరస్తులను తనిఖీ చేయాలని తెలిపారు. ప్రజల రక్షణ విషయంలో రాజీ పడేది లేదన్నారు. సైబర్ నేరాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సీసీటీఎన్ఎస్ (క్రైమ్, క్రిమినల్ ట్రాకింగ్ నెట్ వర్క్ అండ్ సిస్టం) ద్వారా ప్రతి దరఖాస్తులను మరియు యఫ్.ఐ.అర్ లను, సీ డీ ఎఫ్, పార్ట్-1, పార్ట్-2 రిమాండ్ సీడీ , ఛార్జ్ షీట్, కోర్టు డిస్పోజల్ ఆన్లైన్ లో ప్రతి రోజు ఎంటర్ చేయాలని ఆదేశించారు. అధికారులు సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించి క్రైమ్ రేటు తగ్గించాలన్నారు. ప్రతి కేసులో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ ఉండాలని కేసులలో శిక్ష శాతం పెంచేలా అధికారులు సిబ్బంది ప్రొయాక్టివ్ పోలీసింగ్ విధులు నిర్వహించాలన్నారు. పోలీస్ అధికారులకు, సిబ్బందికి ఏవైనా సమస్యలు ఉంటే హెచ్ఆర్ఎంఎస్ గ్రీవెన్స్ సెల్ ద్వారా పంపించాలన్నారు. హెచ్ఆర్ఎంఎస్ లో ఉన్న అన్ని మాడ్యూల్స్ పై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలని సూచించారు.అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో సీపీ శ్రీనివాస్,డీ సీ పీ భాస్కర్ , ఏసీపీ ప్రకాష్ లతో కలిసి మొక్కలు నాటారు.ఈ కార్యక్రమంలో మంచిర్యాల డీసీపీ భాస్కర్, ఏసీపీ ప్రకాష్ లక్షెట్టిపేట సీఐ నరేందర్ , ఎస్ఐ సతీష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# వీర వనిత చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి మహిళా శక్తికి స్ఫూర్తిదాయకం

- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీ

**పెద్దపల్లి, సెప్టెంబర్ 26( మనం ప్రతినిధి) :** వీర వనిత చాకలి ఐలమ్మ ప్రదర్శించిన పోరాట స్ఫూర్తి మహిళా శక్తికి స్ఫూర్తిదాయకమని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీ అన్నారు. గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వీరనారి చాకలి ఐలమ్మ జయంతి కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీ చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీ మాట్లాడుతూ, చాకలి ఐలమ్మ సంఘ సేవకురాలుగా, భూమి, సాయుధ రైతాంగ పోరాటంలో ప్రదర్శించిన పోరాట పటిమతో వీర వనితగా చరిత్రలో నిలిచి, ప్రతి ఒక్కరికి స్ఫూర్తిగా నిలిచారని తెలిపారు.సమాజహితం కొరకు పోరాడిన మహనీయుల స్ఫూర్తి, వారి త్యాగాలు, గొప్పతనం ప్రజలకు తెలిసేందుకు రాష్ట్ర ప్రభుత్వం మహనీయుల జయంతి, వర్ధంతిని అధికారికంగా నిర్వహిస్తుందని అన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి స్ఫూర్తిగా నిలిచి, తెలంగాణ ప్రజల పోరాట స్ఫూర్తిని, మహిళా శక్తిని ప్రపంచానికి చాటి చెప్పిన వీర వనిత చాకలి ఐలమ్మ అని అటువంటి వీర వనితను స్మరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో



కలెక్టరేట్ పరిపాలన అధికారి శ్రీనివాస్, జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి అనిల్ కుమార్, రజక సంఘ నాయకులు, జిల్లా అధికారులు, కలెక్టరేట్ కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## రాజకీయాల్లో విద్యావేత్తలకు అవకాశం ఇవ్వండి

- నిరుద్యోగులకు ప్రత్యేక జాబ్ క్యాలెండర్ కొరకై ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తా
- పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆల్ఫోర్స్ డా.నరేందర్ రెడ్డి



**కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 26 (మనం న్యూస్ ):** రాజకీయాల్లో చదువుకున్న మే ధావులు, విద్యావేత్తలకు అవ కా శం కల్పిస్తే సమాజం అన్ని రం గాల్లో అభివృద్ధి చెందుతుందని పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అ ల్ఫోర్స్ నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాటాడారు. కరీంనగర్, నిజామాబాద్, మెదక్, ఆదిలాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్ని కలలో తనను గెలిపించాలని కోరారు. విద్యావంతులు ఎన్నిక ల్లో గెలిస్తే ప్రజలసమస్యలను పరిష్కరించగలరని అన్నారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.నిరుద్యోగులకు ప్రత్యేక జాబ్ క్యాలెం డర్ ప్రకటన కోసం ప్రభుత్వం పై ఒత్తిడి తెస్తానని పేర్కొన్నా రు. ప్రభుత్వ ఉద్యోగులకు దీటుగా ప్రైవేటు ఉద్యోగులకు అన్ని రకాల వసతులతో పాటు ఉద్యోగ అవకాశాల కల్పనకై కృషి చేస్తానని వెల్లడించారు.. ప్రభుత్వ ప్రభుత్వ ప్రైవేటు ఉ ద్యోగులు ఎదుర్కొంటున్న హెల్త్ కార్డుల జారీ సమస్యను పరి ష్కరిస్తానని అన్నారు.. పట్టభద్రులందరు స్వచ్ఛందంగా ఓటు నమోదుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.. పట్టభద్రు ల వివిధ విద్యాసంస్థలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారా నికి కృషి చేస్తానని.. రానున్న పట్టబద్రుల ఎన్నికల్లో తనకు మద్దతు ఇచ్చి గెలిపించాలని కోరారు..ఈ కార్యక్రమంలో ట్రస్మా,టిపిజెఎంఏ,టిపిడిఎం ఏ రాష్ట్ర ప్రతినిధులు మేధావులు, విద్యావేత్తలు పాల్గొన్నారు.

# అగ్ని వీర్ వాయు నియామకాల ద్వారా దేశం కోసం పని చేయాలి




- జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కల్పన

**పెద్దపల్లి, సెప్టెంబర్ 26(మనం ప్రతినిధి) :** అగ్ని వీర్ వాయు నియామకాల ద్వారా దేశం కోసం పని చేయాలని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కల్పన అన్నారు. గురువారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని స్వరూప గార్డెన్ లో ఇంటర్మీడియట్, డిగ్రీ విద్యా ర్థులతో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కల్పన భారత త్రివిధ దళాల్లో కీలకమైన ఇండియన్ ఎయిర్ ఫోర్స్ అగ్ని వీర్ వాయు నియమకాల పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కల్పన≥ మాట్లాడుతూ, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అగ్ని వీర్ వాయు నియామకాల పై అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. వివిధ దేశాల యువత దేశ రక్షణ రంగంలో ముందుకు వచ్చి పని చేస్తున్నారని, మన దేశం కోసం పనిచేసే అవకాశం విద్యార్థులు ఉపయోగించుకోవాలని, వాయుసేన రంగంలో ఉద్యోగాల పట్ల అవగాహన పెంచుకోవాలని పిలుపునిచ్చారు.ఇండియన్ ఎయిర్ ఫోర్స్ ఆఫీసర్స్ ఎన్. సందీప్, ఎస్.కె. జైనా (ఎన్.సి.ఓ) లు మాట్లాడుతూ ఇంటర్, డిప్లమా, అర్హతలు, దరఖాస్తు చేసుకొనే విధానం, దేశ సేవలో పాలుపంచుకునే అవకాశాలు, ఎయిర్ ఫోర్సులో కెరీర్ అవకాశాలు, ఎంపిక విధానం, ప్రిపరేషన్ తదితర వివరాలు, ఇంటర్మీడియట్లో సైన్స్, నాన్ సైన్స్ సబ్జెక్టుల వారు 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్స్ పి మైత్రేయి, ఎన్. రామచంద్రారెడ్డి, జి. రవీందర్ రెడ్డి, వివిధ కళాశాలల అధ్యాపకులు, వెయ్యి మంది పైగా ఇంటర్ డిగ్రీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బ్యాగ్స్, బుక్స్ పంపిణీ




**ఎలిగేడు,సెప్టెంబర్ 26(మనం న్యూస్) :** యూత్ ఫర్ సేవ మరియు భరోసా స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వ ర్యంలో ఎలిగేడు మండలంలోని సుల్తానాపూర్ గ్రామంలో గురువారం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బ్యా గ్స్ బుక్స్ జామెంట్రీ బాక్స్ మరియు ఎనిమిదవ తరగతి విద్యార్థులకు (ఎన్ ఎంఎంఎస్) బుక్స్ అందజేశారు. ఈ సందర్భంగా భరోసా స్వచ్ఛంద సేవ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు అక్కిన పల్లి నాగరాజు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ను ప్రోత్సహించేందుకు గత ఐదు సంవత్సరాల నుంచి మా సంస్థ ద్వారా ఇవ్వడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు తాటి పల్లి సతీష్ బాబు, రాగి సుధాకర్, ఉపాధ్యాయులు ,విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# హత్యాయత్నం కేసులో ముగ్గురు రౌడీషీటర్స్‌కి 3 సంవత్సరాల జైలు శిక్ష

- జిల్లాలో నేరాలకు పాల్పడిన వారికీ జైలు శిక్ష తప్పదు
- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

**రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 26 (మనం న్యూస్):** వ్యక్తి పై హత్యయత్నంకు కారణమైన ముగ్గురు రౌడి షీటర్స్ కి ఒక్కక్కరికి 3 సంవత్సరాల జైలు శిక్ష ,1000/- రూపాయల జరిమానా విధిస్తూ సిరిసిల్ల అసిస్టెంట్ సబ్ కోర్టు న్యాయమూర్తి రాధికా జైస్వాల్ గురువారం తీర్పు వెల్లడించినట్లు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు.వివరాల మేరకు చందుర్తి మండలం ఆశీరెడ్డి పల్లి గ్రామానికి చెందిన అంచ రాంరెడ్డి తండ్రి హన్మంత్ రెడ్డి అనే వ్యక్తికి అదే గ్రామానికి చెందిన వివిధ కేసులలో రౌడి షీటర్స్ గా ఉన్న కట్కూరి స్వామి తండ్రి జీవయ్య, గంగుల శ్రీను తండ్రి లష్మిరాజాం,చింత శేఖర్ తండ్రి దేవయ్యలకు బావి పంచాయతీ విషయంలో తరచు గొడవలు జరుగగా స్వామి, శ్రీను, శేఖర్ లు రాంరెడ్డిని చంపాలనే ఉద్దేశ్యంతో వారి వెంట తీసుకోని వచ్చిన కర్రతో దాడి చేసినారు.రాంరెడ్డి కుటుంబ సభ్యుల పిర్యాదు మేరకు అప్పటి చందుర్తి ఎస్.ఐ నీలం రవి కేసు నమోదు చేసి కోర్టులో చార్జెషీట్ దాఖలు చేశారు.కోర్టు మనిటరింగ్ ఎస్.ఐ రవీందర్ నాయుడు ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ లు తిరుపతి,లతీఫ్ , సిఎంఎస్ హెడ్ కానిస్టేబుల్ శంకరయ్య , కానిస్టేబుల్ మధులు 11 మంది సాక్ష్యులను ప్రవేశ పెట్టగా ప్రసిక్యూషన్ తరపున పబ్లిక్ ప్రసిక్యూటర్ వేముల లక్ష్మి ప్రసాద్ వాదించారు కేసు పూర్వపరాలు పరిశీలించిన న్యాయ మూర్తి నేరం రుజువు కావడంతో ముగ్గురికి ఒక్కక్కరికి 3సంవత్సరాల జైలు శిక్ష 1000/- రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారని ఎస్పీ తెలిపారు ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ సమాజంలో నేరం చేసిన వారు ఎవరూ శిక్ష నుండి తప్పించుకొలేరని,శిక్షలతోనే సమాజంలో మార్పు వస్తుందని, పోలిసులు, ప్రాసిక్యూషన్ వారు వ్యూహంతో న్యాయ విచారణ న్యాయ నిరూపణ జరిపి కచ్చితంగా శిక్షలు పడేలా చేస్తారని సూచించారు. పైకేసులో నిందితులకి శిక్ష పడటంలో కృషి చేసిన పిపి వేముల లక్ష్మి ప్రసాద్ కోర్టు కానిస్టేబుల్ తిరుపతి, లతీఫ్ ,సిఎంఎస్ హెడ్ కానిస్టేబుల్ శంకరయ్య, కానిస్టేబుల్ మధు లను జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ప్రత్యేకంగా అభినందించారు.



మనం



## చిలుకూరు మండల నూతన ఎంఈఓకి ఘన సన్మానం


- పేద పిల్లలకు నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేయాలి
- మాదిగ ఉద్యోగుల సమైక్య జాతీయ ప్రధాన కార్యదర్శి కత్తి వెంకటేశ్వర్లు



**చిలుకూరు,సెప్టెంబర్ 26(మనం న్యూస్) :** చిలుకూరు మండలం నూతన ఎంఈఓగా నియామకమైన మాగి గురవయ్యను కోదాడ పట్టణంలోని వారి నివాసంలో మాదిగ ఉద్యోగుల సమాఖ్య జాతీయ ప్రధాన కార్యదర్శి కత్తి వెంకటేశ్వర్లు మాదిగ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాగి గురవయ్య ఉపాధ్యాయ వృత్తి పట్ల ఎంతో అంకితభావంతో పని చేస్తూ ఇటీవల బేతావోలు జిల్లా పరిషత్ హైస్కూల్లో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడుగా చిలుకూరు మండల నోడల్ అధికారిగా బాధ్యతలు నిర్వర్తిస్తూ ప్రభుత్వం నిన్న చిలుకూరు మండల విద్యాధికారిగా నియమించడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. మండల విద్యాధికారిగా పేద, బడుగు బలహీనవర్గాల పిల్లలకు నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేయాలన్నారు. భవిష్యత్తులో మరెన్నో ఉన్నతమైన పదవులు అందుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పి ఆర్ టి యు జిల్లా గౌరవ అధ్యక్షులు బొల్లి కొండ కోటయ్య, బొడ్డు హుస్సేన్,చేకూరి రమేష్, దున్న వెంకటేశ్వర్లు, పిడమర్తి అంకులయ్యా, పులి నరసింహారావు, గుండె పంగు రమేష్, వెంకటరత్నం, వెంకటరమణ, సుభద్ర, ఆనంద్, రంగారావు, బాబు తదితరులు పాల్గొన్నారు.

## ఉమ్మడి నల్గొండ జిల్లా ఉద్యమకారులంతా ఏకం కావాలి

- జిల్లా అధ్యక్షులు జిల్లపల్లి ఇంద్ర



**నల్లగొండ,సెప్టెంబర్ 26 (మనం న్యూస్) :** గురువారం నల్లగొండ జిల్లా కోర్టు ఎదురుగ గల పంచతత్వ పార్కులో తెలంగాణ స్వరాష్ట్రం కోసం ఉద్యమం చేసిన ఉద్యమకారులంతా ఒక్క తాటిపైకి రావాలని ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు అమలు జరిగే దిశగా ముందుకు వెళుతున్న తెలంగాణ మలిదశ ఉద్యమకారుల అసోసియేషన్ నల్లగొండ జిల్లా కమిటీతో పని చేయడానికి అందరూ కలిసి రావాలని నల్లగొండ జిల్లా అధ్యక్షులు జిల్లపల్లి ఇంద్ర అన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉద్యమకారుల అభివృద్ధి సంక్షేమం కోసం ప్రతి ఒక్క ఉద్యమకారుడు ముందుకు రావాలని. అయిన ఉద్యమకారుల జాబితాలో లేని కీలక ఉద్యమకారులందరినీ చేర్చాలని ఉద్యమకారులకు ఇస్తానన్న 250 గజాల ఇంటి స్థలం, గౌరవ వేతనం 30 వేల రూపాయలు, ఇంటి నిర్మాణం కోసం 5 లక్షల రూపాయలు వెంటనే అమలు చేయాలని ఉద్యమకారుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు . ఉద్యమకారులంతా కింద ఇయ్యబడిన 8008473921, 8142621121 నంబర్లను సంప్రదించి ఉద్యమకారుల సంక్షేమం కోసం ప్రతి ఒక్క ఉద్యమకారుడు ముందుకు రావాలని ఉద్యమ కారులను కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి వంగూరి వెంకటేష్, నలపరాజు యలమంద, జిల్లా యాదయ్యలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడ్డాను



**వలిగొండ, సెప్టెంబర్ 26 (మనం న్యూస్) :** కాంగ్రెస్ పార్టీ కోసం గత 40 సంవత్సరాల నుండి కష్టపడ్డ కార్యకర్తగా తనను గుర్తి ంచి మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి తనకే ఇవ్వాలని బొలుగుల నరసింహ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వలిగొండ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఎస్టీకి రిజర్వేషన్ కావడం జరిగిందని చైర్మన్ పదవి కోసం తాను స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డిని కలవడం జరిగిందని అన్నారు. మార్కెట్ చైర్మన్ పదవి మండలంలో పరిచయం లేని, పార్టీకి సంబంధం లేని వ్యక్తిని నియమించవద్దని తన తండ్రి కాంగ్రెస్ పార్టీ నుండి సింగిల్ విండో డైరెక్టర్ గా, వార్డ్ మెంబర్ గా పనిచేశారని, నాటినుండి కూడా కాంగ్రెస్ పార్టీకి పనిచేయడం జరిగిందని దీనిని గుర్తించి ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి మార్కెట్ చైర్మన్ పదవి తనకే ఇవ్వాలని ఆయన కోరారు.

## నల్ల బ్యాడ్జిలతో అధికారుల నిరసన



**చిలుకూరు,సెప్టెంబర్ 26(మనం న్యూస్) :** నల్గొండ జిల్లాలో గడ్డి కోసే యంత్రాలను,దోమల మందును పిచికారి చేసే మిషన్లను కొనుగోలు చేయలేదని ఎంపీడీవో,ఇద్దరు గ్రామపంచాయతీ కార్యదర్శులను జిల్లా కలెక్టర్ సస్పెండ్ చేయడానికి నిరసిస్తూ మండల పరిషత్ కార్యాలయం ఎదుట నల్ల బ్యాడ్జీలతో గురువారం నిరసన వ్యక్తం చేశారు ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఎంపీడీవో కార్యదర్శిలను సస్పెండ్ చేయడం సరియైన విధానం కాదన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గిరిబాబు,ఎంపీ ఓ జగదీష్,గ్రామ పంచాయతీ కార్యదర్శులు షరీఫుద్దీన్,అవినాష్ రెడ్డి,హజ్మతుల్లా ఖాన్,కవిత,రాముడు,కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# పరిపాలనపై పట్టులేని గాజులరామారం సర్కిల్ అధికారులు

- సమస్యపై వివరణ కోరితే, ఇతర అధికారులను అడగాలన్న డీసీ
- సంబంధిత అధికారి కనీసం ఫోన్ కూడా ఎత్తని పరిస్థితి
- అవినీతి ఆరోపణలపై జగద్గిరిగుట్ట పీఎస్‌లో సదరు అధికారిపై గతంలో ఫిర్యాదు చేసిన కార్పొరేటర్





**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 26(మనం న్యూస్) :** గ్రేటర్ పరిధిలోని గాజులరామారం సర్కిల్ అధికారుల తీరు నానాటికి తీసికట్టుగా మారుతుంది. నామ్కే వాస్తేగా విధులు నిర్వహిస్తున్నట్లు తేటతెల్లం అవుతుందంటున్నారు స్థానికులు ఫలితంగా పౌరసేవలు అధ్వాన్నంగా మారాయంటున్నారు. సర్కిల్ పరిధిలో పనిచేసే ఒక్కరంటే ఒక్క అధికారి కూడ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించడం లేదని ప్రజలు వాపోతున్నారు. పౌరులు ఏదేని సమస్యపై వివరణ కోరేందుకు వెళ్లినా, ఫోన్లో సంప్రదించినా సరైన రీతిలో ఒక్కరు స్పందించడం లేదంటున్నారు. అంతెందుకు ఇక్కడ పనిచేస్తున్న ఉపకమిషనర్(డీసీ)కు ఆయా విభాగాలపై కనీస పట్టు లేనట్లు కనిపిస్తుంది. ఏదేని విషయమై పౌరులు వివరణ కోరేందుకు వెలితే ఆ విషయం నాకేలా తెలుస్తుంది... సంబందిత అధికారిని అడుగండని బదులివ్వడం ఆయన పనితీరుకు అద్దంపడుతుందంటున్నారు. నిత్యం కార్యాలయాల చుట్టూ తిరిగే ప్రజలు. మున్సిపాలిటీల నుండి ప్రభుత్వానికి ప్రధాన ఆదాయవనరులైన రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ విభాగాలపై ఆయనకు ఎంతమాత్రం అవగాహణ లేదని ఈ విషయంలో తానేమి చెప్పలేనని పేర్కొనడం బట్టిచూస్తే విషయం ఇట్టే అర్థమవుతుందంటున్నారు సర్కిల్ ప్రజలు. ఇక్కడ డీసీగా పనిచేస్తున్న అధికారి గత ఏడాదిన్నర కాలంగా విధులు నిర్వర్తిస్తున్నప్పటికీ సర్కిల్ పై అవగాహన లేకపోవడం పట్ల ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. లేదా ఇక్కడ ఇష్టం లేకుండా పని చేస్తున్నారేమో అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. వివరాల్లోకి వెలితే... గాజులరామారం సర్కిల్, సూరారం డివిజన్లోని మల్లారెడ్డి నారాయణ వైద్యశాల ఎదురుగా కేవీఎం స్కూల్ రోడ్డులో సిద్దివినాయకనగర్ కాలనీ వేల్ఫేర్ అసోసియోషన్ స్థానికంగా ఉన్న ఓ ట్రావెల్స్ సంస్థ నడుమ పార్కుస్థలం విషయంలో వివాదం నడుస్తుంది. ఇదిలా ఉంటే వినాయక నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని వేల్ఫేర్ అసోసియోషన్ ఆధ్వర్యంలో సదరు పార్కుస్థలంలో వినాయకమండపాన్ని ఏర్పాటు చేసి పూజలు చేస్తున్నారు. ఇదే నెలలో భక్తులకు అన్నదానం చేసేందుకు ఉత్సవకమిటీ నిర్వహకులు ఏర్పాట్లు చేస్తూ, స్థలాన్ని చదును చేస్తున్నారు. ఈ క్రమంలో ట్రావెల్స్ కు చెందిన ఓ వ్యక్తి వచ్చి ఇది తమ స్థలమంటూ ఉత్సవ కమిటీ నిర్వహకులతో గొడవకు దిగాడు. దీంతో ఉత్సవ కమిటీ నిర్వహకులు గాజులరామారం డీసీకి ఇదే విషయం ఫిర్యాదు చేశారు. అయితే ఆయన మాత్రం ఇదంతా తనకేమి తెలియదని, టౌన్ ప్లానింగ్ అధికారులను అడుగాలని సూచించారు. టౌన్ ప్లానింగ్ అధికారిని ఆడిగితే సెక్షన్ అధికారికి తెలుస్తుందని సెలవిచ్చారు. ఇక సెక్షన్ అధికారి నుండి ఆ మాత్రం స్పందనా కూడా రాలేదని వాపొయ్యారు. ఉత్సవ కమిటీ నిర్వహకులు. ఇదే విషయమై డీసీని జర్నలిస్టులు డీసీని వివరణ కోరేందుకు యత్నించగా ఈ విషయం నాకేలా తెలుస్తుంది...! మీరు టౌన్ ప్లానింగ్ అధికారులను అడగండంటూ ఫోన్ పెట్టెసాడు. దీంతో టౌన్ ప్లానింగ్ సెక్షన్ అధికారిని ఫోన్లో వివరణ కోరేందుకు ఎన్నిసార్లు ప్రయత్నించి స్పందించకపోవడం గమనార్హం.ఆ అధికారి మహాముదురు...గాజులరామారం సర్కిల్ పరిధిలో మొత్తం నాలుగు డివిజన్లు ఉండగా గాజులరామారం, చింతల్ డివిజన్లను ఒకరు, సూరారం, చింతల్ డివిజన్లను మరో సెక్షన్ అధికారి పర్యవేక్షిస్తున్నారు. అయితే సూరారం, జగద్గిరిగుట్ట డివిజన్లను పర్యవేక్షిస్తున్న అధికారి మాత్రం మహాముదురు అనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తనకు ఇవ్వాల్సిన అమ్యామ్యాలు ముట్టచెపితే నిభందనలకు విరుద్ధంగా ఎన్ని అంతస్థులు నిర్మించినా, ఎన్ని ఫిర్యాదులు వచ్చినా అటువెపు కన్నేత్తిచూడదనే టాక్ ఉంది. దానికి నిదర్శణంగా జగద్గిరిగుట్టలోని ఓ భవననిర్మాణ విషయమై పెద్దమొత్తంలో డబ్బులు డిమాండ్ చేయడంతో ఏకంగా కార్పొరేటర్ జగన్ సదరు అధికారిపై పీఎస్లో ఫిర్యాదు చేయడం సంచలనం సృష్టించింది. అయినప్పటికీ సదరు అధికారి వైఖరిలో ఏమాత్రం మార్పు రాలేదంటున్నారు ప్రజలు. ఇందుకు సూరారం డివిజన్ లో నిభందనలకు విరుద్దంగా ఇబ్బడిముబ్బడిగా దర్శణమిస్తున్న బహుళ అంతస్థుల నిర్మాణాలను నిదర్శనంగా పేర్కొనవచ్చు అంటున్నారు జనం. మొత్తానికి ఆ అధికారి మహాముదురు అని, చాలా ఏండ్లుగా ఇక్కడా తిష్టవేసిందని పేర్కొంటున్నారు. ఇటువంటి అధికారిని ఎందుకు బదిలీ చేయడం లేదని వాపోతున్నారు.

## వీర వనిత ఐలమ్మను ప్రతి ఒక్కరు స్ఫూర్తిగా తీసుకోవాలి



- భౌరంపేటలో ఘణంగా చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు
- ముఖ్య అతిథిగా బీజేపీ నాయకులు పీసరి కృష్ణారెడ్డి

**కుత్బుల్లాపూర్,సెప్టెంబర్26(మనం న్యూస్) :** వీర వనిత ఐలమ్మను ప్రతి ఒక్కరు స్ఫూర్తిగా తీసుకొని దేశాన్ని, ధర్మాన్ని కాపాడుకోవాలని బీజేపీ నాయకులు పీసరి కృష్ణారెడ్డి అన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ పరిధి బౌరంపేట్ రజక సంఘం ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ జయంతి ఉత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్నికి ముఖ్య అతిథిగా బీజేపీ నాయకులు పీసరి కృష్ణారెడ్డి పాల్గొని, ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ... తెలంగాణ రజాకార్ల రాక్షస పాలనకు ఎదురొడ్డి పోరాడి ప్రాణాలు సైతం అర్పించిన వీర వనిత ఐలమ్మ పోరాట పటిమను కొనియాడారు. ఎల్లప్పుడూ అందరూ సంఘటితమై అలాంటి అరాచకాలను ఎదుర్కోవాల్సిన అవసరం భవిష్యత్తులో కూడా చాలా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల రజక సంఘం మరియాల జీతయ్య, సంఘం పెద్దలు ఎమ్. అంజయ్య, పుట్టుగూడెం సత్తయ్య, ఎమ్. సత్తయ్య, ఎమ్. శివకుమార్, యాదగిరి, అశోక్, రాజు, గడీల సత్యనారాయణ, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లవేళలా కృషి చేస్తా



**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 26( మనం న్యూస్) :** ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లవేళలా కృషి చేస్తానని ఎమ్మెల్సీ, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు శంభీపూర్ రాజు అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు గురువారం శంభీపూర్ కార్యాలయంలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుని మర్యాదపూర్వకంగా కలిసి, తమ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవరానికి చెందిన ప్రజలు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## 30న భారత్ ఫైనాన్షియల్ ఇంక్లుజన్ లిమిటెడ్‌లో జాబ్ మేళా

**మహబూబాబాద్, సెప్టెంబర్ 26 (మనం ప్రతినిధి):** భారత్ ఫైనాన్షియల్ ఇంక్లుజన్ లిమిటెడ్లో అర్హత కల్గిన నిరుద్యోగ అభ్యర్థులకు ఉద్యోగవకాశాలను కల్పించేందుకు 30.09.2024 న జిల్లా ఉపాధి కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి టి.రజిత గురువారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. సంస్థలో ఉన్న లోన్ ఆఫీసర్ ఇంటర్, డిగ్రీ తో పాటు బైక్ డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా ఉన్నవారికి వారి విద్యార్హతకు అనుగుణంగా అవకాశం కల్పించబడుతుందని తెలిపారు. ఈ పోస్టులకు 18 సంవత్సరాల నుండి 28 సంవత్సరాల మధ్య వయసు గల అభ్యర్థులకు 14 వేలపై చిలుకు వరకు వేతనంతో ఉపాధి అవకాశాలు కల్పించునని ఆమె పేర్కొన్నారు. అర్హత,ఆసక్తిగల అభ్యర్థులు 30.09.2024 న జిల్లా ఎంప్లాయ్ మెంట్ కార్యాలయం,రూమ్ నెంబర్ 25, రెండవ అంతస్తు,సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (నూతన కలెక్టరేట్), కురవి రోడ్, నందు జరుగు జాబ్ మేళాకు తమ విద్యార్హతల సర్టిఫికెట్లు, రెజ్యూమ్‌తో హాజరై ఈఅవకాశాన్ని సద్వినియోగపరచుకోవాలని, మరిన్ని వివరాలకు జిల్లా ఉపాధి కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

## తీవ్ర ఉద్రిక్తతలో మూసీ పరిసరాల నిర్మాణాలకు మార్కింగ్ చేసిన అధికారులు



**రంగారెడ్డి,సెప్టెంబర్26(మనం న్యూస్) :** తీవ్ర ఉద్రిక్తతలో మూసీ పరిసరాల నిర్మాణాలకు అధికారులు గురువారం మార్కింగ్ చేశారు. చైతన్యపురి డివిజన్ పరిదిలోని మూసీ నది పరిసరాలోని అక్రమ నిర్మాణాలను గుర్తించి మార్కింగ్ చేయడానికి వచ్చిన అధికారులను అక్కడే నివాసముంటున్న ప్రజలు మార్కింగ్ చేయకుండా అడుకునేందుకు యత్నించారు. పరిస్థితులు అదుపు తప్పడంతో పోలీసుల బందోబస్తు నడుమ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రజలను అడ్డుకున్నారు. ప్రజలకు మద్దతుగా బీఆర్ఎస్ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, తోట మహేష్ యాదవ్ మద్దతుగా నిలిచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హైడ్రా, మూసీ రివర్ డెవలప్మెంట్ అంటూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో కష్టపడి కట్టుకున్న ఇండ్లను కర్కాటంగా కూల్చి వేస్తున్నారని, ప్రజలందరూ భాధతో,కోపంతో ఉన్నారు అని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఫణిగిరి కాలనీ,మారుతీ నగర్, సత్యానగర్,ద్వారకాపురం,ఇందిరానగర్, గణేష్ పురి కాలనీ వాసులు పాల్గొన్నారు.

## లింక్ రోడ్ల అభివృద్ధితో ప్రధాన రహదారులపై ట్రాఫిక్ రద్దీ తగ్గుతుంది



**కుత్బుల్లాపూర్,సెప్టెంబర్26(మనం న్యూస్) :** లింక్ రోడ్ల అభివృద్ధితో ప్రధాన రహదారులపై ట్రాఫిక్ రద్ది తగ్గుతుందని ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ పరిధి బహదూర్ పల్లి – భౌరంపేట్ రహదారిలో ఎమ్మెల్యే సీడీపీ నిధులతో నూతనంగా నిర్మించిన లింక్ రోడ్డును ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... రోడ్ల అభివృద్ధి ద్వారా ఆయా ప్రాంతాల అభివృద్ధి జరుగుతుందన్నారు. అనంతరం ఎమ్మెల్యేని వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో దుండిగల్ మున్సిపల్ వైస్ చైర్మన్ తుడుం పద్మారావు, కౌన్సిలర్లు శంభీపూర్ క్రిష్ణ, భరత్, సత్యనారాయణ, దుండిగల్ మున్సిపల్ బిఆర్ఎస్ అధ్యక్షులు సంజీవ్ రెడ్డి, వివిధ శాఖల మున్సిపల్ అధికారులు, మేడ్చల్ జిల్లా మాజీ గ్రంథాలయ చైర్మన్ నాగరాజు యాదవ్, నాయకులు సగ్గిడి శ్రీను, మైసిగారి శ్రీకాంత్, సగ్గిడి పద్మారావు, బాలరాజు యాదవ్, శ్యామ్, గాయత్రి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు మీనా రావు, సురేందర్ రెడ్డి, దశరథ్, దుర్గారావు, పరుశురాం, కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.

## చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలి

- జిల్లా కలెక్టర్ హనుమంతు కే జండగే



**భువనగిరి, సెప్టెంబర్ 26 (మనం న్యూస్) :** వీరనారి చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తిని మనం ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ హనుమంత్ కే. జెండగే అన్నారు. గురువారం నాడు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో వీరనారి చాకలి ఐలమ్మ 129వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. వారి చిత్రపటానికి జిల్లా కలెక్టర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా, భూమి, భుక్తి కోసం చేసిన పోరాటాలను గుర్తుచేస్తూ వారి ఆశయాలను మనం పూర్తిగా సాధించేందుకు కృషి చేయాలని,తద్వారా సమాజాభివృద్ధికి తోడ్పడినట్లు అవుతుందని అన్నారు. వారి పోరాటాలు, ఆశయాలు అందరికి తెలియాలని రాష్ట్ర ప్రభుత్వం వారి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నదని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న వివిధ సంఘాల ప్రతినిధులు వీరనారి చాకలి ఐలమ్మ పోరాటాలు, పోరాటం కోసం వారు చేసిన త్యాగాలను స్మరించుకున్నారు. జయంతి వేడుకలో జిల్లా రెవిన్యూ అదనపు కలెక్టర్ పి. బెన్ షాలోమ్, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణ అధికారి శోభారాణి, జిల్లా గ్రామీణభివృద్ధి అధికారి నాగి రెడ్డి, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి యాదయ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు, వివిధ సంఘాల ప్రతినిధులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## రుణ మాఫీ కోసం రైతుల ధర్నా

**చండూరు,సెప్టెంబర్ 26(మనం న్యూస్) :** కొండాపురం గ్రామలో కొమ్ము గణే ష్ ఆధ్వ ర్యంలో గురువారం గ్రామ రైతులతో రోడ్డు మీద బైటాయించి ,ధర్నా చేయడం జరిగింది ఈ సందర్భంగా మా ట్లాడుతూ కాంగ్రెస్ ప్రభు త్వం ఇచ్చిన 2 లక్షల రుణ మాఫీ హామీ నీ పూర్తి స్థాయి లో అములు చేయలేదు అని ,ఎన్నికల సమయంలో హామీ ఇచ్చి ఇప్పుడు రుణ మాఫీ చేయని ప్రభుత్వం గద్దె దిగాలి అని రైతులు వ్యాఖ్యానించారు. ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని రైతులు డిమాండ్ చేశారు, ఈ కార్యక్రమం లో గ్రామ రైతులు, ఇరిగి రామలింగయ్య ,గుణగంటి లింగయ్య,ఇర్గి ఎల్లయ్య,నరసింహ ఒర్సు ఇదయ,ఇరిగి అంజమ్మ, మాధగోని ఎల్లమ్మ, సిరివెరి జయమ్మ ప్రజలు,మహిళలు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# 21 మంది పిల్లలపై అత్యాచారం

## హాస్టల్ వార్డెన్‌కు మరణశిక్ష

## మరో టీచరు, హెడ్మాస్టర్‌కు 20 ఏళ్ల వంతున జైలు

## బాధితుల్లో 15 మంది బాలికలు, ఆరుగురు బాలురు

## అరుణాచల్ ప్రదేశ్ పోక్సో కోర్టు తీర్పు

**ఇటానగర్, సెప్టెంబరు 26 :** నైతిక విలువలు మరిచిన గురువులకు న్యాయస్థానం కఠిన శిక్షలు విధించింది. 21 మంది పిల్లలపై అత్యాచారం చేసిన హాస్టల్ వార్డెన్ యుమ్‌కెన్ బగ్రాకు మరణశిక్ష విధిస్తూ అరుణాచల్ ప్రదేశ్లోని యుపియాకు చెందిన ప్రత్యేక పోక్సో కోర్టు గురువారం తీర్పు చెప్పింది. ఇందుకు సహకరించిన మరో ఇద్దరికి 20 ఏళ్ల వంతున జైలు శిక్ష విధించింది. బాధితుల్లో 15 మంది బాలికలు, ఆరుగురు బాలురు ఉన్నారు. వారంతా 6–15 ఏళ్లలోపు ఉన్నవారే. షిమోమీ జిల్లాలోని కారో గవర్నమెంట్ రెసిడెన్షియల్ స్కూల్లో పనిచేసిన ఆ వార్డెన్ 2019–2022 మధ్య ఈ దారుణానికి పాల్పడినట్టు కేసు నమోదయింది. ఈ సంగతి తెలిసినా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయకుండా సహకరించినందుకు అప్పటి హెడ్మాస్టర్ సింగుటున్ యోర్పెన్, హిందీ టీచరు మార్‌బోమ్ నగోమదిర్లకు 20 ఏళ్ల వంతున కఠిన కారాగార శిక్ష విధించింది. పిల్లలకు మత్తుమందు ఇచ్చి, వారు నిద్రలోకి జారుకున్న తరువాత అత్యాచారం చేసినట్టు 'సిట్' దర్యాప్తులో తేలింది. ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరించడంతో ఎవరూ నోరు మెదపలేకపోయారు. కానీ గత ఏడాది నవంబరులో కవలలైన తన ఇద్దరు కుమార్తె(12 ఏళ్లు)లపై అత్యాచారం చేసినట్టు ఓ తండ్రి ఫిర్యాదు చేయడంతో జరిగిన నేరం వెలుగులోకి వచ్చింది. అనంతరం మరికొందరు ఫిర్యాదు చేయడంతో మొత్తం 21 మందిపై లైంగిక వేధింపులకు పాల్పడినట్టు కేసులు నమోదయ్యాయి. వీటిని చూసి వార్డెన్ యుమ్‌కెన్ బగ్రా పరారవగా, పోలీసులు గాలించి ఆ నెల చివర్లో అరెస్టు చేశారు. అనంతరం కోర్టు నిందితునికి బెయిల్ మంజూరు చేసింది. తీవ్రమైన నేరాలు ఉన్నా బెయిల్ ఇవ్వడంపై గౌహతి హైకోర్టు ఇటానగర్ బెంచ్ సుమోటోగా విచారణ జరిపింది. నేర తీవ్రత దృష్ట్యా ఈ ఏడాది జూలైలో బెయిల్‌ను రద్దు చేసింది. పోక్సో కోర్టు విచారణ జరిపి కఠినాతికఠిన శిక్షలు విధించింది. దీనిపై ఎస్పీ రోహిత్ రాజ్‌బీర్ సింగ్ మాట్లాడుతూ ప్రస్తుత కేసు తీవ్రతను దృష్టిలో పెట్టుకోవడంతో పాటు, భవిష్యత్తులో ఇలాంటివి జరగకూడదన్న ఉద్దేశంతో కోర్టు గరిష్ఠ శిక్షలు విధించిందని తెలిపారు.

# పండగలో విషాదం

## బీహార్‌లో వేర్వేరు ప్రాంతాల్లో నదిలో మునిగి 43మంది మృతి

**పాట్నా, సెప్టెంబర్ 26 :** బీహార్‌లో జీవితపుత్రిక పండగ సందర్భంగా వివిధ ప్రాంతాల్లో పవిత్ర స్నానాల పేరుతో నదులు, చెరువుల్లో మునిగి 43 మంది మృతి చెందారు. మరో ముగ్గురు గల్లంతయ్యారు. మృతుల్లో 37 మంది చిన్నారులు ఉన్నారు. ఈ సంఘటనలు బుధవారం 15 జిల్లాల్లో జరిగాయి. ఇప్పటివరకు మొత్తం 43 మృతదేహాలను వెలికి తీయగలిగామని, ఇంకా గాలింపు జరుగుతోందని డిజాస్టర్ మేనేజ్‌మెంట్ విభాగం వెల్లడించింది. ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ మృతుల కుటుంబాలకు రూ. 4 లక్షల వంతున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. అప్పుడే ఎనిమిది కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా పంపిణీ జరిగింది. తూర్పు, పశ్చిమ చంపారన్, నలందా, ఔరంగాబాద్, కైమూరు, బక్సర్, సివాన్, రోహతాస్, సరన్, పాట్నా, వైశాలి, ముజఫర్‌పూర్, సమస్తిపూర్, గోపాల్ గంజ్, అర్వాల్ జిల్లాల్లో ఈ సంఘటనలు జరిగాయి.

# 5న పీఎం కిసాన్ నిధుల విడుదల

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 26 :** కేంద్ర ప్రభుత్వం రైతులకు శుభవార్త తెలిపింది. పీఎం కిసాన్ 18వ విడత నిధులను అక్టోబర్ 5న విడుదల చేయనున్నట్లు గురువారం ప్రకటించింది. ఈ పథకం ద్వారా కేంద్రం ఏటా ఒక్కో రైతుకు రూ. 6 వేల చొప్పున సాయమందిస్తోంది. 2018 డిసెంబర్‌లో ఈ పథకాన్ని ప్రారంభించింది. డీబీటీ ద్వారా డబ్బులు నేరుగా రైతుల ఖాతాల్లో జమవుతున్నాయి. ప్రతి నాలుగు నెలలకొకసారి రూ.2 వేల చొప్పున మూడు వాయిదాలలో డబ్బు ఇస్తున్నారు. పీఎం కిసాన్ యోజన 16వ విడతలో 93 మిలియన్ల మంది రైతులు ఒక్కొక్కరు రూ.2వేల వరకు లబ్ధిపొందారు. పీఎం కిసాన్‌కు అర్హత పొందాలంటే ఈకేవైసీ తప్పనిసరి అంటున్నారు అధికారులు. ఇందుకోసం..

# కొండా లక్ష్మణ్ బాపూజీ కృషి అజరామరం

## బీఆర్ఎస్ అధినేత కేసీఆర్



**హైదరాబాద్, సెప్టెంబరు 26 (మనం న్యూస్):** తెలంగాణ ఆత్మగౌరవం కోసం, పోరాటాలు నడిపిన తొలితరం ఉద్యమ నేతగా కొండా లక్ష్మణ్ బాపూజీ చేసిన కృషి అజరామరమని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కొనియాడారు. రాజకీయవేత్తగా తెలంగాణ అస్తిత్వాన్ని చాటేందుకు బాపూజీ నడిపిన రాజీలేని పోరాటాలు ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమని కేసీఆర్ పేర్కొన్నారు. శుక్రవారం కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని పురస్కరించుకుని ఆయన కృషిని కేసీఆర్ స్మరించుకున్నారు. బడుగుబలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా తన జీవితకాలం పోరాడిన బాపూజీ ఆకాంక్షలకు అనుగుణంగా పదేండ్ల పాలన కొనసాగిందని కేసీఆర్ అన్నారు.

# ఆవిష్కరణలు, అభివృద్ధి వరకే పరిమితం కారాదు



**న్యూఢిల్లీ/పుణె, సెప్టెంబర్ 26 :** సాంకేతిక ఉన్నతీకరణ పేదల సాధికారతకు దోహదపడేలా ఉండాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. ఏ దేశమైనా గొప్ప దార్శనికతను కలిగి ఉన్నప్పుడే ఉన్నత లక్ష్యాలను విధించుకోగలదని పేర్కొన్నారు. జాతీయ సూపర్ కంప్యూటింగ్ మిషన్ కింద స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన మూడు పరమ్ రుద్ర సూపర్ కంప్యూటర్లను ఆయన ఢిల్లీ నుంచి వీడియో లింక్ ద్వారా గురువారం ఆవిష్కరించారు. అనంతరం ప్రసంగిస్తూ.. సాంకేతిక రంగంలో పరిశోధనలు సాధారణ పౌరులకు లబ్ధి కలిగించేలా తమ ప్రభుత్వం చర్యలు తీసుకుందని తెలిపారు. 'జాతీయ సూపర్ కంప్యూటింగ్ మిషన్ను మేం 2015లో ప్రారంభించాం. ప్రస్తుతం క్వాంటమ్ కంప్యూటింగ్ సాంకేతికత బాగా ఊపందుకుంది. దానివల్ల ఐటీ, తయారీ, ఎంఎస్ఎంఈ రంగాలతోపాటు అంకుర సంస్థలు మెరుగువుతున్నాయి' అని పేర్కొన్నారు. కచ్చితమైన వాతావరణ సూచనలను అందించేందుకు దోహదపడేలా రూ.850 కోట్ల వ్యయంతో పుణెలో ఏర్పాటుచేసిన హైపర్ఫార్మెన్స్ కంప్యూటింగ్ సిస్టమ్ను 'అర్కా', 'అరుణిక'లను కూడా మోదీ ప్రారంభించారు.

### మన వాటా టెరాబైట్లు, పెటాబైట్లలో ఉండాలి

శాస్త్ర, సాంకేతిక, పరిశోధన రంగాలకు తమ సర్కారు సముచిత ప్రాధాన్యమిస్తోందని మోదీ పేర్కొన్నారు. '2035 కల్లా మన దేశానికి సొంత అంతరిక్ష కేంద్రం అందుబాటులోకి వస్తుంది. ఆ ప్రాజెక్టు తొలి దశ ఇప్పటికే ఆమోదం పొందింది. మిషన్ గగన్యాన్ సన్నాహాలు మొదలయ్యాయి. 'స్వీయ సాధికారత కోసం సైన్స్' అన్నదే మా మిషన్. ప్రస్తుతం సాంకేతికత, కంప్యూటింగ్ సామర్థ్యాలపై ఆధారపడని రంగమేదీ లేదు. ఈ విప్లవంలో మన వాటా బిట్లు, బైట్లలో కాదు.. టెరాబైట్లు, పెటాబైట్లలో భారీగా ఉండాలి' అని ఆయన చెప్పారు. అంతర్జాతీయ సరఫరా గొలుసులో కీలకంగా మారేలా మన దేశం సొంత సెమీకండక్టర్ వ్యవస్థను నిర్మించుకుంటోందని ప్రధాని తెలిపారు. సైన్స్ ప్రాముఖ్యత కేవలం ఆవిష్కరణలు, అభివృద్ధి వరకే పరిమితం కారాదన్న ప్రధాని.. దేశంలో ఆఖరి పౌరుడి ఆకాంక్షలను సైతం నెరవేర్చేలా ఉండాలన్నారు.

### రూ.130 కోట్ల వ్యయంతో..

ప్రధాని తాజాగా ప్రారంభించిన మూడు సూపర్ కంప్యూటర్లను రూ.130 కోట్ల వ్యయంతో నిర్మించారు. అత్యాధునిక పరిశోధనలకు ఉపయోగపడేలా వాటిని పుణె, ఢిల్లీ, కోల్‌కతాల్లో మోహరించారు. ఫాస్ట్ రేడియో బర్‌స్టస్ (ఎఫ్ఆర్బీ) సహా ఇతర ఖగోళ పరిణామాలను లోతుగా అన్వేషించేందుకు సూపర్ కంప్యూటర్‌ను పుణెలోని జెయింట్ మీటర్ రేడియో టెలిస్కోప్ (జీఎంఆర్టీ) ఉపయోగించుకుంటుంది. మెటీరియల్ సైన్స్, అటామిక్ ఫిజిక్స్‌లో పరిశోధనలను విస్తృతం చేయడంలో ఢిల్లీలోని ది ఇంటర్ యూనివర్సిటీ యాక్సెలరేటర్ సెంటర్ (ఐయూఏసీ)కు సూపర్ కంప్యూటర్ దోహదపడుతుంది. భౌతిక, విశ్వోద్భవ, భూవిజ్ఞాన శాస్త్రాల్లో అత్యాధునిక పరిశోధనల కోసం సూపర్ కంప్యూటర్‌ను కోల్‌కతాలోని ఎస్ఎన్ బోస్ సెంటర్ ఉపయోగించుకుంటుంది.

# లెబనాన్‌పై భూతల దాడులకు సర్వం సిద్ధం!

**టెల్అవీవ్/న్యూఢిల్లీ, సెప్టెంబరు 26:** ఇజ్రాయెల్ పదాతి దళాలు లెబనాన్లోకి చొచ్చుకుపోయి.. భూతల దాడులకు సర్వం సిద్ధం చేస్తున్నాయి. సరిహద్దుల్లో వైమాని క దళాలు, పారాట్రూపర్లతోపాటు.. ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్(ఐడీఎఫ్) పదాతి దళాలు యుద్ధ ట్యాంకర్లను మోహరించినట్లు అధికారులు తెలిపారు. ఓ దశలో అమెరికా, ఫ్రాన్స్ చొరవతో చర్చల ప్రతిపాదన తెరపైకి వచ్చినా.. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు మాత్రం తమ దాడులు కొనసాగుతాయని గురువారం తేల్చి చెప్పారు. ఆ వెంటనే ఐడీఎఫ్ 7వ బ్రిగేడ్ భూతల దాడులపై సరిహద్దుల వద్ద విన్యాసాలు చేసింది. 'నేషనల్ ల్యాండ్ ట్రైనింగ్ సెంటర్' నేతృత్వంలో ఈ విన్యాసాలు జరిగా యి. మరోవైపు బీరుట్, ఇతర ప్రాంతాలపై ఐడీఎఫ్ వైమానిక దళం వరుసగా నాలుగో రోజు– గురువారం కూడా గగనతల దాడులను కొనసాగించింది. బీరుట్లోని అల్–ఖై మ్, పశ్చిమ అల్–బెక, మస్రా, మిదౌన్, అల్–మయాదీన్ పట్టణాలపై దాడులు జరిగాయి. అల్–ఖైమ్లో జరిపిన దాడుల్లో ఓ అపార్ట్మెంట్ నేలమట్టమవ్వగా.. పలు దుకాణాలు, భవనాలు దెబ్బతిన్నట్లు లెబనాన్ వార్తాసంస్థలు తెలిపాయి. హిజ్బుల్లా ఎయిర్ యూనిట్ కమాండర్ మహమ్మద్ హుస్సేన్ సోరౌర్ లక్ష్యంగా ఈ దాడుల్లో.. ఆయనతోపాటు నలుగురు మృతిచెందినట్లు పేర్కొన్నాయి. సిరియా–లెబనాన్ సరిహద్దుల్లోని బాల్బెక్‌పై జరిగిన దాడుల్లో 23 మంది సిరియా శరణార్థులు చనిపోయారని గాజా ఆరోగ్య మంత్రిత్వ శాఖ ప్రకటించింది. మృతుల్లో ప్రముఖ సిరియా గాయకుడు అహ్మద్ అల్–ఖాన్సా కుమారుడు ఉన్నట్లు తెలిపింది. ఈ పరిసరాల్లో.. ముఖ్యంగా బెకా లోయలో సిరియాకు చెందిన 7.8 లక్షల మంది శరణార్థులు ఆశ్రయం పొందు తున్నట్లు వివరించింది. గడిచిన నాలుగు రోజుల్లో ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో మర ణాల సంఖ్య 630కి చేరినట్లు వెల్లడించింది. కాగా.. అల్–అరబీ టీవీ చానల్ ప్రతినిధి రమీజ్ అల్–ఖాదీ గురువారం లైవ్లో ఉండగా.. అతని పైనుంచి ఓ క్షిపణి దూసుకెళ్లిన దృశ్యం నెట్టింట వైరల్‌గా మారింది. తాజా దాడుల్లో లెబనాన్–సిరియా మధ్య ఆయుధాల స్మగ్లింగ్ కోసం ఉగ్రవా దులు ఉపయోగించే సొరంగాలను ధ్వంసం చేసినట్లు ఐడీఎఫ్ ప్రకటించింది. ఐక్యరాజ్య సమితి(ఐరాస) సర్వసభ్య సమావేశాలకు న్యూయార్క్ బయలు దేరిన ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు.. విమానాశ్రయంలో విలేకరులతో మాట్లాడుతూ.. హిజ్బుల్లా అంతమే తమ ధ్యేయమని పునరుద్ఘాటించారు. నెతన్యాహుకు మద్దతిస్తున్న విపక్ష నేతలు కూడా.. కాల్పుల విరమణకు ఎట్టిపరిస్థితుల్లోనూ అంగీకరించకూడదని డిమాండ్ చేశారు.

ఒకవేళ అదే జరిగితే.. తాము సంకీర్ణ ప్రభుత్వం నుంచి వైదొలగుతామని జేపీపీ చీఫ్ ఇతమార్ బెన్–గ్విర్ తీవ్ర స్థా యిలో హెచ్చరించారు. ఇంకోవైపు.. లెబనాన్లోని భారతీయులు వెనక్కి రావాలని విదే శాంగ శాఖ కోరింది. లెబనాన్‌లోని భారతీయ దౌత్య కార్యాలయం ఈ మేరకు వరుస ట్వీట్లు చేసింది. లెబనాన్లో 4 వేల మంది వరకు భారతీయులున్నట్లు వెల్లడించింది. గాజాలో వెంటనే కాల్పుల విరమణను పాటించాలని భారత్‌కు చెందిన ఏడు వామపక్ష పార్టీలు–సీపీఐ, సీపీఎం, సీపీఐ(ఎంఎల్), ఏఐఎఫ్‌బీ, ఆర్ఎస్పీ డిమాండ్ చేశాయి. గురువారం ఢిల్లీలో జరిగిన సమావేశంలో ఆయా పార్టీల ముఖ్య నేతలు ఈ తీర్మానంపై సంతకాలు చేశారు.

# మూసీ సర్వే ఉద్రిక్తం..

## అడ్డుకున్న నివాసితులు అధికారుల నుంచి పత్రాలు లాక్కుని చించివేత

## మార్కింగ్ రంగును విసిరేసిన ఓ యువకుడు తమకు విషమిచ్చి ముందుకు వెళ్లాలంటూ నిరసన

## భారీ బందోబస్తు మధ్య నదీ గర్భంలో మార్కింగ్

## 'డబుల్' ఇళ్లకు వెళ్లిన 10 నిర్వాసిత కుటుంబాలు



**హైదరాబాద్, సెప్టెంబరు 26 (మనం న్యూస్):** మూసీ నదీగర్భం (రివర్ బెడ్) పరిధిలోని నిర్మాణాలకు మార్కింగ్ చేసే ప్రక్రియ ఉద్రిక్తంగా మారింది. గురువారం హైదరాబాద్‌లోని వివిధ ప్రాంతాల్లో పోలీసు బందోబస్తు మధ్య రెవెన్యూ, ఇరిగేషన్, సర్వే విభాగానికి చెందిన అధికారులు ఈ సర్వే చేపట్టారు. మూసీ రివర్ బెడ్లో ఉన్న ఇళ్లు, వాటి యాజమానుల వివరాలు నమోదు చేసేందుకు వచ్చిన అధికారులను పలు ప్రాంతాల్లో నివాసితులు అడ్డుకున్నారు. చైతన్యపురి ఫణిగిరి కాలనీ, వెంకటసాయినగర్ కాలనీ, న్యూ మారుతీ నగర్, సత్య నగర్లో అధికారులతో స్థానికులు వాగ్వాదానికి దిగారు. ఎట్టి పరిస్థితుల్లో సర్వే చేయనివ్వబోమన్నారు. 'సీఎం డౌన్ డౌన్' అని నినాదాలు చేశారు. రెవెన్యూ అధికారుల వద్ద ఉన్న పత్రాలను లాక్కొని చించివేశారు. మార్కింగ్ చేసేందుకు ఉపయోగించే ఎరుపురంగును ఓ యువకుడు సిబ్బంది చేతిలోంచి లాక్కుని దూరంగా విసిరేశాడు. దీంతో ఈ ప్రాంతాల్లో 235 ఇళ్లకు మార్కింగ్ చేయాలని వచ్చిన అధికారులు 10 ఇళ్లకు మాత్రమే మార్కింగ్ చేసి వెనుతిరిగారు. రివర్ బెడ్లో ఉన్నట్లు సూచిస్తూ ఎరుపురంగుతో వేసిన 'ఆర్బీ–ఎక్స్' అనే ముద్రను అధికారులు వెళ్లిపోగానే ఆ ఇళ్ల యాజమానులు అదే రంగుతో తుడిచేశారు. కాగా, మూసానగర్ మురికివాడలో రెవెన్యూ అధికారులకు అడ్డుకోడానికి చేసిన ప్రయత్నాలను పోలీసులు నిలువరించారు. దాంతో అక్కడ సుమారు 30 ఇళ్లకు మార్కింగ్ చేసినట్లు సమాచారం. చాదర్ఘాట్ మూసానగర్ మురికివాడలోని 225 ఇళ్లు మూసీ రివర్ బెడ్లో ఉన్నట్లు గుర్తించారు. రాజేంద్రనగర్, గండిపేట్ మండలాల్లో 332 నివాసాలు, షెడ్లకు మార్కింగ్ వేశారు. అత్తాపూర్ భరత్నగర్, అత్తాపూర్ బ్రిడ్జి, డిఫెన్స్ కాలనీ, మాఫెల్ టవర్స్ ప్రాంతాలు, పురానాపూల్ హరదర్వాజా నుండి చాదర్ఘాట్ సాయిబాబా గుడి వరకు ఉదయం 8 నుంచి సాయంత్రం 3 గంటల వరకు మార్కింగ్ ప్రక్రియ కొనసాగింది. ముసారాంబాగ్ డివిజన్లోని శాలివాహన నగర్, ముసారాంబాగ్, తీగలగూడ సుమారు 70 ఇళ్లను గుర్తించారు. ప్రస్తుతానికి మూసీ రివర్ బెడ్లోని ఇళ్లను మాత్రమే గుర్తించామని, తర్వాత బఫర్ జోన్లో ఉన్న ఇళ్లను గుర్తిస్తామని అధికారులు తెలిపారు. నిర్వాసితులకు ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయిస్తుందని, ఆ తర్వాతే మార్కింగ్ చేసిన ఇళ్లను తొలగిస్తామని స్పష్టం చేశారు.

### మాకు విషమిచ్చి.. ఇళ్లకు మార్కింగ్ చేయండి!

'అయ్యా సీఎం రేవంత్ రెడ్డి సారూ... మూసీ సుందరీకరణ పేరుతో ప్రభుత్వం రిజిస్ట్రేషన్ చేసిన ఇళ్లకు మార్కింగ్ ఇచ్చే ముందు మాకు విషమిచ్చి చంపేయండ'ని చైతన్యపురి ఫణిగిరి కాలనీ, వెంకటసాయినగర్ కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పైసా పైసా కూడబెట్టి కట్టుకున్న ఇళ్లు... 10 నుంచి 20 ఏళ్ల తర్వాత ఇప్పుడు అడ్డువచ్చాయా అని ప్రశ్నించారు. ఇదే సర్వే అప్పట్లోనే చేస్తే ఈ కాలనీల్లో ఇళ్లు కట్టుకునే వాళ్లం కాదు కదా అన్నారు. తమ ఇళ్లను కూల్చి మూసీ సుందరీకరణ చేయాల్సిన అవసరం ఉందా అని ప్రభుత్వాన్ని నిలదీశారు. పలువురు కన్నీళ్లు పెట్టుకున్నారు. చైతన్యపురి డివిజన్ పరిధిలోని వినాయకనగర్ కాలనీలో అధికారులు సర్వే చేపట్టి మార్కింగ్ చేయడంతో, పక్కనే ఉన్న సత్యానగర్ జనప్రియ అవెన్యూ వాసులు సుమారు 500 మంది రోడ్డెక్కారు. ప్రజల తీవ్ర నిరసనతో అధికారులు వెనుదిరిగారు.

### చిన్న పరిశ్రమల యజమానుల ధర్నా

ప్రత్యామ్నాయం చూపిన తర్వాతే తమ ఇళ్లు, షాపులు తొలగించాలంటూ అంబర్‌పేటలో చిన్న పరిశ్రమల యజమానులు ఆలీ కేఫ్ చౌరస్తాలో ధర్నా చేశారు. తాము పట్టా భూములు కొనుక్కుని చిన్నా చితకా పరిశ్రమలు పెట్టుకున్నామని తెలిపారు. వాటి ద్వారా సుమారు 5 వేల మంది ఉపాధి పొందుతున్నామన్నారు. హైకోర్టు స్టే ఉన్నా మార్కింగ్ చేస్తున్నారన్నారు. తమకు ప్రత్యామ్నాయ స్థలాలు, పరిహారం ఇచ్చిన తర్వాతే ఖాళీ చేస్తామని, లేకుంటే ప్రాణాలర్పించడానికైనా సిద్ధమన్నారు. కాగా, రాజేంద్రనగర్, గండిపేట్ మండలాల్లో మూసీ రివర్ బెడ్లో 332 అక్రమణలు ఉన్నాయని గుర్తించి సర్వే చేస్తున్నామని ఆర్డీవో వెంకట్‌రెడ్డి తెలిపారు. 1998, 2000 సంవత్సరాల్లో వచ్చిన వరదలను దృష్టిలో ఉంచుకుని సర్వే చేస్తున్నామన్నారు.

### చెరువులో భవనం.. డిటోనేటర్లతో కూల్చివేత

సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం మల్కాపూర్ పెద్ద చెరువు ఎఫ్టీఎల్లో నిర్మించిన భవనాన్ని కలెక్టర్ ఆదేశాలతో గురువారం కూల్చివేశారు. ప్రస్తుత వర్షాలకు ఆ భవనం చెట్టూ చెరువు నీరు చేరడంతో వాహనాలు వెళ్లే అవకాశం లేక డిటోనేటర్లతో పేల్చివేశారు. భారీ శబ్దానికి ఉలిక్కిపడి బందోబస్తుకు వచ్చిన ఓ హోంగార్డు వెనక్కి పడడంతో తలకు తీవ్ర గాయమైంది. ఈ చెరువులో 2012–13లో స్వామి అనే వ్యక్తి పంచాయతీ అనుమతులతో చెరువు ఎఫ్టీఎల్లో పిల్లర్లు వేసి నాలుగు అంతస్తుల భవనం నిర్మించాడు. అందులోకి వెళ్లేందుకు వంతెనలా కట్టుకున్నాడు.

### డబుల్ బెడ్రూం ఇళ్లకు వెళ్లిన 10 కుటుంబాలు

మలక్‌పేట, ఎల్బీ నగర్ నియోజకవర్గాల మధ్యనున్న భవానీ నగర్లోని సాయిలు, అంబేద్కర్ హట్స్‌లో నివాసముంటున్న పది కుటుంబాలవారు వనస్థలిపురంలోని డబుల్ బెడ్ రూం ఇళ్లకు వెళ్లేందుకు గురువారం సిద్ధమయ్యారు. అధికారులు వారికి వాహనాలను సిద్ధం చేశారు. 30ఏళ్లుగా ఇక్కడే ఉంటున్నామని, మూసీతో అనుబంధాన్ని మరువలేమని బాలమణి, రాములు దంపతులు కంటతడి పెట్టుకున్నారు.

# డ్రోన్ దాడులు చేసినా అణ్వస్త్ర ప్రయోగం!

## ప్రత్యర్థులు భారీ వైమానిక, క్షిపణి దాడులు చేసినా..

## రష్యా అణు విధానంలో అత్యంత కీలకమైన మార్పులు

## పాశ్చాత్య దేశాలకు ఇది హెచ్చరికగా పేర్కొన్న క్రెమ్లిన్

**మాస్కో, సెప్టెంబరు 26 :** ఉక్రెయిన్ నుంచి డ్రోన్ దాడులు భయపెడుతున్న వేళ.. రెండున్నరేళ్లుగా సాగుతున్న యుద్ధం కొలిక్కిరాని సమయంలో.. పాశ్చాత్య దేశాలు మరిన్ని ఆయుధాలిస్తే ప్రత్యర్థిని ఓడిస్తామని జెలెన్ స్కీ కోరుతున్న సందర్భంలో రష్యా అత్యంత కీలక నిర్ణయం తీసుకుంది. తమ అణ్వస్త్ర స్పందన విధానంలో అత్యంత కీలక మార్పులు చేసింది. ఇప్పటివరకు రష్యా లేదా దాని మిత్ర దేశాలను లక్ష్యంగా చేసుకుని బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగిస్తే.. అణ్వాయుధాలను వాడేందుకు రష్యా సిద్ధపడుతుంది. కొత్తగా చేపట్టిన సవరణల ప్రకారం.. వ్యూహాత్మక ఆయుధాలు, వైమానిక, హైపర్ సోనిక్, క్రూయిజ్ క్షిపణులతో పాటు డ్రోన్ దాడులు చేసినా అణ్వస్త్రాలను వాడేందుకు తగిన నిర్ణయం తీసుకుంటుంది. సన్నిహిత దేశమైన బెలార్సపై దాడికి దిగినా రష్యా అణ్వాయుధాలను ప్రయోగిస్తుంది. ఇది ఉక్రెయిన్కు సాయం చేస్తున్న పాశ్చాత్య దేశాలకు ఓ గట్టి హెచ్చరికని రష్యా అధ్యక్ష భవనం క్రెమ్లిన్ ప్రకటించింది. అణ్వాయుధాలే కాక.. ఇతర మార్గాల్లో దాడులకు దిగినా స్పందన ఎలా ఉంటుందో చెప్పేందుకు ఈ మార్పులు చేసినట్లు వివరించింది. రష్యా అధ్యక్షుడు పుతిన్ దేశ భద్రతా మండలి సమావేశంలోనూ కీలక వ్యాఖ్యలు చేశారు. అణ్వస్త్ర విధానంలో మార్పుల గురించి ప్రస్తావించారు. తమపై దాడి చేస్తోన్న అణ్వస్త్రాలు లేని దేశానికి (ఉక్రెయిన్).. అణ్వస్త్రాలున్న మరో దేశం అండగా నిలుస్తోందంటూ మండిపడ్డారు. దీనిని ఆ రెండు దేశాలు కలిపి చేస్తున్న దాడిగానే చూస్తామన్నారు. పాశ్చాత్య దేశాలు సరఫరా చేసిన దీర్ఘశ్రేణి ఆయుధాలతో తమ మీద దాడి చేసేందుకు ఉక్రెయిన్‌కు అనుమతిస్తే.. నాటో కూటమి కూడా యుద్ధంలో చేరినట్లేనని భావిస్తామని స్పష్టం చేశారు.

# బీజేపీకి ప్రజలే బుద్ధి చెబుతారు

**ఛండీగఢ్, సెప్టెంబర్ 26 :** దేశంలో నిరుద్యోగ సమస్య తాండవిస్తోందని లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ అన్నారు. ప్రధాని మోదీ పక్కా ప్రణాళిక ప్రకారం ఉపాధి రంగాన్ని నిర్వీర్యం చేశారని విమర్శించారు. దేశంలో ఉద్యోగాల కొరతకు మోదీ కారణం కాదా? అని ప్రశ్నించారు. హరియాణా అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన చండీగఢ్‌లో పర్యటించారు. ప్రధాని మోదీ ప్రజలను విభజించి పాలిస్తున్నారనీ, ఒకరిని చూసి మరొకరు అసహ్యించుకునేలా తయారు చేశారని మండిపడ్డారు. హరియాణాలో బీజేపీ కుప్పకూలడం ఖాయమని, తాజా ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ తుఫాను రాబోతోంది. అందులో బీజేపీ కొట్టుకుపోవడం పక్కా. రాష్ట్రాన్ని ఆ పార్టీ సర్వనాశనం చేసింది. అందుకు ప్రజలు కచ్చితంగా బుద్ధి చెబుతారు. ఇటీవల అమెరికా వెళ్లినప్పుడు అక్కడ ఉంటున్న హరియాణా వాసులను కలిశాను. డల్లాస్, టెక్సాస్‌లో ఒక్కో గదిలో 15 నుంచి 20 మంది ఉన్నారు. ఇక్కడికెలా వచ్చారని అడిగితే.. హరియాణాలో కనీసం ఉపాధి దొరకడం లేదు. ఎలాగైన బతుకుసాగించాలన్న ఉద్దేశంతో ప్రమాదకర స్థితిలో కజకిస్థాన్, తుర్కియే, దక్షిణ అమెరికా దేశాలు దాటి వచ్చి ఇక్కడ జీవనం సాగిస్తున్నామని చెప్పారు. కొందరు తమ వ్యవసాయ భూమిని విక్రయించి, ఆ డబ్బులతో అమెరికా వెళ్లినట్లు చెప్పారు. ఇక్కడే ఉపాధి అవకాశాలు ఉంటే యువతకు ఇలాంటి గతి పట్టేదా? ప్రజల తలరాతలు మారాంటే.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావాలని రాహుల్ గాంధీ అన్నారు.

# గృహ హింస చట్టం మతాతీతం: సుప్రీం

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 26:** 'గృహ హింస చట్టం, 2005' దేశంలోని ప్రతి మహిళకు గృహ హింస నుంచి రక్షణ కల్పిస్తుందని.. మతం, సామాజిక నేపథ్యంతో సంబంధం లేకుండా స్త్రీలందరికీ ఇది వర్తిస్తుందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. రాజ్యాంగం మహిళలకు ఇచ్చిన హక్కుల రక్షణకు ఈ చట్టం ఇతోధికంగా దోహదపడుతుందని తెలిపింది. జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఎన్ కోటీశ్వర్సింగ్లతో కూడిన ధర్మాసనం గురువారం ఈ తీర్పును వెలువరించింది. తన భర్త నుంచి భరణం, పరిహారానికి సంబంధించిన కేసులో కర్ణాటక హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ ఒక మహిళ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ జరిపింది.

మనం

Follow : @Manamnews



## గంభీర్ మాస్టర్ ప్లాన్.. కేఎల్ రాహుల్‌కు స్పెషల్ ట్రైనింగ్




భారత్-బంగ్లాదేశ్ మధ్య రెండో టెస్టుకు రంగం సిద్ధమైంది. కాన్పూర్ వేదికగా రేపటి నుంచి చివరి టెస్టు ప్రారంభం కానుంది. చెపాక్ వేదికగా జరిగిన తొలి టెస్టులో భారత్ 280 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించింది. అదే జోరును కాన్పూర్ టెస్టులోనూ ప్రదర్శించి సిరీస్ను క్లీన్ స్వీప్ చేయాలని టీమిండియా పట్టుదలతో సన్నద్ధమవుతోంది. ఈ క్రమంలో భారత ఆటగాళ్లు కఠోర సాధన చేస్తున్నారు. నెట్స్‌లో చెమటోడుస్తున్నారు. అయితే కేఎల్ రాహుల్‌కు టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ ప్రత్యేక శిక్షణ ఇచ్చాడు. తొలి టెస్టులో రాహుల్ 16, 22 (నాటౌట్) పరుగులు చేశాడు. అయితే మొదటి ఇన్నింగ్స్‌లో రాహుల్ స్పిన్ బౌలింగ్‌లో సునాయసంగా వికెట్ సమర్పించుకన్నాడు. మెహది హసన్ మిరాజ్ వేసిన బంతిని సరిగ్గా డిఫెన్స్ చేయడంలో విఫలమై షార్ట్ లెగ్లో ఉన్న జకీర్ హసన్‌కు రాహుల్ చిక్కాడు. దీంతో రాహుల్ స్పిన్ను సమర్థవంతంగా ఎదుర్కోవడంపై దృష్టి సారించాడు. అయితే నెట్స్‌లో రాహుల్‌ను చూసి గంభీర్ వెంటనే అక్కడకు చేరుకు న్నాడు. స్పిన్లో తన కాళ్లను మరింత మెరుగ్గా ఉపయోగించాలని రాహుల్‌కు గంభీర్ సూచించాడు. ఆ తర్వాత రాహుల్ క్రీజును వదిలి బయటకు వచ్చి భారీ షాట్లు ఆడాడు. ఆ తర్వాత రాహుల్‌ను తన మణికట్టును ఉపయోగించి సింగిల్స్‌కు షాట్లు ఆడమని చెప్పాడు. దానికి తగ్గట్లుగా రాహుల్ మెరుగ్గా శిక్షణ పూర్తిచేశాడు. లక్నో సూపర్ జెయింట్స్‌తో కెప్టెన్‌గా రాహుల్, మెంటార్ గంభీర్ కలిసి పనిచేసిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి వీరిద్దరి మధ్య స్నేహబంధం బలంగా మారింది. ఇటీవల తొలి టెస్టు తుదిజట్టు ఎంపిక గురించి మాట్లాడుతూ రాహుల్ సామర్థ్యంపై గంభీర్ ప్రత్యేకంగా మాట్లాడాడు. రాహుల్‌కు గొప్ప నైపుణ్యం ఉందని, అలాంటి ప్లేయర్ కోసం సర్ఫరాజ్ ఖాన్ వంటి ఆటగాడు మెరుగైన ప్రదర్శన చేసినప్పటికీ బెంపై ఉండాల్సి వస్తుందని గంభీర్ అన్నాడు. కాగా, ఈ సంఘటనల తో కేఎల్ రాహుల్‌పై గంభీర్ ప్రత్యేక చొరవ తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. రాహుల్‌ను మూడు ఫార్మాట్లలో టీమిండియాలో కీలక ఆటగాడిగా మార్చాలని గంభీర్ ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం రాహుల్ వన్డే, టెస్టు జట్టులోనే కొనసాగుతున్నాడు. కాగా, 2014లో టెస్టుల్లో అరంగేట్రం చేసిన రాహుల్ ఓ దశలో భారత భవిష్యత్ కెప్టెన్‌గా పేరు పొందాడు. కానీ ఆ తర్వాత క్రమంగా తుదిజట్టులో చోటు కోసం ఎదురుచూసే పరిస్థితికి వచ్చాడు. ఇప్పుడు గంభీర్ రాకతో రాహుల్ భవిత్యవం మారుతుందని క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# రిటైర్‌మెంట్ ప్రకటించిన షకిబ్ అల్ హసన్





బంగ్లాదేశ్ స్టార్ ఆల్రౌండర్ షకిబ్ అల్ హసన్ టీ20లకు రిటైర్మెంట్ ప్రకటించాడు. అంతర్జాతీయ టీ20లకు వీడ్కోలు పలుకుతున్నట్లు గురువారం వెల్లడించాడు. భారత్‌తో కాన్పూర్ వేదికగా నేటి నుంచి రెండో టెస్టు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో షకిబ్ ఈ ప్రకటన చేశాడు. టీ20లతో పాటు వన్డే, టెస్టు ఫార్మాట్ రిటైర్మెంట్ గురించి షకిబ్ కీలక విషయాలు పేర్కొన్నాడు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరగనున్న ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీతో 50 ఓవర్ల ఫార్మాట్కు వీడ్కోలు పలుకుతున్నట్లు తెలిపాడు. ఇక బంగ్లాదేశ్లో మీర్పూర్ వేదికగా తన ఫైనల్ టెస్టు ఆడాలని భావిస్తున్నట్లు చెప్పాడు. అయితే భద్రతా సమస్యలు తలెత్తితే రేపటి టెస్టు మ్యాచే తన చివరిది కావొచ్చని షకిబ్ పేర్కొన్నాడు. అక్టోబర్ 21 నుంచి స్వదేశంలో దక్షిణాఫ్రికాతో రెండు టెస్టుల సిరీస్‌ను బంగ్లాదేశ్ ఆడనుంది. అయితే బంగ్లాదేశ్‌లో రాజకీయ సంక్షోభం ఏర్పడింది. షేక్ హసీనా ప్రభుత్వం రద్దు అవ్వడంతో తన ఎంపీ పదవినీ షకిబ్ కోల్పోయాడు. మరోవైపు షకిబ్‌పై హత్యానేరం కింద కేసు కూడా నమోదైంది. బంగ్లాదేశ్‌లో జరిగిన ఘర్షణల్లో ప్రాణాలు కోల్పోయిన రుబెల్ అనే యువకుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. ఈ కేసులో 28వ నిందితుడిగా షకిబ్ ఉన్నాడు. కాగా, 2007 టీ20 ప్రపంచకప్ నుంచి ఇటీవల జరిగిన 2024 టీ20 వరల్డ్ కప్ వరకు షకిబ్ బంగ్లాదేశ్ తరఫున బరిలోకి దిగాడు. ఈ టోర్నీలో అత్యధిక వికెట్లు సాధించిన ప్లేయర్గా 50 వికెట్లతో రికార్డు నెలకొల్పాడు. ''రిటైర్మెంట్ గురించి బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డుకు చెప్పాను. చివరి టెస్టు మీర్పూర్ వేదికగా ఆడాలని ఉందని తెలిపాను. బోర్డు దీనికి అంగీకరించింది. టెస్టు నిర్వహించడానికి వాళ్లు ప్రయత్నిస్తున్నారు. అయితే అది సాధ్యం కాకపోతే కాన్పూర్ వేదికగా భారత్‌తో జరిగే టెస్టే ఆఖరిది'' అని షకిబ్ పేర్కొన్నాడు.

### భారత్-పాకిస్థాన్‌కు ఉన్న తేడా అదే!

భారత్-బంగ్లాదేశ్ మధ్య రెండో టెస్టుకు రంగం సిద్ధమైంది. కాన్పూర్ వేదికగా రేపటి నుంచి చివరి టెస్టు ప్రారంభం కానుంది. చెపాక్ వేదికగా జరిగిన తొలి టెస్టులో భారత్ 280 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించింది.

పాకిస్థాన్ను వాళ్ల సొంతగడ్డపై ఓడించి 2-0తో టెస్టు సిరీస్ క్లీన్ స్వీప్ చేసిన బంగ్లాదేశ్ అదే జోరును భారత్ గడ్డపై చూపించలేదు.

భారత బౌలర్ల ధాటికి బంగ్లా బ్యాటర్లు నిలవలేకపోయారు. ఇక భారత బ్యాటర్లు సాధికారిక బ్యాటింగ్‌కు బంగ్లాదేశ్ బౌలర్లు నిస్సహాయులుగా మారిపోయారు. అయితే టెస్టుల్లో భారత్-పాకిస్థాన్ మధ్య ఉన్న వ్యత్యాసాన్ని బంగ్లాదేశ్ స్టార్ ఆల్రౌండర్ షకిబ్ అల్ హసన్ వివరించాడు. గురువారం మీడియా సమావేశంలో పాల్గొన్న షకిబ్ అయితే భద్రతాపరమైన కారణాలతో ఆ మ్యాచ్ జరగకపోతే నేడు జరిగే కాన్పూర్ మ్యాచే తన ఆఖరి టెస్టు అని అన్నాడు.

భారత్, పాకిస్తాన్ గురించి మాట్లాడుతూ.. ''బంగ్లాదేశ్‌కు టీమిండియా వచ్చినప్పుడు మేం వన్డే సిరీస్ గెలిచాం. ఇక టెస్టు మ్యాచ్ను దాదాపు గెలిచేంతగా పోరాడాం. చెపాక్ వేదికగా జరిగిన తొలి టెస్టులో మా స్థాయికి తగ్గట్లు ఆడలేకపోయాం. ఇక భారత్ పర్యటన అంటే అత్యంత కఠినమైనది. సొంతగొడ్డపై వాళ్లు ఓడిపోవడాన్ని మనం ఇటీవల చూడలేదు. భారత్ లేదా ఇతర పెద్ద జట్లతో మ్యాచ్ అంటే గొప్పగా రాణిస్తేనే సత్తాచాటగలం' ''టెస్టు క్రికెట్లో ప్రస్తుత పాకిస్థాన్‌కు అనుభవం లేదు. అదే భారత్ గురించి మాట్లాడా లంటే ఇది పెద్ద విషయం. టీమిండియా నంబర్ వన్ జట్టు. గతకొన్నేళ్లుగా సొంతగడ్డపై పరాజయం ఎరుగని జట్టు. భారత్‌కు ఏ టీమ్ వచ్చినా అది ఇబ్బంది పడాల్సిందే'' అని షకిబ్ అల్ హసన్ పేర్కొన్నాడు.

## ప్రజా క్షేత్రంలో రెజ్లర్ల పోటీ



భారత స్టార్ రెజ్లర్లు వినేశ్ ఫొగాట్, కవిత దలాల్. వీరిద్దరు గతంలో ఒకరికోసం ఒకరు నిలబడ్డారు. కానీ ఇప్పుడు ప్రత్యర్థుల్లా తలబడుతున్నారు. అయితే అది మ్యాచ్‌పై కాదు ప్ర జా క్షేత్రంలో. హర్యానాలోని జింద్ జిల్లాలోని జులానా నియోజకవర్గం నుంచి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీపడతున్నారు. కాంగ్రెస్ నుంచి వినేశ్, ఆమ్ ఆద్మీ పార్టీ నుంచి కవిత పోటీ చేస్తున్నారు. గతంలో రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా మాజీ అధ్యక్షుడు బ్రిజ్భూషణ్ సింగ్‌కు వ్యతిరేకంగా వినేశ్ ఫొగాట్, కవిత దలాల్ కలిసి జంతర్ మంతర్ వద్ద పోరాడారు. వినేశ్ పక్కన కూర్చొని కవిత పూర్తి మద్దతు ఇచ్చింది. కానీ ఇప్పుడు ఎన్నికల్లో ఇద్దరూ పోటీపడుతున్నారు. అయితే దీని గురించి ప్రముఖ జాతీయ మీడియాతో వారిద్దరు మాట్లాడారు. ''ఓ మహిళగా నేను వినేశ్ ఫొగాట్‌కు మద్దతు ఇస్తానని, ఆమెకు శుభాకాంక్షలు తెలుపుతానని అందరికి తెలుసు. కానీ ఆ గొడవను వినేశ్ ఫొగాట్, కాంగ్రెస్ రాజకీయం చేశారు. రెజ్లింగ్ రాజకీయంగా మార్చి ఎన్నికలు గెలవాలని చూస్తున్నారు. జులానా ప్రజలు దీన్ని తప్పక గమనిస్తున్నారని, నేను విజయం సాధిస్తానని తెలుసు. అధికారంలో ఉన్నప్పుడు కాంగ్రెస్, బీజేపీ కాని ఇక్కడ ప్రజలకు ఏమీ చేయలేదు. కానీ మేం చేస్తాం. ఇక ఓ మహిళగా వినేశ్‌కు మద్దతు ఇస్తా, అలాగే నేను పోరాడి ఆమెను ఓడిస్తా''**- కవిత దలాల్**

'' నేను పోటీకి ఎప్పుడూ సిద్ధమే. రెజ్లింగ్‌లో పోటీకి రాకుండా ఎవరినైనా ఆపగలమా? ఇప్పుడు ఆమెను రమ్మందాం. జంతర్ మంతర్ వద్ద ఆమె నాతో కలిసి ఉంది. కానీ ఆమెతో ఇక్కడ పోటీకి సిద్ధంగా ఉన్నాను. ఇక నేను ఐశ్వర్య రాయ్ను ఏం కాదు. నా పనిని నేను ఎంచుకున్నాను. నా పనితనం ఫలితాన్ని చూపుతుంది ''**- వినేశ్ ఫొగాట్**

జులాన్ నియోజకవర్గంలో జాట్ వర్గం ఎక్కువగా ఉంటుంది. వినేశ్, కవిత ఇద్దరూ జాట్ వర్గానికి చెందినవారే. ఈ నేపథ్యంలో జులాన్ ఎన్నికలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. బీజేపీ నుంచి యోగేశ్ బైరాగి పోటీ చేస్తున్నారు.

### యువ భారత్ క్లీన్‌స్వీప్

ఆస్ట్రేలియాతో జరుగుతున్న అండర్-19 వన్డే సిరీస్‌లో భారత్ క్లీన్‌స్వీప్ చేసింది. గురువారం మూడో వన్డేలో యువ భారత్ ఏడు పరుగుల తేడాతో ఆసీస్‌పై విజయం సాధించింది. మూడు మ్యాచ్‌ల సిరీస్ను 3-0తో కైవసం చేసుకుంది. మొదట భారత్ 50 ఓవర్లలో 8 వికెట్లకు 324 పరుగుల భారీస్కోరు సాధించింది. రుద్ర పటేల్ (77; 81 బంతుల్లో 8X4, 3X6), హర్వంశ్ పంగాలియా (46; 47 బంతుల్లో 5X4), కెప్టెన్ మహ్మద్ అమాన్ (71; 72 బంతుల్లో 6X4, 1X6) సత్తాచాటి జట్టుకు మంచి స్కోరు అందించారు.

# సితార సంకల్పమే నాకు స్ఫూర్తి



''ఈ ఆధునిక యుగంలో కుటుంబ బంధాల విలువల్ని, స్త్రీల గొప్పతనాన్ని ప్రేక్షకులకు కళ్లకు కట్టినట్లు చూపిస్తుంది మా 'లవ్ సితార' చిత్రం'' అని అంటోంది శోభితా ధూళిపాళ్ల. ఆమె ప్రధాన పాత్రలో నటించిన చిత్రమిది. వందనా కటారియా దీన్ని తెరకెక్కించారు. ఇటీవలే విడుదలైన ట్రైలర్, పోస్టర్లకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వచ్చింది. ఓ పంజాబీ చెఫ్‌తో ప్రేమలో పడిన సితార వివాహం చుట్టూ ఈ సినిమా కథ తిరుగుతుంది. రోనీ స్క్రూవాలా నిర్మిస్తున్న ఈ సినిమా శుక్రవారం విడుదల కానుంది. ఈ సందర్భంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె.. ఇందులోని తన పాత్ర గురించి కొన్ని ఆసక్తికర విషయాలను పంచుకుంది. ''ఈ చిత్రంలో ప్రతి పాత్ర సవాలుగా, కొత్తగా ఉంటుంది. ఇందులో నేను ప్రేమ గొప్పతనాన్ని తెలిపే సితార అనే అమ్మాయిగా కనిపిస్తాను. ఈమె చాలా తెలివైనది. ప్రతి విషయంలో సూటిగా, నిజాయతీగా ఉంటుంది. ఆమె ధైర్యం, సంకల్పం నాకెంతో స్ఫూర్తినిచ్చాయి. ఈ అంశాలే నేను ఈ పాత్రలో నటించడానికి ముఖ్య కారణం. ప్రస్తుత సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న సవాళ్లు, కుటుంబ విలువల్ని తెలియజేస్తుందీ చిత్రం'' అని చెప్పుకొచ్చింది శోభిత.

# లారెన్స్ సరసన ప్రియాంక

'సరిపోదా శనివారం'తో ఇటీవలే తెలుగు ప్రేక్షకుల్ని పలకరించింది కథానాయిక ప్రియాంక అరుల్ మోహన్. ఇప్పుడామె మరో కొత్త ప్రాజెక్టుకు సంతకం చేసినట్లు తెలుస్తోంది. తమిళ హీరో రాఘవ లారెన్స్ ప్రధాన పాత్రలో 'బెంజ్' అనే చిత్రంలో నటిస్తున్నట్లు ఇటీవలే ప్రకటించింది చిత్రబృందం. 'రెమో' ఫేమ్ బక్కియరాజ్ కన్నన్ దీన్ని తెరకెక్కిస్తున్నారు. యాక్షన్ థ్రిల్లర్ నేపథ్యంలో రూపొందుతున్న ఈ చిత్రానికి లోకేశ్ కనగరాజ్ కథను అందిస్తున్నారు. తాజాగా ఇందులో రాఘవ సరసన నటించడానికి ప్రియాంకను ఎంపిక చేసిందట చిత్రబృందం. ఇందులో నటించడానికి ఆమె ఉత్సాహంగా ఉన్నట్లు, త్వరలో ఈ విషయాన్ని ప్రకటించడానికి సన్నాహాలు చేస్తున్నట్లు చిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి. తెలుగులో విష్వక్ సేన్ హీరోగా కె.వి.అనుదీప్ దర్శకత్వంలో ఓ సినిమా పట్టాలెక్కనుంది. దీనికోసం నాయికగా ప్రియాంక పేరు పరిశీలనలో ఉన్నట్లు సమాచారం.




# ఇకపై జాగ్రత్త పడతా



మృణాల్ ఠాకూర్ పోస్ట్ చేసిన ఓ ఫొటో ఆమెకు కొత్త చిక్కులు తెచ్చిపెట్టింది. మృణాల్ ఓ చిన్న బేబీతో ఆడుకుంటున్న ఫొటో అది. ఉయ్యాలలో పడుకొని ఉన్న ఆ బేబీ.. తన చిన్ని చిన్ని పాదాలతో మృణాల్ ఎదలపై తంతుంటే.. మృణాల్ ఆనందంతో తెగ మురిసిపోతూ కనిపిస్తున్నది ఆ ఫొటోలో. అంతేకాదు, తనను పర వశింపజేస్తున్న ఆనందక్షణాలివి అంటూ 'The shot that made you cry' అంటూ ఓ ఆసక్తికరమైన క్యాప్షన్ కూడా ఆ ఫొటోతో పొందుపరిచింది మృణాల్. ఇక నెటిజన్స్ ఆ ఫొటో కింద కామెంట్లతో చెలరేగి పోతున్నారు. 'పెళ్లి లేదు.. ప్రెగ్నెన్సీ లేదు.. బేబీ ఎక్కడ్నుం చొచ్చింది?' అంటూ ఒకరు.. 'పెళ్లికి ముందే బేబీని కనే శావా?' అంటూ ఇంకొకరు. ఇలా రకరకాల కామెంట్లతో ఆ ఫొటోని తెగ వైరల్ చేస్తున్నారు. దీనిపై మృణాల్ స్పందిస్తూ ' పసిపిల్లలను ఎత్తుకొని ఆడించడం కూడా డేంజరే అని ఇప్పుడే తెలిసింది. ఇకనుంచి జాగ్రత్త పడతా.. థ్యాంక్యూ' అంటూ పేర్కొన్నది.

# పవర్‌ఫుల్ 'పొట్టేల్'




యువచంద్రకృష్ణ, అనన్య నాగళ్ల లీడ్రోల్స్ చేస్తున్న చిత్రం 'పొట్టేల్'. పల్లెటూరి నేపథ్యంలో సాగే ఈ విభిన్న కథా చిత్రానికి సాహిత్ మోత్కూరి దర్శకుడు. నిశాంక్ రెడ్డి కుడితి, సురేశ్‌కుమార్ సడిగె నిర్మాతలు. అజయ్ ఈ సినిమాలో కీలక పాత్ర పోషిస్తున్నారు. అజయ్ పుట్టినరోజు సందర్భంగా ఆయన పాత్రని పరిచయం చేస్తూ ఓ పోస్టర్‌ని గురువారం మేకర్స్ విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో షర్టు, లుంగీ ధరించి, జీపుపై కూర్చొని పవర్‌ఫుల్ ఫెరోషియస్ అవతార్‌లో అజయ్ కనిపిస్తున్నారు. దసరా కానుకగా ఈ సినిమా విడుదల కానుంది. ఈ చిత్రానికి కెమెరా: మోనిష్ భూపతిరాజు, సంగీతం: శేఖర్‌చంద్ర, నిర్మాణం: నిసా ఎంటర్‌టైన్‌మెంట్స్, ప్రజ్ఞ సన్నిధి క్రియేషన్స్.

# స్పిరిట్ విలన్లుగా స్టార్ కపుల్స్?



ప్రభాస్ ప్రస్తుతం చేస్తున్న సినిమాల్లో రాజాసాబ్, ఫౌజీ చిత్రీకరణ దశలో ఉంటే.. స్క్రిప్ట్ దశలో 'కల్కి' సెకండ్ పార్ట్ ఉంది.ఈ మూడు సినిమాలూ ఒకెత్తు అయితే.. సందీప్‌రెడ్డి వంగా 'స్పిరిట్' ఒకెత్తు. ప్రస్తుతం 'స్పిరిట్' ప్రీప్రొడక్షన్ దశలో ఉంది. ప్రభాస్ సినిమాలన్నీ అభిమానులకు సమానమే.. 'స్పిరిట్' కాస్త ఎక్కువ సమానం అన్నట్టుగా ఉంది ప్రజెంట్ సిట్యువేషన్. సందీప్ రెడ్డి స్టైల్ హీరోగా ప్రభాస్‌ని ఎప్పుడెప్పుడు చూస్తామా అని ఆతృతగా ఎదురుచూస్తున్నారు ఫ్యాన్స్. తాజాగా 'స్పిరిట్'కి సంబంధించిన ఓ ఆసక్తికరమైన అప్‌డేట్ వెలుగు చూసింది. ఇందులో విలన్స్‌లా స్టార్ కపుల్స్ సైఫ్ అలీఖాన్, కరీనా కపూర్లను సందీప్‌రెడ్డి ఎంచుకున్నారట. సైఫ్, కరీనా ఇందులో క్రూయల్ వైఫ్ అండ్ హస్బెండ్‌గా కనిపిస్తారట. ఇటీవలే ఈ జంటను కలిసి కథను, కేరక్టర్లను వివరించారట సందీప్. వారికి ఈ పాత్రలు బాగా నచ్చాయని, చేయడానికి ఉత్సాహం చూపించారని బీటౌన్ సమాచారం. ఇక ఇందులో ప్రభాస్ పవర్‌ఫుల్ పోలీస్‌గా కనిపించనున్న విషయం తెలిసిందే. ఈ పాత్రతో పాటు మరో వైవిధ్యమైన పాత్రలో కూడా ప్రభాస్ కనిపించనున్నారని బాలీవుడ్ సమాచారం. నిజానిజాలు తెలియాలంటే ఇంకొన్ని రోజులు ఆగాల్సిందే.

Printed and Published by **VUPPARI RAMESH KUMAR** on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No: 98/1, CIE Phase II, Gandhinagar, Quthabullapur Mandal, Medchal-Malkajgiri, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, **EDITOR: VUPPARI RAMESH KUMAR**. **RNI Reg No.TELTEL/2016/72952**.